

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00

సంపుటి: 12
సంచిక: 106

ఆదివారం 7-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## ఆనందం ఐదింతలు...

శ్రీలంకతో చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్లతో గెలిచింది. ఈ టోర్నీలో రోహిత్‌శర్మ ఐదో సెంచరీ (103)తో చెలరేగాడు. ఒకే ప్రపంచ కప్‌లో 5 సెంచరీలు చేసిన తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. రోహిత్‌తోపాటు రాహుల్ కూడా శతకం బాదాడు.

- స్పోర్ట్స్‌లో




సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
7-7-2019

# కష్టాల్లో ఆస్ట్రేలియా

## విజయలక్ష్యం 326 • ప్రస్తుతం 174/4


డు ప్లెసిస్

**మాంచెస్టర్:** ప్రపంచ కప్ ఆసాంతం నిరాశజనక ప్రదర్శన కనబర్చిన దక్షిణాఫ్రికా... తమ ఆఖరి మ్యాచ్‌లో పటిష్ట ఆస్ట్రేలియాకు భారీ లక్ష్యం నిర్దేశించింది. రెండు జట్ల మధ్య శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీలు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేశారు. కెప్టెన్ డు ప్లెసిస్ (94 బంతుల్లో 100; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) చక్కటి సెంచరీ సాధించగా; వాన్ డెర్ డుసెన్ (97 బంతుల్లో 95; 4 ఫోర్లు, 4 సిక్స్‌ల) త్రుటిలో అవకాశం చేజార్చుకున్నాడు. ఓపెనర్ డికాక్ (51 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. స్టార్క్ (2/59), లయన్ (2/53) రెండేసి వికెట్లు తీశారు. 326 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా కడపటి వార్తలు అందే సమయానికి 33 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఓపెనర్ వార్నర్ (93 బ్యాటింగ్), అలెక్స్ క్యారీ (28 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు దక్షిణాఫ్రికా జట్టుకు మార్క్‌రమ్ (37 బంతుల్లో 34; 6 ఫోర్లు, సిక్స్)... డికాక్‌తో కలిసి దక్షిణాఫ్రికాకు శుభారంభం అందించాడు. ఎడాపెడా బౌండరీలతో చెలరేగిన వీరు తొలి వికెట్‌కు 69 బంతుల్లోనే 79 పరుగులు జత చేశారు. 15వ ఓవర్‌కే జట్టు స్కోరు 100 దాటింది. డికాక్ ఔటయ్యాక డుసెన్, డు ప్లెసిస్ ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఈ జోడీ కంగారూ బౌలర్లను దీటుగా ఎదుర్కొని మూడో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసింది. డు ప్లెసిస్ సెంచరీ (93 బంతుల్లో) తర్వాత వెంటనే వెనుదిరిగినా డుసెన్ ఆఖరి వరకు నిలిచాడు. కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడుతున్న డుమిని (14)తో పాటు ప్రిటోరియస్ (2) విఫలమయ్యారు. 95 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇన్నింగ్స్ ఆఖరి బంతిని సిక్స్‌గా మలిచే ప్రయత్నంలో భారీ షాట్ కొట్టబోయి డుసెన్ ఔటయ్యాడు. ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌తోనే మ్యాచ్‌లో దిగిన దక్షిణాఫ్రికా అంచనాలకు మించిన స్కోరు చేయడం విశేషం.

## ప్రిక్వార్టర్స్‌లో ఫెడరర్, నాదల్

**లండన్:** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), మూడో సీడ్ రాఫెల్ నాదల్ (స్పెయిన్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో ఫెడరర్ 7–5, 6–2, 7–6 (7/4)తో లుకాస్ పుయి (ఫ్రాన్స్)పై, మూడో సీడ్ నాదల్ 6–2, 6–3, 6–2తో సోంగా (ఫ్రాన్స్)పై గెలిచారు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో సెరెనా విలియమ్స్ (అమెరికా) 6–3, 6–4తో జులియా జార్జెస్ (జర్మనీ)పై, టాప్ సీడ్ యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా) 6–1, 6–1తో హరియెట్ డార్ట్ (బ్రిటన్)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు.

## ఫైనల్లో శ్రీకృష్ణప్రియ



**సాక్షి, హైదరాబాద్:** కోట్ డి ఐవరీ ఓపెన్ అంతర్జాతీయ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి కుదరవెల్లి శ్రీకృష్ణప్రియ ఫైనల్లోకి ప్రవేశించింది. ఐవరీకోస్ట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన శ్రీకృష్ణప్రియ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో 21–16, 21–19తో అజోక్ అడ్సోకన్ (నైజీరియా)పై నెగ్గింది. శ్రీకృష్ణప్రియ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–2, 21–4తో నఫీసాతు (ఐవరీకోస్ట్)పై, క్వార్టర్ ఫైనల్లో 21–17, 21–17తో దోహా హ్యానీ (ఈజిప్ట్)పై విజయం సాధించింది.




## రోహిత్ స్పెషల్...

**మం**చినీళ్లప్రాయంగా సెంచరీలు బాదుతున్న రోహిత్ నుంచి మరో సునాయాస శతకం జాలువారింది. శ్రీలంక బౌలర్లను అసలు ఏమాత్రం లెక్క చేయకుండా నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నంత సునాయాసంగా రోహిత్ బ్యాటింగ్ సాగింది. రజిత వేసిన రెండో ఓవర్లో కొట్టిన ఫోర్‌తో మొదలైన పరుగుల ప్రవాహం సెంచరీ వరకు సాగింది. మలింగ ఓవర్లో రెండు వరుస ఫోర్ల అనంతరం రజిత తర్వాతి ఓవర్లోనూ రెండు ఫోర్లు కొట్టి రోహిత్ దూసుకుపోయాడు. సిల్వా వేసిన బంతిని భారీ సిక్సర్‌గా మలచి 48 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న రోహిత్ అదే ఓవర్లో మరో భారీ సిక్సర్ బాదాడు. ఉదాన ఓవర్లో రెండు బౌండరీలతో 90ల్లోకి చేరుకున్న రోహిత్... రజిత బౌలింగ్‌లో పుల్ షాట్‌తో ఫోర్ కొట్టి అరుదైన శతకాలు పూర్తి చేసుకున్నాడు. ఒకే ప్రపంచకప్‌లో ఐదో సెంచరీతో కొత్త ఘనతను అందుకున్నాడు. మొత్తం ఇన్నింగ్స్ అనాయాసంగా, శ్రమ లేకుండా సాగడం చూస్తే రోహిత్ ఆత్మవిశ్వాసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజా ప్రదర్శనతో రోహిత్ ఈ ప్రపంచ కప్‌లో 647 పరుగులతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. లీగ్ దశలో ఎనిమిది మ్యాచ్‌లు ఆడితే అందులో ఐదు సెంచరీలు, ఒక అర్ధసెంచరీ ఉండటం విశేషం.

## ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| భారత్ | 9 | 7 | 1 | 1 | 0.809 | 15 |
| ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | 1.000 | 14 |
| ఇంగ్లండ్ | 9 | 6 | 3 | 0 | 1.152 | 12 |
| న్యూజిలాండ్ | 9 | 5 | 3 | 1 | 0.175 | 11 |
| పాకిస్తాన్ | 9 | 5 | 3 | 1 | -0.430 | 11 |
| శ్రీలంక | 9 | 3 | 4 | 2 | -0.919 | 8 |
| బంగ్లాదేశ్ | 9 | 3 | 5 | 1 | -0.410 | 7 |
| దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.080 | 5 |
| వెస్టిండీస్ | 9 | 2 | 6 | 1 | -0.225 | 5 |
| అఫ్గానిస్తాన్ | 9 | 0 | 9 | 0 | -1.322 | 0 |



ఈ ప్రపంచకప్‌లో రోహిత్ స్కోర్లు

| స్కోరు | ప్రత్యర్థి |
|---|---|
| 122* | దక్షిణాఫ్రికా |
| 57 | ఆస్ట్రేలియా |
| 140 | పాకిస్తాన్ |
| 1 | అఫ్గానిస్తాన్ |
| 18 | వెస్టిండీస్ |
| 102 | ఇంగ్లండ్ |
| 104 | బంగ్లాదేశ్ |
| 103 | శ్రీలంక |

# ఆనందం ఐదింతలు

### ఒకే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఐదో సెంచరీ • ఈ ఘనత సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్

### చివరి మ్యాచ్‌లో శ్రీలంక చిత్తు • 7 వికెట్లతో భారత్ ఘన విజయం • రాహుల్ శతకం

**వేర్వేరు ప్రత్యర్థులు... వేర్వేరు మైదానాలు, పిచ్‌లు... ప్రపంచ కప్ మెగా టోర్నీ ఒత్తిడి... వేటినీ రోహిత్ గురునాథ్ శర్మ లెక్క చేయడు... పక్షి కన్నుకు గురి పెట్టిన అర్జునుడిలా అతని దృష్టి అంతా పరుగుల వరద పారించడంపైనే... అందుకే రికార్డులు అతని ముందు మోకరిల్లుతాయి. గణాంకాలు గజ్జె కట్టుకొని అతని ముందు ఆడతాయి. తన అత్యద్భుత వన్డే కెరీర్‌లో ఎన్నో కీర్తికిరీటాలను పదిలపర్చుకున్న 'హిట్‌మ్యాన్' ఇప్పుడు మరో శిఖరాన్ని అధిరోహించాడు. పన్నెండు ప్రపంచ కప్‌ల చరిత్రలో మరెవరికీ సాధ్యం కాని రీతిలో ఒకే టోర్నీలో ఐదు సెంచరీలతో అతను ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. అనితర సాధ్యమైన రీతిలో మూడు వన్డే డబుల్ సెంచరీలు సాధించిన రోహిత్ ఇప్పుడు మరో రీతిలో చరిత్రను తిరగరాశాడు. రోహిత్ రికార్డుకు తోడు రాహుల్ కూడా సెంచరీతో అండగా నిలవడంతో లీగ్ దశను భారత్ భారీ విజయంతో ముగించింది. ఏమాత్రం పోటీనివ్వలేని రీతిలో శ్రీలంక తక్కువ స్కోరుకే పరిమితం కాగా... టీమిండియా తమకు అలవాటైన రీతిలో లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.**

**లీడ్స్:** ప్రపంచ కప్‌లో భారత్ తమ ఆధిపత్యాన్ని మళ్లీ ప్రదర్శిస్తూ మరో సాధికారక విజయాన్ని సాధించింది. శనివారం ఇక్కడి హెడింగ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. ఏంజెలో మాథ్యూస్ (128 బంతుల్లో 113; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కగా, తిరిమన్నె (68 బంతుల్లో 53; 4 ఫోర్లు) రాణించాడు. బుమ్రా 37 పరుగులకే 3 వికెట్లు తీయడం విశేషం. అనంతరం భారత్ 43.3 ఓవర్లలో 3 వికెట్లకు 265 పరుగులు చేసి విజయాన్నందుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ (94 బంతుల్లో 103; 14 ఫోర్లు, 2 సిక్సర్లు), లోకేశ్ రాహుల్ (118 బంతుల్లో 111; 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలు బాది జట్టును సునాయాసంగా గెలిపించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 189 పరుగులు జోడించడం విశేషం. వరుసగా మూడో శతకం బాదిన రోహిత్‌కు వన్డేల్లో ఇది 27వ సెంచరీ.

### కీలక భాగస్వామ్యం...

భారత బౌలర్ల దెబ్బకు శ్రీలంక ఆరంభంలో వెంటవెంటనే వికెట్లు కోల్పోయింది. 12 ఓవర్లు పూర్తి కాక ముందే జట్టు స్కోరు 55/4 వద్ద నిలిచింది. తన తొలి రెండు ఓవర్లలో ఒక్క పరుగు ఇవ్వని బుమ్రా... కరుణరత్నే (10)ను ఔట్ చేసి తొలి దెబ్బ కొట్టాడు. మరో రెండు ఓవర్లకు కుశాల్ పెరీరా (18) కూడా బుమ్రా బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. టోర్నీలో తొలి మ్యాచ్ ఆడుతున్న రవీంద్ర జడేజా తన మొదటి ఓవర్లోనే కుశాల్ మెండిస్ (3) పని పట్టగా... పాండ్యా వేసిన తర్వాతి ఓవర్లో అవిష్క ఫెర్నాండో (20) కూడా ఔటయ్యాడు. ఈ స్థితిలో మాథ్యూస్, తిరిమన్నె భాగస్వామ్యం లంకను ఆదుకుంది. ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై 82 పరుగుల ఇన్నింగ్స్ మినహా ఇతర అన్ని మ్యాచ్‌లలో విఫలమైన మాథ్యూస్ కీలక సమయంలో తన అనుభవాన్ని ప్రదర్శించాడు. ప్రపంచ కప్‌లో తొలి అర్ధ సెంచరీతో తిరిమన్నె అతనికి అండగా నిలిచాడు. నిలదొక్కుకునేందుకు కొంత సమయం తీసుకున్న అనంతరం ఈ జంట కొన్ని చక్కటి షాట్లు ఆడింది. 61 పరుగుల వద్ద మాథ్యూస్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను భువనేశ్వర్ వదిలేశాడు. ఎట్టకేలకు తిరిమన్నెను కుల్దీప్ ఔట్ చేయడంతో 124 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత 115 బంతుల్లో మాథ్యూస్ సెంచరీ పూర్తయింది. అతని కెరీర్‌లో ఇది మూడో సెంచరీ కాగా మూడూ భారత్‌పైనే వచ్చాయి.


రాహుల్


మాథ్యూస్

### రాహుల్ హిట్...


రోహిత్ భార్య రితిక

కెరీర్ తొలి వన్డేలోనే సెంచరీ సాధించిన రాహుల్ మూడేళ్ల తర్వాత తన 22వ వన్డేలో మరో శతకం సాధించగలిగాడు! గత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 77 పరుగులు చేసి ఫామ్‌లోకి వచ్చిన అతను దానిని ఇక్కడా కొనసాగించాడు. ఈ క్రమంలో లంక బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొని కొన్ని చూడచక్కటి షాట్లు ఆడాడు. ఆరంభంలో ఐదు బంతుల వ్యవధిలోనే మూడు ఫోర్లు కొట్టి దూకుడు ప్రదర్శించిన రాహుల్, ఆ తర్వాత రోహిత్‌కు అండగా నిలిచాడు. డి సిల్వా వేసిన ఒక ఓవర్లో అతను చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో 2 ఫోర్లు, 1 సిక్స్ కొట్టిన అతను 67 బంతుల్లో అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. రోహిత్ వెనుదిరిగిన కొద్ది సేపటి తర్వాత మలింగ బౌలింగ్‌లో సింగిల్ తీయడంతో 109 బంతుల్లో రాహుల్ తొలి ప్రపంచ కప్ సెంచరీ పూర్తయింది. జట్టు విజయానికి 21 పరుగుల దూరంలో రాహుల్ ఔట్ కాగా... విరాట్ కోహ్లి (41 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు) అజేయంగా నిలిచి టీమ్‌ను గెలుపు తీరం చేర్చాడు.

### స్కోరు వివరాలు

**శ్రీలంక ఇన్నింగ్స్:** కరుణరత్నే (సి) ధోని (బి) బుమ్రా 10; కుశాల్ పెరీరా (సి) ధోని (బి) బుమ్రా 18; అవిష్క ఫెర్నాండో (సి) ధోని (బి) పాండ్యా 20; కుశాల్ మెండిస్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 3; మాథ్యూస్ (సి) రోహిత్ (బి) బుమ్రా 113; తిరిమన్నె (సి) జడేజా (బి) కుల్దీప్ 53; ధనంజయ డి సిల్వా (నాటౌట్) 29; తిసారా పెరీరా (సి) పాండ్యా (బి) భువనేశ్వర్ 2; ఉదాన (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 264.**
**వికెట్ల పతనం:** 1–17, 2–40, 3–53, 4–55, 5–179, 6–253, 7–260.
**బౌలింగ్:** భువనేశ్వర్ 10–0–73–1, బుమ్రా 10–2–37–3, హార్దిక్ పాండ్యా 10–0–50–1, జడేజా 10–0–40–1, కుల్దీప్ 10–0–58–1.

**భారత్ ఇన్నింగ్స్:** రాహుల్ (సి) కుశాల్ పెరీరా (బి) మలింగ 111; రోహిత్ (సి) మాథ్యూస్ (బి) రజిత 103; కోహ్లి (నాటౌట్) 34; పంత్ (ఎల్బీ) (బి) ఉదాన 4; పాండ్యా (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (43.3 ఓవర్లలో 3 వికెట్లకు) 265.**
**వికెట్ల పతనం:** 1–189, 2–244, 3–253.
**బౌలింగ్:** మలింగ 10–1–82–1, రజిత 8–0–47–1, ఉదాన 9.3–0–50–1, తిసారా పెరీరా 10–0–34–0, ధనంజయ డి సిల్వా 6–0–51–0.

**1** ఒకే ప్రపంచకప్‌లో ఐదు సెంచరీలు కొట్టిన తొలి క్రికెటర్‌గా రోహిత్ శర్మ ఘనత వహించాడు.

**1** ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక సెంచరీలు కొట్టిన క్రికెటర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న సచిన్ టెండూల్కర్ (44 ఇన్నింగ్స్‌లో 6 సెంచరీలు) సరసన రోహిత్ (16 ఇన్నింగ్స్‌లో 6 సెంచరీలు) చేరాడు. ఐదేసి సెంచరీలతో రికీపాంటింగ్ (ఆస్ట్రేలియా), కుమార సంగక్కర (శ్రీలంక) రెండో స్థానంలో ఉన్నారు.

**2** విరాట్ కోహ్లి తర్వాత వన్డేల్లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో సెంచరీలు కొట్టిన రెండో భారతీయ క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు. ఓవరాల్‌గా 11వ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. సంగక్కర 2015 ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో సెంచరీలు కొట్టాడు.

**2** అంతర్జాతీయ క్రికెట్‌లో (టెస్టు, వన్డే ఫార్మాట్) ఓ సిరీస్‌లో లేదా ఓ టోర్నమెంట్‌లో ఐదు సెంచరీలు కొట్టిన రెండో క్రికెటర్ రోహిత్. 1955లో ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో విండీస్ బ్యాట్స్‌మన్ క్లయిడ్ వాల్కట్ ఐదు సెంచరీలు కొట్టాడు.

**3** ప్రపంచకప్ మ్యాచ్‌లో ఓ జట్టు తరఫున ఇద్దరు ఓపెనర్లు సెంచరీలు చేయడం ఇది మూడోసారి. 2011 ప్రపంచకప్‌లో శ్రీలంక తరఫున దిల్షాన్, ఉపుల్ తరంగ (జింబాబ్వే, ఇంగ్లండ్‌లపై) రెండుసార్లు ఈ ఘనత సాధించారు.

**3** వన్డేల్లో ఏంజెలో మాథ్యూస్ చేసిన మూడు సెంచరీలు భారత్‌పైనే వచ్చాయి. అయితే మాథ్యూస్ సెంచరీ చేసిన మూడు సార్లూ శ్రీలంక ఓడిపోవడం గమనార్హం.

**27** మరో 27 పరుగులు చేస్తే ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక పరుగుల చేసిన బ్యాట్స్‌మన్‌గా రోహిత్ ఘనత వహిస్తాడు. ఈ జాబితాలో సచిన్ (673 పరుగులు–2003లో), హేడెన్ (659 పరుగులు–2007లో) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. ప్రస్తుత ప్రపంచకప్‌లో రోహిత్ 647 పరుగులతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.



సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం  వెల: ₹ 6.00  సంపుటి: 12  సంచిక: 106

SUNDAY Special  ఆదివారం 7-7-2019



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



## లక్ష్యం సాధిస్తాం

దేశ ఆర్థిక వ్యవస్థను వచ్చే ఐదేళ్లలో 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్తాం: మోదీ

- వివరాలు 11లో



## గుండెల్లో కోట కట్టుకున్నా

ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావుతో సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




# నెలాఖరులో మున్సి'పోల్స్'!

## 30 లేదా 31న ఎన్నికలు.. ఈ నెల 13లోపు రిజర్వేషన్ల ఖరారు

- 15, 16 తేదీల్లో నోటిఫికేషన్!
- ఆగస్టు 2న కౌంటింగ్, 4న పాలకమండళ్లు
- ఒకే విడతలో 'పుర'ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం
- ఏర్పాట్లపై సీఎస్, డీజీపీ సహా ఇతర అధికారులతో ఎస్ఈసీ నాగిరెడ్డి సమావేశం

సాక్షి, హైదరాబాద్

ఈ నెలాఖరులోగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సూత్రప్రాయంగా నిర్ణయించింది. వచ్చే నెల రెండో వారంలో ఎన్నికలు జరపాలని మొదట భావించినా.. ఈ నెలలోనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో షెడ్యూల్‌ను కూడా కుదించింది. ఈ మేరకు ఓటర్ల తుదిజాబితా ప్రచురణ తేదీని కూడా నాలుగు రోజులు ముందుకు జరిపింది. 2014లో ఈవీఎంల ద్వారా మున్సిపోల్స్ జరగగా.. ఈసారి బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు జరగనున్నాయి. ఒకే దశలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 పురపాలక సంఘాలు, మూడు నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది.

**15 లేదా 16న నోటిఫికేషన్!**

ఈ నెల 15 లేదా 16వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి, జూలై 30 లేదా 31వ తేదీన ఎన్నికలు నిర్వహించాలనుకుంటోంది. ఆగస్టు 2న ఓట్ల లెక్కింపు, 4న కొత్త పాలకమండళ్లు కొలువుదీరేలా ఈసీ ముహూర్తం ఖరారు చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. సాధ్యమైనంత త్వరగా

మిగతా 2వ పేజీలో ▶



రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలోని రంగనాయకుల కాలనీలో సోని అనే గిరిజన మహిళ ఇంట్లో భోజనం తర్వాత మాట్లాడుతున్న అమిత్ షా. చిత్రంలో డాక్టర్ లక్ష్మణ్, మురళీధర్‌రావు

# వచ్చేది మనమే

## రాష్ట్రంలో బీజేపీకి ప్రజాదరణ పెరిగింది: అమిత్ షా

- హైదరాబాద్‌లో సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవంలో బీజేపీ చీఫ్
- గిరిజన మహిళ ఇంటికెళ్లి మరీ సభ్యత్వాన్నిచ్చిన కేంద్ర మంత్రి
- దేశమంతా మోదీకి మద్దతుగా ఉంది.. అన్ని వర్గాల శ్రేయస్సే మన లక్ష్యం
- కాంగ్రెస్ పని అయిపోయింది.. టీఆర్ఎస్‌కు మనమే ప్రత్యామ్నాయం
- కార్యకర్తలు, నేతలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా దిశానిర్దేశం
- మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల సహా బీజేపీలో చేరిన పలువురు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిందేనని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఉద్ఘాటించారు. బీజేపీకి ప్రజాదరణ అనూహ్యంగా పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందన్నారు. ఇదే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అమిత్‌షా పిలుపునిచ్చారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శంషాబాద్‌లోని కేఎల్‌సీసీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అమిత్‌షా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. 'ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో

మిగతా 2వ పేజీలో ▶

## న్యూస్‌రీల్

### కాలిఫోర్నియాలో మళ్లీ భూకంపం



అమెరికాలోని దక్షిణ కాలిఫోర్నియాలో శుక్రవారం మరో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.1గా నమోదైంది. లాస్ ఏంజెల్స్‌లో భూకంపం కారణంగా భవనాలు కంపించాయి.

- వివరాలు 11లో

### 7,200 కోట్లు చెల్లించండి



పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కు రూ. 7,200 కోట్లు వడ్డీతో కలిపి చెల్లించాలని పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని రుణ రికవరీ ట్రిబ్యునల్ శనివారం ఆదేశించింది. పీఎన్‌బీని మోసం చేసిన కేసులో నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైల్లో ఉన్నాడు.

- వివరాలు 11లో

### మండిన పెట్రో ధరలు



ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధుల కోసం ఇంధనంపై పన్ను పెంచడంతో ఆ ప్రభావం రవాణారంగంపై పడింది. శనివారం ధరల పెంపు తర్వాత హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.77.48, డీజిల్ ధర రూ.72.62కు చేరుకుంది

- వివరాలు 11లో

# కన్నడ సంక్షోభం

## 13 మంది ఎమ్మెల్యేల రాజీనామా

- రాజీనామాలపై 9న స్పీకర్ నిర్ణయం
- ముంబై రిసార్ట్‌కు తరలిన 10 మంది ఎమ్మెల్యేలు
- ఇదంతా బీజేపీ కుట్ర: కాంగ్రెస్

- వివరాలు 11లో



శనివారం గవర్నర్ వాజూభాయ్ వాలాను కలసిన కాంగ్రెస్, జేడీఎస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు




## వ్యతిరేకించినందుకే వేటాడుతోంది



పరువునష్టం కేసులో బెయిలు సందర్భంగా నరేంద్ర మోదీ సర్కార్‌పై రాహుల్ ధ్వజం

- వివరాలు 11లో

# నిర్మలాజీ.. నిరాశపరిచారు

- బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని ట్విట్టర్‌లో కేటీఆర్ విమర్శ
- రెండు ప్రాజెక్టుల్లో ఒకదానికైనా జాతీయహోదా ఇవ్వరా?
- ఆర్థిక సర్వే ప్రశంసించినా కేటాయింపుల్లో శూన్యహస్తం
- తెలంగాణ విన్నపాలను కేంద్రం విస్మరించిందన్న కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు ఎత్తిపోతల పథకాల్లో ఏదో ఒకదానికి జాతీయ హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదని.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రాజెక్టులకు జాతీయహోదా అంశం కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో కనీసం ప్రస్తావనకు నోచుకోలేదని.. జాతి ప్రయోజనాల జాబితాలో తెలంగాణ ప్రాజెక్టులు లేవా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి ట్విట్టర్ ద్వారా శనివారం కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. అభివృద్ధిబాటలో ఉన్న తెలంగాణకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేశారని ట్విటర్ వేదికగా కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణ దృక్కోణంలో ఎలాంటి ప్రయోజనం కల్పించని కేంద్ర బడ్జెట్ 2019–20 ప్రతిపాదనలు పూర్తిగా నిరాశపరిచాయి. వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం చూపిన చొరవను కేంద్ర ఆర్థిక సర్వే ప్రశంసించినా.. మా విన్నపాలను మీరు పూర్తిగా విస్మరించారు'అని కేటీఆర్ ట్వీట్ చేశారు. 'చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథను నీతి ఆయోగ్ ప్రశంసించింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ రెండు ప్రతిష్టాత్మక పథకాలకు రూ.24 వేల కోట్లు కేటాయించాలని సిఫారసు చేసినా.. కనీసం 24 రూపాయలకు కూడా కేటాయించక పోవడం విడ్డూరం. తెలంగాణ ఆవిర్భవించి ఐదేళ్లు గడుస్తున్నా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీల అమలు ఊసేలేదు. బయ్యారం స్టీల్ ప్లాంటు, వరంగల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ వంటి అంశాలు

మిగతా 2వ పేజీలో ▶

## జైపూర్‌కు 'వారసత్వ' గుర్తింపు



- పింక్ సిటీగా పేరు పొందిన రాజస్తాన్ రాజధాని జైపూర్‌కు ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్ర, సాంస్కృతిక మండలి (యునెస్కో) ప్రపంచ వారసత్వ నగరం గుర్తింపు లభించింది. మధ్యయుగపు రాచరిక సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన జైపూర్ ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందింది. - 11లో

## ఈడబ్ల్యూఎస్ కోటాపై నీలినీడలు!

- ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో నీలినీడలు అలుముకున్నాయి. వాటిల్లోని కన్వీనర్ కోటా సీట్లకు నోటిఫికేషన్ విడుదలై కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైనా ఇప్పటికీ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల ప్రకారం సీట్ల పెంపుపై ఎంసీఐ నిర్ణయం ప్రకటించలేదు. దీంతో అసలు సీట్ల పెంపు జరుగుతుందా? లేదా? అన్న సంశయం విద్యార్థుల్లో నెలకొంది. - 4లో

## వైద్య ప్రవేశాలకు నేటి నుంచి వెబ్ కౌన్సెలింగ్



- ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో కన్వీనర్ కోటా సీట్లకు..
- నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ వర్సిటీ
- నేటి నుంచి ఈ నెల 10 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు

- వివరాలు 14లో






ముక్కలుగా చేసిన బ్రెడ్‌ను తొలిసారిగా 1928 జూలై 7న చిల్లికోథే బేకింగ్ కంపెనీ విక్రయించింది.



# లక్ష కోట్ల వృక్షార్చన!

భూమి భగ్గుమంటోంది.. నీటి కటకట.. కాలుష్యం కోరలు చాస్తోంది.. ఈ సమస్యలకు పరిష్కారం.. చెట్టు.. అవును ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా లక్ష కోట్ల వృక్షాలు కావాలంటున్నారు శాస్త్రవేత్తలు!



'వృక్షో రక్షతి రక్షితః'మహానుభావులు ఎప్పుడో చెప్పారు.. వాతావరణ మార్పులను అడ్డుకోవాలంటే.. మొక్కలు పెంచడమే మేలైన పరిష్కారమని ఇప్పుడు చాలా మంది శాస్త్రవేత్తలు చెబుతూ ఉన్నారు. ఇది అందరికీ తెలిసిందే.. అయితే ఎన్ని మొక్కలు నాటాలి? ఎక్కడ నాటాలి? వంటి చిక్కు ప్రశ్నలకు సమాధానం చెబుతున్నారు స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు. కాలుష్యం కారణంగా పెరిగిపోతున్న భూమి సగటు ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు కనీసం లక్ష కోట్ల నుంచి లక్షన్నర కోట్ల మొక్కలు నాటాలని వీరు అధ్యయనపూర్వకంగా చెబుతున్నారు. వాతావరణంలో ఇప్పటికే చేరిపోయిన కార్బన్‌డయాక్సైడ్ మోతాదును 66 శాతం వరకూ తగ్గించేందుకు ఇన్ని మొక్కలు అవసరమన్నది వీరి అంచనా. ఇంకోలా చెప్పాలంటే అమెరికా భూభాగమంత విస్తీర్ణంలో కొత్తగా మొక్కలు నాటితే భూమి ఇంకొంత కాలం 'పచ్చ'గా ఉంటుందన్నమాట!

వాతావరణ మార్పుల ప్రభావాన్ని అడ్డుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా బోలెడన్ని కొత్త టెక్నాలజీలను ఆవిష్కరిస్తున్నాం. సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తితోపాటు అనేక ఇతర చర్యలు తీసుకుంటున్నాం. ప్రపంచదేశాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి భూమి సగటు ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేయాలని ప్యారిస్ ఒప్పందం చేసుకున్న విషయమూ మనకు తెలిసిందే. ప్రపంచదేశాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి భూమి సగటు ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేయాలని ప్యారిస్ ఒప్పందం చేసుకున్న విషయమూ మనకు తెలిసిందే. వీటి మాటెలా ఉన్నా కేవలం లక్ష కోట్ల మొక్కలు నాటడం ఈ సమస్యకు అతి చౌకైన పరిష్కారమన్నది స్విట్జర్లాండ్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జ్యూరిచ్ శాస్త్రవేత్త థామస్ క్రోథర్ అంచనా. భూమ్మీద పచ్చదనం ఎంతుందన్న అంశంపై వీరు వేల ఉపగ్రహ ఛాయాచిత్రాలను పరిశీలించారు. మరిన్ని మొక్కలు నాటేందుకు ఉన్న అవకాశాలనూ లెక్కకట్టారు. మానవ ఆవాసాలు, వ్యవసాయ భూమి వంటి వాటిని మినహాయించి చూసినప్పుడు దాదాపు 160 కోట్ల హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కలు నాటేందుకు అవకాశాలున్నట్లు తెలిసింది. ఈ విస్తీర్ణంలో మొక్కలు నాటితే భూమ్మీద మొత్తం 440 కోట్ల హెక్టార్లలో పచ్చదనం ఏర్పడుతుంది. అదనంగా నాటే 1 – 1.5 లక్షల కోట్ల మొక్కలు పెరిగి పెద్దయితే.. వాతావరణంలో పేరుకు పోయిన దాదాపు 20,500 టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకోగలవు. పారిశ్రామిక విప్లవం సమయం నుంచి భూ వాతావరణంలోకి దాదాపు 30,000 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ వాతావరణంలో కలిసిందని అంచనా.

**ఎక్కడ?..:** ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇంత పెద్ద స్థాయిలో కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకునేందుకు ఎక్కడపడితే అక్కడ మొక్కలు నాటితే సరిపోదు అంటున్నారు శాస్త్రవేత్తలు. రష్యా, అమెరికా, కెనెడా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా వంటి దేశాల్లో సుమారు 47 కోట్ల హెక్టార్ల అడవులు పెంచేందుకు అవకాశముంది. వాతావరణ మార్పుల కారణంగా సైబీరియా ప్రాంతంలోని ఉత్తర బోరియాల్ అడవుల విస్తీర్ణం భవిష్యత్తులో పెరిగే అవకాశముండగా.. దట్టమైన ఉష్ణమండల అడవులు అననుకూలంగా మారతాయి. కాబట్టి ఉష్ణమండల ప్రాంతాల్లో అడవుల పెంపకం అంత మేలు చేకూర్చదని థామస్ అంటున్నారు. వీలైనంత తొందరగా ఈ బృహత్ వృక్షార్చనను మొదలుపెట్టాలని.. అవి ఎదిగేందుకు దశాబ్దాల సమయం పడుతుందన్నది మరచిపోకూడదని చెప్పారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

## ఢిల్లీలో తెలంగాణ విద్యార్థుల ఇబ్బందులు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఢిల్లీ యూనివర్సిటీ, దాని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం తెలంగాణ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణలో ఇంటర్ చదివిన విద్యార్థుల అడ్మిషన్లకు కోర్ సబ్జెక్టుగా ఇంగ్లిష్‌ను, తెలుగు, సంస్కృతం భాషలను ఎలక్టివ్ సబ్జెక్టులుగా పరిగణించాలని ఢిల్లీ వర్సిటీకి ఇంటర్ బోర్డు సమాచారం ఇవ్వకపోవడంతో తమకు ప్రవేశాలు దక్కడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. దీని వల్ల సీబీఎస్‌ఈ, ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోలిస్తే తమకు మార్కుల శాతం తగ్గి సీట్లు పొందలేకపోతున్నామని విద్యార్థులు మీడియాకు వెల్లడించారు. ఈ విషయమై బోర్డు వెంటనే స్పందించి కనీసం మూడో కటాఫ్‌లోనైనా తమకు అడ్మిషన్లు దక్కేలా చూడాలని కోరుతున్నారు. పలువురు విద్యార్థులు శనివారం ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారిని కలసి సమస్యను వివరించగా.. ఆయన ఇంటర్ బోర్డ్ కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

## 10 నుంచి ఉపకార దరఖాస్తులు

### రెన్యువల్ విద్యార్థులకు ముందుగా అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల స్వీకరణకు సంక్షేమ శాఖలు సిద్ధమయ్యా యి. ఈ నెల 10 నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈపాస్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేశాయి. ముందుగా రెన్యువల్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుంది. కొత్తగా పలు కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ ఇంకా పూర్తికాలేదు. దీంతో ఫ్రెషర్స్ విద్యార్థుల దరఖాస్తు ప్రక్రియను ఆగస్టు 1 నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యమైతే దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచే అవకాశం ఉంది. ముందస్తుగా దరఖాస్తుల స్వీకరణ పూర్తయితే ఉపకార వేతనాల పంపిణీ సులభతరమవుతుందని సంక్షేమ శాఖలు భావిస్తున్నాయి. దరఖాస్తుల స్వీకరణ వేగంగా పూర్తయితే వాటిని వీలైనంత త్వరితంగా పరిశీలించి ఉపకార వేతనాలు పంపిణీ చేస్తామని ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు పి.కరుణాకర్ పేర్కొన్నారు.

## 'పాలిటెక్నిక్' అభ్యర్థుల్నీ పరిగణించండి

### పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో పాలిటెక్నిక్ పరీక్ష తప్పిన వారి మార్కుల జాబితాలనూ పరిశీలించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్మీడియట్ ఫెయిలైన వారి మార్కుల జాబితాలను పరిశీలిస్తున్నారని, ఇంటర్‌తో సమానమైన పాలిటెక్నిక్ ఫెయిలైన అభ్యర్థుల మార్కుల జాబితాలను పరిశీలించడం లేదని దాఖలైన వ్యాజ్యాలను విచారించిన హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. పాలిటెక్నిక్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని చెప్పి పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు తమను అనర్హులుగా పరిగణించడం అన్యాయమని పేర్కొంటూ సుమన్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. జీవో 112 ప్రకారం ఇంటర్–పాలిటెక్నిక్ రెండూ సమానమని, ఇంటర్‌లో తప్పిన వారిని కానిస్టేబుల్ పోస్టులకు అర్హులుగా పరిగణిస్తూ పిటిషనర్లను అనుమతించకపోవడం అన్యాయమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. వాదనల అనంతరం పాలిటెక్నిక్ ఫెయిలైన పిటిషనర్ల మార్కుల జాబితాలను కూడా పరిశీలించాలని పోలీస్ నియామక మండలిని ఆదేశిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు వెలువరించారు.

## ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి 31 ఆఖరు

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్ ప్రథమ సంవత్సరం 2019–20 ప్రవేశానికి ఈ నెల 31 చివరి తేదీ అని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో పాసైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎంపీఎస్‌వో, ఏఎస్‌వో పోస్టులకు నేటి నుంచి రీలింక్విష్‌మెంట్

**సాక్షి, హైదరాబాద్:** డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, పీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ డిపార్ట్‌మెంటుల్లోని మండల్ ప్లానింగ్ స్టాటిస్టికల్ ఆఫీసర్/ అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్‌వో/ఏఎస్‌వో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఆదివారం (నేటి) నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా రీలింక్విష్‌మెంట్‌ను ఇచ్చుకోవాలని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ పోస్టులకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు సవరించిన జాబితాను టీఎస్‌పీఎస్సీ శనివారం ప్రకటించింది. పూర్తి వివరాలకు అభ్యర్థులు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

## రేపటి నుంచి కామన్ పీజీ ప్రవేశ పరీక్షలు

**హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న కామన్ పీజీ ప్రవేశ పరీక్షలు సోమవారం (8న) నుంచి ఈ నెల 20 వరకు జరగనున్నట్లు కన్వీనర్ కిషన్ తెలిపారు. ఓయూతో పాటు మరో ఆరు వర్సిటీల్లో ఈ విద్యా సంవత్సరానికి పీజీ, పీజీ డిప్లొమా, ఐదేళ్ల పీజీ కోర్సులకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని సూచించారు.

## టీఎస్‌సెట్‌కు 71.33 శాతం మంది హాజరు

హైదరాబాద్: ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన టీఎస్‌సెట్–2019 పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 29 సబ్జెక్టులకు గాను 71.33 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు సెట్ సభ్య కార్యదర్శి ప్రొ.యాదవరావు శనివారం తెలిపారు. పరీక్షలను యూజీసీ నిబంధనల ప్రకారం వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9492108385 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు.

## నిర్మలాజీ.. నిరాశపరిచారు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రస్తావనకు నోచుకోలేదు. అభివృద్ధి బాటలో నడుస్తున్న కొత్త రాష్ట్రంపై ఎందుకు ఈ రకమైన వివక్ష'అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. 'తెలంగాణ అభివృద్ధిలో లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఐటీ, టెక్స్‌టైల్స్ అనేవి అత్యంత కీలకరంగాలు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు బడ్జెట్‌లో ఎలాంటి మద్దతు లేదు. హైదరాబాద్‌లో ఐటీఐఆర్ ఏర్పాటుపై కనీస ప్రస్తావన లేకపోగా, ఫార్మాస్యూటికల్, లైఫ్ సైన్సెస్ రంగానికి ఎలాంటి ప్రోత్సాహం లేదని'కేటీఆర్ అన్నారు. 'పెట్రోల్, డీజిల్ ధర పెంపుతో దేశ ప్రజలపై నిత్యావసరాల భారం పెరుగుతుందని.. గుజరాత్ సీఎం హోదాలో ప్రస్తుత ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు అంటూ గతంలో మోదీ ట్వీట్‌ను తన సందేశానికి కేటీఆర్ జత చేశారు.

**కేటాయింపుల్లో శూన్యహస్తం: కవిత**

'నిర్మలా సీతారామన్‌గారు.. ఒక మహిళగా మీరు పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం చూసి ఎంతో గర్వించా. ఆర్థికసర్వేలో అనేక ప్రశంసలు అందుకున్న తెలంగాణకు కేటాయింపుల్లో శూన్య హస్తాన్నే అందించారు. ఈసారి బడ్జెట్‌లో తెలంగాణకు రావాల్సిన ప్రయోజనాలు దక్కక పోవడం చాలా బాధాకరం'అని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ట్విటర్‌లో వ్యాఖ్యానించారు.



శనివారం హైదరాబాద్‌లో అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరుతున్న మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే రాజాసింగ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్, బండారు దత్తాత్రేయ.



పార్టీ సభ్యత్వ నమోదు పత్రాన్ని గిరిజన మహిళ సోనికి అందిస్తున్న అమిత్ షా

# వచ్చేది మనమే

▶ మొదటి పేజీ తరువాయి

భారతీయ జనతాపార్టీ విజయం సాధించిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వచ్చా. రాష్ట్ర ప్రజలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతు పలికారు. తెలంగాణలో 20 శాతానికిపైగా ఓట్లు రావడంతో బలమైన పార్టీగా అవతరించింది. తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడాలంటే భారతీయ జనతా పార్టీ గెలుపు అవసరం. వచ్చే శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యం. ఆ దిశగా కార్యకర్తలు కృషి చేయాలి. దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణ కోల్పోయింది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నందునే ప్రజలంతా మూకుమ్మడిగా నరేంద్ర మోదీకి మద్దతు ఇచ్చారు'అని అమిత్ షా అన్నారు.

**పటేల్ ఆశయాలతోనే..**

'నిజాం చేతుల్లోనుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోంది. తెలంగాణ నిజమైన అభివృద్ధి బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కుప్పకూలిపోయింది. అసలైన ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమే. బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకుంటుంది. విజయాలకు పొంగిపోదు. పరాజయాలకు కుంగిపోదు. దేశవ్యాప్తంగా బీజేపీకి ఆదరణ పెరుగుతుండడాన్ని ప్రతిపక్ష పార్టీలు తట్టుకోవడం లేదు. కార్యకర్తలే మన పార్టీకి బలం. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ నినాదంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ప్రతి ఇంటికీ ఎల్‌పీజీ సిలిండర్ ఇచ్చాం. పేదలందరికీ కూడు, గూడు కల్పించడమే మాలక్ష్యం'అని షా పేర్కొన్నారు.

**కేసీఆర్‌ది హింసాత్మక పాలన: లక్ష్మణ్**

తెలంగాణలో హింసాత్మక పాలన కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పొత్తుల్లేకుండా ఒంటరిగా బరిలోదిగి 4 పార్లమెంటు స్థానాల్లో విజయఢంకా మోగించామన్నారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనన్నారు. టీఆర్‌ఎస్ నిరంకుశపాలనను బలంగా ఎదుర్కొంటామన్నారు. సభ్యత్వ నమోదును పెద్ద సంఖ్యలో చేపట్టి ప్రతి పోలింగ్‌బూతుకు ఒక సైనిక దళాన్ని సిద్ధం చేస్తామని లక్ష్మణ్ అన్నారు.

**బీజేపీలో చేరిన మాజీ సీఎం నాదెండ్ల**

ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన నాదెండ్ల భాస్కరరావు శనివారం బీజేపీలో చేరారు. పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా ఆయన్ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, సినీ నిర్మాత బెల్లంకొండ రమేశ్, రామగుండం డిప్యూటీ మేయర్ సత్యప్రసాద్, టీడీపీ నాయకులు కోనేరు సత్యనారాయణ, బుక్కా వేణుగోపాల్, వెంకటేశ్వరరావు, మాజీ ఐఏఎస్ అధికారి సి.చంద్రవదన్, మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి తదితరులు బీజేపీలో చేరారు. వీరందరికీ అమిత్‌షా బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే రాజాసింగ్, డీకే అరుణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు లోగోనూ, సభ్యత్వ నమోదు మిస్డ్‌కాల్ నంబర్‌ను అమిత్‌షా ఆవిష్కరించారు. కొత్తగా సభ్యత్వం తీసుకున్న పలువురికి ఆయన సభ్యత్వ నమోదు పత్రాలను అందించారు. అంతకుముందు హైదరాబాద్ చేరుకున్న కేంద్ర హోంమంత్రికి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, డీజీపీ మహేందర్‌రెడ్డితో పాటు సీఐఎస్‌ఎఫ్, రాష్ట్ర పోలీసు అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐఎస్‌ఎఫ్ అధికారులతో షా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అమిత్ షా వెంట కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా ఉన్నారు.

### గిరిజన మహిళకు సభ్యత్వంతో షురూ!

మీర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలోని రంగనాయకుల కాలనీకి అమిత్‌షా విచ్చేశారు. స్థానికంగా ఉండే గిరిజన మహిళ సోని ఇంటికి చేరుకుని ఆమెకు బీజేపీ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడి.. జొన్నరొట్టె, ఉప్మా తిన్నారు. అక్కడి నుంచి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మొక్క నాటారు. అక్కడ పార్టీ కార్యకర్తలతో ముచ్చటించిన అనంతరం అమిత్ షా.. దేవేందర్‌నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మరో మొక్కను నాటారు. అక్కడినుంచి శంషాబాద్ కేఎల్‌సీసీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభకు తరలి వెళ్లాడు. అమిత్‌షా వెంట పార్టీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా.లక్ష్మణ్, కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు ఉన్నారు.

### నటించొద్దు.. వీధి పోరాటాలు చేయండి

తెలంగాణలో బీజేపీని బలపర్చేందుకు ప్రజాసమస్యలపై వీధి పోరాటాలు చేయాలని పార్టీ రాష్ట్ర నేతలకు అమిత్ షా దిశానిర్దేశం చేశారు. ఏదో చేస్తున్నట్లు నటించొద్దని హెచ్చరిస్తూనే.. పశ్చిమబెంగాల్‌లో పార్టీ బలపడిన తీరును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శనివారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలతో అంతర్గత సమావేశాన్ని నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో 40 జిల్లాల్లో తను రాత్రిబస చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల కోసం ఆలోచించకుండా, 51% ఓటు బ్యాంకు లక్ష్యంగా పనిచేయాలన్నారు. కేసీఆర్‌తో ఎలాంటి దోస్తీ లేదని.. రాష్ట్ర ప్రభుత్వంలో నెలకొన్న అవినీతిపై కేసులు వేయాలని సూచించారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు నెలకోసారి రాష్ట్రానికి వస్తానన్నారు. 19% ఓట్లు వచ్చిన ప్రతి రాష్ట్రంలోనూ తర్వాతి ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాల్లో గెలవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరులో మున్సి'పోల్స్'!

▶ మొదటి పేజీ తరువాయి

ఎలక్షన్లు జరపాలని యోచిస్తున్న ఈసీ.. వార్డుల వారీగా ఓటర్ల తుదిజాబితాను ఈ నెల 14 నాటికి ప్రకటించాలని శనివారం సవరించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నెల 13 తేదీలోపు ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసి జాబితాను ఎస్‌ఈసీకి అందజేసేందుకు మున్సిపల్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**అన్ని విభాగాలూ సిద్ధమేనా?**

ఈ నెలాఖరులోగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావడంలో భాగంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, ప్రింటింగ్ స్టేషనరీ డీజీ తేజ్‌దీప్ మీనన్, సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి తదితరులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలకు అవసరమైన బడ్జెట్ విడుదలకు ఆర్థికశాఖ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన కరదీపికలు, సమాచార పుస్తకాలు, కవర్లు తదితరాలను 17వ తేదీకల్లా ఇచ్చేందుకు, బ్యాలెట్‌పేపర్లకు అవసరమైన కాగితం సరఫరాకు ప్రింటింగ్ విభాగం, మున్సిపాలిటీల్లో ఎన్నికల సందర్భంగా బందోబస్తుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు పోలీస్‌శాఖ, క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల నిర్వహణకు మున్సిపల్ శాఖ, మొత్తంగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు సీఎస్ సన్నద్ధంగా ఉన్నట్టు ఎస్‌ఈసీకి తెలియజేసినట్టు తెలుస్తోంది. ఎన్నికలకు సంబంధించి ఎస్‌ఈసీ నిర్ణయించే తేదీలకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు తమ తమ విభాగాలు సంసిద్ధంగా ఉన్నట్టు వెల్లడించినట్టు సమాచారం. ఈ సమావేశంలో ఎస్‌ఈసీ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఎన్.జయసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ భేటీలో భాగంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తేదీలపై ఎస్‌ఈసీ స్పష్టత నిచ్చినట్టు తెలిసింది. సోమవారం రాజకీయ పక్షాలతో ఎస్‌ఈసీ సమావేశం కానుండగా, మరో ఒకట్రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశాన్ని నిర్వహించి ఎన్నికలకు జిల్లా యంత్రాంగాలను ఎస్‌ఈసీ సన్నద్ధం చేయనుంది.



మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై శనివారం అధికారులతో సమావేశం నిర్వహించిన ఎస్‌ఈసీ నాగిరెడ్డి. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇతర అధికారులు

**ప్రతి 800 మందికి ఒక పోలింగ్ స్టేషన్**

ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపుతో పాటు ప్రతి 800 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్‌శాఖకు ఎస్‌ఈసీ సూచించింది. తాజాగా ఓటర్ల తుది జాబితా ప్రకటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను నాలుగు రోజులు ముందుకు అంటే 18వ తేదీకి 14కు కుదించి, 14న ఫొటోలతో కూడిన తుది జాబితాను విడుదల చేయాలని ఆదేశించింది. ఈ సవరణ ఉత్తర్వుల్లో భాగంగా ఈనెల 10న వార్డుల్లో ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేసి, 12 వరకు అభ్యంతరాలను పరిష్కరించాలని, అంతకు ముందు ఈ నెల 11న రాజకీయ పక్షాలతో జిల్లా కలెక్టర్లు సమావేశం కావాలని షెడ్యూల్‌లో వివరించారు. ఈనెల 13న ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి, 14న ఓటర్ల తుది జాబితా విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 13న ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళల రిజర్వేషన్లు ఖరారైన జాబితా అందిన తర్వాత.. ఏ క్షణమైనా నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది.

**ప్రభుత్వానికి ముసాయిదా**

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను కూడా ప్రభుత్వానికి ఇప్పటికే ఎస్‌ఈసీ సమర్పించినట్టు తెలుస్తోంది. ఆగస్టు మొదటివారంలోగా ఓట్ల లెక్కింపు పూర్తిచేయడంతో పాటు నూతన పాలకవర్గాలకు పదవీ బాధ్యతలను అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

**సామగ్రి సిద్ధం చేసుకోవడంపై**

ఎన్నికల నిర్వహణకు వివిధరూపాల్లో అవసరమైన సామగ్రిని తయారు చేసుకోవాలని వివిధ శాఖలు, విభాగాలను ఎస్‌ఈసీ ఆదేశించింది. ఇందులో భాగంగా ఎన్నికలకు సంబంధించిన పేపర్ వర్క్‌ను పూర్తి చేయాలని సూచించింది. గైడ్‌లైన్స్ పుస్తకాలు, కవర్లు, నామినేషన్ల పత్రాలతో పాటు ఎన్నికల సంబంధించిన సామగ్రిని సేకరించడం, ప్రింటింగ్ చేయడం వంటి వాటిని ఈనెల 17లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. శాంతిభద్రతలపై చర్చించారు. పురపాలక ఎన్నికల ఏర్పాట్లకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని డీజీపీ వివరించారు.

### మూడు వార్డులకు ఒక గెజిటెడ్ అధికారి

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల అధికారుల నియామకాన్ని పూర్తిచేసి జాబితాను వెంటనే పంపించాలని మున్సిపల్ శాఖను ఎస్‌ఈసీ ఆదేశించింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా ప్రతి మూడు వార్డులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించాలని సూచించారు. దీని ప్రకారం నామినేషన్ల దాఖలు కూడా ప్రతి మూడు వార్డులకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

## 15 నుంచి ఓయూ పీజీ తరగతులు

**హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 15 నుంచి క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల్లో వివిధ పీజీ కోర్సుల ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవుల అనంతరం తరగతులను, హాస్టళ్లను పునఃప్రారంభించనున్నట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మెస్ బకాయిలను చెల్లించి హాస్టల్ వసతి పొందవచ్చునని తెలిపారు.



# అన్నదాతకు 'కత్తెర' కాటు

- మొక్కజొన్నపై తొలిదశలోనే దాడి చేస్తున్న పురుగు
- ఇప్పటికే 2.21 లక్షల ఎకరాల్లో సాగైన మొక్కజొన్న
- పురుగు దాడితో తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- రాష్ట్రాన్ని అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం
- చర్యలు తీసుకోవాలని అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ ఆదేశాలు



**సాక్షి, హైదరాబాద్:** మొక్కజొన్నపై కత్తెర కాటు వేస్తోంది. పంట మొక్క దశలో ఉండగానే కత్తెర పురుగు పంజా విసురుతోంది. రైతులకు, వ్యవసాయాధికారులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. కత్తెర పురుగు ఉధృతితో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. దీనిపై అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయశాఖను ఆదేశించింది. ఆ మేరకు రైతులకు సాయంగా ఉండాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి జిల్లా వ్యవసాయాధికారులను ఆదేశించారు. మరోవైపు కత్తెర పురుగు ఉధృతిని నియంత్రించేందుకు ఎటువంటి యాజమాన్య పద్ధతులను పాటించాలన్న దానిపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు సూచించింది. గతేడాది నుంచే కత్తెర పురుగు రాష్ట్రంలోని రైతులను ఆర్థికంగా నష్టపరిచింది. ఇప్పుడు మొక్కదశలోనే అది ప్రతాపం చూపిస్తుండటంతో ఏంచేయాలో ఎవరికీ అంతుబట్టడంలేదు.

**రాత్రికి రాత్రి వంద కి.మీ. ప్రయాణం...**

ఖరీఫ్‌లో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.21 లక్షల (18%) ఎకరాల్లో సాగైంది. ఇప్పుడు సాగు చేసిన జిల్లాల్లో కత్తెర పురుగు దాడి పెరిగింది. గ్రామాలకు గ్రామాలకు దూసుకుపోతూ మొక్కజొన్నను సర్వనాశనం చేస్తుంది. ఈ పురుగు రాత్రికి రాత్రి వంద కిలోమీటర్లు ప్రయాణించి గుడ్లు పెడుతూ తన సంతతిని పెంచుకుంటూ పోతుంది. ఒక్కో పురుగు 2 వేల వరకు గుడ్లు పెడుతుంది. గుడ్లు పెట్టిన మూడోరోజే కొత్త పురుగులు జన్మిస్తాయి. అలా ఒక్కో పురుగు తన సంతతిని లక్షలకు లక్షలు వ్యాపింప చేస్తూ రైతులను గడగడలాడిస్తుంది. గతేడాది కర్ణాటకలోని శివమొగ్గ ప్రాంతంలో కనిపించింది. అక్కడి నుంచి రాష్ట్రంపై దండెత్తింది. ఈ కత్తెర పురుగు ప్రధానంగా మొక్కజొన్నపైనే దాడి చేస్తుంది. కత్తెరలాగా కత్తిరించుకుంటూ ఆకును తినేస్తుంది. మిగిలిన పంటనూ ధ్వంసం చేస్తుంటుంది. దీని ప్రత్యేకత ఏంటంటే మొక్కజొన్న అందుబాటులో ఉంటే దానిపైనే పడుతుంది. అది లేకుంటే ఇతర పంటలనూ వదిలిపెట్టదని అధికారులు చెబుతున్నారు. అలా వరి పైరునూ ధ్వంసం చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ పురుగు సోకితే ఆయా పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే. మొక్కజొన్న పంటను తీవ్రంగా నష్టపరుస్తున్న కత్తెర పురుగు ఉధృతిని కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితిగా గుర్తించింది. దీంతో భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

### తొలి దశలోనే కనిపిస్తుంది

గత రబీ నుంచే కత్తెర పురుగు మొక్కజొన్నపై దాడి చేయడం మొదలుపెట్టింది. అయితే గతేడాది పంట ఏపుగా పెరిగాక కనిపించింది. ఇప్పుడు వేసిన తొలి దశలోనే కనిపిస్తుంది. ఏం చేయాలో అంతుబట్టడంలేదు. మొత్తం పంట నాశనమై పోతుంది. ప్రభుత్వం దీనిపై ఏదో ఒక చర్య తీసుకొని నియంత్రణ చర్యలు చేపట్టాలి. – *శ్రీనివాస్, కామారెడ్డి*

### రైతుల్లో ఆందోళన

ఎక్కడ చూసినా మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి పెరిగింది. నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, సంగారెడ్డి తదితర జిల్లాల్లో ఇప్పటికే తొలి దశలోనే ఈ పురుగు ఉధృతి కనిపిస్తుంది. దీంతో రైతుల్లో ఆందోళన పెరిగి మా డీలర్లను సంప్రదిస్తున్నారు. ఏ మందు వాడాలో అడుగుతున్నారు. ప్రభుత్వం దీనిపై కొంత స్పష్టత ఇచ్చి రైతులను ఆదుకోవాలి.
– *పృథ్వి, అధ్యక్షుడు, రాష్ట్ర విత్తన, పురుగు మందులు, ఎరువుల డీలర్ల సంఘం*

### వ్యవసాయ విశ్వవిద్యాలయ సూచనలివీ..

**కత్తెర పురుగు నివారణకు తొలి నెలలోగా పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు...**

- మొక్కజొన్న మొలిచినప్పటి నుంచీ కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు పంటపై నిఘా ఉంచి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి.
- ప్రతి 25 రోజులకు బుట్టలలోని ఎరలను మార్చుకోవాలి. ప్రతి బుట్టకు రోజుకు ఒక తల్లి పురుగును గమనించినా లేదా లేత ఆకులపైన గుడ్ల సముదాయాలను లేదా తెల్లటి పొరను గమనించినా అజాడిరక్టిన్–1500 పీపీఎంను 5 ఎం.ఎం. లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల నీటికి ఒక లీటరు మందు ద్రావణాన్ని మొక్క సుడిలో పడే విధంగా పిచికారీ చేసుకోవాలి.
- కత్తెర పురుగు 2 లేదా 3వ లద్దెపురుగు దశలో ఉన్నప్పుడు, 5–10శాతం పురుగు ఆశించిన మొక్కలను గుర్తించినప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ 200 లీటర్ల నీటికి 80 గ్రాముల చొప్పున కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి.
- సేంద్రియ పద్ధతిలో సాగుచేసే రైతులు పొలంలో గుడ్ల సముదాయాన్ని గమనించిన వెంటనే టెలినోమస్ రీమస్ లేదా ట్రైకోగ్రామా ప్రెటియోజమ్ అనే గుడ్డు పరాన్న జీవులను ఎకరానికి 50,000 చొప్పున వారం వ్యవధితో 2 నుంచి 3 సార్లు విడుదల చేయాలి. వీటితోపాటు తొలిదశ లద్దె పురుగుల నివారణకు మెటారైజియమ్ లేదా నోమూరియా అనే శిలీంద్ర మిశ్రమాలను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి ఆకుసుడిలో పడేవిధంగా పిచికారీ చేయాలి.

# ఇస్టా సదస్సుతో ప్రయోజనం శూన్యం

**కిసాన్ కాంగ్రెస్ విమర్శ**



అన్వేశ్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల ప్రతినిధులు పాల్గొన్న ఇస్టా కాంగ్రెస్ సమావేశాల వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదని కిసాన్ కాంగ్రెస్ విమర్శించింది. ఈ సదస్సు కోసం రూ. 72 కోట్లు వెచ్చించారని కానీ ఇందులో రైతుల భాగస్వామ్యం ఎక్కడుందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ ఎస్. అన్వేశ్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సదస్సులో విత్తన కంపెనీల ప్రతినిధులు, ఏజెంట్లు, వ్యాపారులు పాల్గొన్నారని, రైతు సంఘాల ప్రతినిధులను మాత్రం పిలవలేదని విమర్శించారు. వ్యాపారులు, విత్తన కంపెనీల ప్రయోజనానికి రైతుల సొమ్మును దుబారాగా ఖర్చు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు అన్వేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.


www.lpu.in

LOVELY PROFESSIONAL UNIVERSITY
Transforming Education Transforming India
Think BIG

UNBEATABLE PLACEMENTS
From Google to Microsoft, LPU Students are working with top brands at packages of over ₹1 crore

APPLICATIONS OPEN FOR PROGRAMMES AFTER 10TH, 12TH, GRADUATION & POST GRADUATION

B.Tech./ B.Tech. (Hons.)
Integrated B.Tech.-M.Tech.
Integrated B.Tech.-MBA
- Electronics & Communications Engg. (ECE)
- Computer Science & Engg. (CSE)*
- Information Technology (IT)*
- Mechanical Engineering (ME)
- ME- Mechatronics
- Aerospace Engineering
- Automobile Engineering (AE)
- Civil Engineering (CE)
- Electrical Engineering (EE)
- Electrical & Electronics Engg. (EEE)
- Biotechnology (BT)*
- Food Technology*
- Biomedical Engineering (BE)*
- Chemical Engineering (CHE)
- Petroleum Engineering

Diploma (Engg.) - ECE, CSE, ME, CE, EE, AE
M.Tech. [Full Time]
B.Sc. (Hons.) Agriculture*
M.Sc. Ag. (Agronomy, Soil Sci. & Agriculture Chem., Genetics & Plant Breeding, Entomology)*
M.Sc. (Environmental Sciences)
B.Sc. (Hons.) Botany/ Zoology
M.Sc. (Hons.) Botany/ Zoology
B.Ed./ M.Ed./ B.P.Ed./ M.P.Ed.
B.Sc. (Hons.) Chem./ Phy./ Maths
M.Sc. (Hons.) Chem./ Phy./ Maths
M.Sc. (Statistics & Data Analytics)
B.Sc./ M.Sc. (Design - Multimedia)

MBA*/ MBA (Hons.)*
BCA/ MCA/ MCA (Hons.)
M.Sc. (Computer Science)
M.Sc. (IT)/ PGDCA
BBA/ BBA (Hons.)
BBA (Financial Markets)
BBA (International Finance)
BBA (Information Technology)
MBA (Internation Business)*
MBA (Hospital & Healthcare Mgt.)*
MBA (Toursims& Hospitality)*
MBA (Supply Chain & Logistics)*
MBA (Financial Market)*
B.Com./ M.Com.
B.Sc. (Hons.) Economics
M.Sc. (Hons.) Economics
B.A., LL.B. (Hons.)
BBA, LL.B. / LL.M. (1 yr.)
B.Sc./ M.Sc. (Hotel Mgmt.)
B.Sc. (Airlines, Tourism & Hospitality)
B.Arch./ B.Plan./ M.Plan.
M.Arch. (Executive) (Part Time)
B.Sc./ M.Sc. (Design - Fashion)
M.Design (Fashion)
BFA/ BPA (Music Vocal/ Theatre)/ MFA
M.A. (Music-Vocal/ Music Instrumental)
M.Sc. Geography

B.Pharmacy
M.Pharmacy (Pharmaceutical Analysis, Pharmaceutical Chemistry, Pharmacology)
BPT/ MPT (Ortho, Neuro)
B.Sc. (MLT)
M.Sc. (Clinical Biochemistry)
M.Sc. (Clinical Microbiology)
B.Pharmacy (Ayurveda)
M.Pharmacy (Ayurveda)
B.Sc./ M.Sc. (Forensic Sciences)
B.Sc. (Film & TV Production)
M.Sc. (Film & TV Production)
B.A./ M.A. (Journ. & Mass Comm.)
B.Design (Product & Industrial)
M.Design (Product & Industrial)
B.Design (Interior & Furniture)
M.Design (Interior & Furniture)
B.Sc. (Hons.) Food Technology
M.Sc. (Food Science & Tech.)
B.Sc. (Nutrition & Dietetics)
M.Sc. (Nutrition & Dietetics)
B.Sc. (Hons.) Biotechnology
M.Sc. (Hons.) Biotechnology
B.Sc. (Hons.) Microbiology
M.Sc. (Hons.) Microbiology
M.Sc. (Hons.) Biochemistry
B.A. (Hons.)/ M.A. (Psychology/ History/ English/ Sociology/ Pol. Science, Pub. Adm./ Hindi)

*Scholarship not applicable •Medical students can also apply For stream details, refer website www.lpu.in

Scholarships
SCHOLARSHIP OF UPTO ₹ 1.8 LAKH PER STUDENT
For details, refer university website www.lpu.in

| Meet our Counsellors in Telangana | Time: 10 AM to 7 PM | Toll Free : 1800-102-4874 |
|---|---|---|
| KHAMMAM | Budget Hotel, 2-2-58, Gandhi chowk, Near Gandhi Statue | 07 July |
| WARANGAL | City Grand Hotel, S.V.P. Road, Rangampet | 08-10 July |
| HYDERABAD | #2/2A, Ameer Estate, Near S.R. Nagar, Bus Stand | 07-31 July |

LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU), Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab
admissions@lpu.co.in | SMS LPU to 53030 | Toll Free: 1800-102-4874 SUNDAY OPEN


# ప్రింట్ మీడియాపై సుంకం కొరడా!

- ఇప్పటికే కొండెక్కిన న్యూస్ ప్రింట్ ధర
- డిజిటల్ పోటీతో తగ్గుతున్న యాడ్స్
- చేతులెత్తేసిన చిన్న పత్రికలు
- వీటన్నిటికీ తోడు 10% సుంకం
- ఇది ఇబ్బందికరమే: సంఘాలు



**సాక్షి, బిజినెస్ ప్రతినిధి:** ఒకవైపు తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనవుతున్న డాలర్–రూపాయి విలువతో ఆందోళన చెందుతున్న ప్రింట్ మీడియాపై... శుక్రవారం నాటి బడ్జెట్ మరో బండను పడేసింది. దిగుమతి చేసుకునే న్యూస్‌ప్రింట్‌పై 10 శాతం సుంకం విధించడం ఈ రంగంపై తీవ్రమైన ప్రభావాన్నే చూపించనుంది. ఎందుకంటే ఒకవైపు డిజిటల్ మీడియా అంతకంతకూ వ్యాప్తి చెందుతుండటంతో ప్రింట్ మీడియాకు ప్రకటనల రూపంలో వచ్చే ఆదాయం తగ్గుతోంది. మరోవైపు గడిచిన ఏడాదిన్నర కాలంగా విదేశాల్లో సైతం న్యూస్ ప్రింట్ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. గతేడాది ఒకదశలో టన్ను న్యూస్‌ప్రింట్ ధర 820 డాలర్లకు కూడా చేరింది. ఆ దెబ్బకు కొన్ని చిన్న పత్రికలు మూతపడ్డాయి కూడా. అక్టోబర్ తరువాత కొంత దిగిరావటం మొదలై.... రెండు నెలల కిందట ధరలు కాస్త స్థిరపడి.. ప్రస్తుతం టన్ను న్యూస్‌ప్రింట్ ధర 700 డాలర్లకు అటూఇటుగా ఉంది. నిజానికి చాలా వరకూ పత్రికలు తక్షణ ఇబ్బందులు రాకుండా ఐదారు నెలలకు సరిపడా నిల్వల్ని ముందే తెచ్చుకుని పెట్టుకుంటాయి. కాబట్టి తగ్గిన ధరల తాలూకు ఫలితం వాటికింకా అందలేదనే చెప్పాలి. పోనీ ఇప్పుడైనా ఉపశమనం దొరుకుతుందని భావించిన ప్రింట్ మీడియాపై శుక్రవారం నాటి బడ్జెట్ ఏకంగా బాంబునే వేసింది. ఇప్పటిదాకా వీటిపై దిగుమతి సుంకం లేకపోగా... ఒకేసారి 10 శాతం విధించటం గమనార్హం. ఈ చర్యతో మరిన్ని చిన్న, భాషా పత్రికలు మూతపడవచ్చనే ఆందోళన నెలకొంది. ''ప్రకటనల ఆదాయం తగ్గి, ఖర్చులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ పరిస్థితుల్లో ఆశించిన సాయం అందించకపోగా ప్రభుత్వం ఇలా సుంకాలు మోపి దెబ్బతీయడం దురదృష్టకరం''అని భారతీయ భాషా పత్రికల సంఘం అధ్యక్షుడు పరేష్ నాథ్ తప్పుబట్టారు. ఆంగ్ల పత్రికలకు ప్రైవేట్ ప్రకటనలు, టెండర్ నోటిఫికేషన్ల రూపంలో ఆదాయం వస్తుందని, దేశవ్యాప్తంగా విస్తరించిన చిన్న, మధ్యస్థాయి భాషా పత్రికలు ఈ భారాన్ని మోయలేవని చెప్పారు. తక్కువ నాణ్యతతో, ఎక్కువ లాభాలు ఆర్జించాలని దేశీ న్యూస్‌ప్రింట్ తయారీదారులు ఆలోచిస్తున్నారని, వారి ఒత్తిళ్లకు తలొగ్గి ప్రభుత్వం దిగుమతి సుంకం విధించిందని విమర్శించారు. ప్రభుత్వం సుంకాన్ని తక్షణం తొలగించాలని, తన చర్యను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### నేడు తహసీల్దార్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశాన్ని ఆదివారం నాంపల్లి సీసీఎల్ఏ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.గౌతమ్ కుమార్, భాస్కర్‌లు ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ల బదిలీలతోపాటు ఇతర కీలకాంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సంఘం సభ్యులు హాజరు కావాలని కోరారు.


ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయము
పరిపాలనా భవనము, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030
2019-20 విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సుల ప్రవేశము కొరకు కౌన్సిలింగ్ తేదీల ప్రకటన
ప్రవేశ ప్రకటన నెం. 5502/ఎగ్జామ్స్/డిప్లొమ అడ్మిషన్స్/2019 తేదీ: 06-07-2019
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలిటెక్నిక్‌లలో మరియు విశ్వవిద్యాలయంచే గుర్తింపు పొందిన ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో రెండు సంవత్సరముల వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రీయ వ్యవసాయ డిప్లొమ కోర్సులకు మరియు మూడు సంవత్సరముల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సులకు 2019–20 విద్యా సంవత్సరంలో ప్రవేశం కొరకు కౌన్సిలింగ్ తేదీలను, ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtsau.edu.in లో చూడగలరు.
Dr. ఎస్. సుధీర్ కుమార్, రిజిస్ట్రార్.







# పటిష్ట చట్టాలతోనే మెరుగైన సేవలు: కేసీఆర్

**కొత్త మున్సిపల్ చట్టం, నూతన సచివాలయ నిర్మాణంపై సమీక్ష**



**సాక్షి, హైదరాబాద్:** పటిష్టమైన చట్టాలను రూపొందించి వాటిని పారదర్శకంగా అమలు చేయడం ద్వారానే ప్రభుత్వం పౌరులకు మెరుగైన సేవలందించగలుగుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కాలనుగుణంగా పాత చట్టాల్లో మార్పులు చేసుకున్నప్పుడే గుణాత్మక పాలన అందించగలమన్నారు. శనివారం ప్రగతి భవన్‌లో నూతన మున్సిపల్ చట్టం రూపకల్పన, నూతన సచివాలయ నిర్మాణం తదితర అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. పౌర సేవలను మెరుగుపరిచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టే దిశగా రూపొందించనున్న నూతన మున్సిపల్ చట్టంలో చేర్చబోయే అంశాలపై సీఎం చర్చించారు. ఈ దిశగా మరిన్ని అంశాల్లో మార్పు చేర్పుల గురించి కూలంకషంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని పాత భవనాలను తొలగించి కొత్త భవనాలు నిర్మించేందుకు ఎంత సమయం పడుతుందని అధికారులను అడిగారు. నూతన సచివాలయాన్ని అన్ని హంగులతో ఆదర్శవంతమైన సెక్రటేరియట్‌గా నిర్మించడంపై పలు సూచనలు చేశారు. సమావేశంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ ఎస్.కె. జోషి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, కార్యదర్శి స్మితా సబర్వాల్, భూపాల్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, అధర్ సిన్హా, సునీల్ శర్మ, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ పెట్టాలి

**కేంద్రానికి మాజీ ఎంపీ వినోద్ లేఖ**



**సాక్షి, హైదరాబాద్:** భారతీయ రైల్వేకు పూర్వ వైభవం కల్పించేందుకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని టీఆర్ఎస్ మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు శనివారం ఆయన లేఖ రాశారు. ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన భారతీయ రైల్వేకు స్వాతంత్ర్యం ముందు నుంచే ఎంతో ప్రత్యేకత ఉందని గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం కేంద్ర సాధారణ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ను విలీనం చేయడంతో కొత్త లైన్లు, ప్రాజెక్టుల మంజూరులో వివక్ష తొలగిపోతుందని ఆశించామన్నారు. కానీ శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన బడ్జెట్ ప్రసంగంలో రైల్వేను కేవలం కేంద్రంలో ఓ సాధారణ ప్రభుత్వ విభాగంగా చూస్తున్నట్లు కనిపించిందని మండిపడ్డారు. మెట్రో రైళ్లు, బుల్లెట్ రైళ్ల గురించి మాట్లాడిన ఆర్థిక మంత్రి మధ్య తరగతి ప్రజానీకం వినియోగించే సాధారణ రైల్వే లైన్లు, ప్రాజెక్టులు, వసతులపై పెద్దగా మాట్లాడలేదని విమర్శించారు. గతంలో రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టడం ద్వారా కొత్త రైలు మార్గాలు, నిధుల కేటాయింపు వంటి అంశాలు ప్రస్తావనకు నోచుకునేవని పేర్కొన్నారు.

### రేపు టీఎస్ ఎంసెట్-2019 ఆప్షన్లకు ఆఖరు

**సాక్షి, హైదరాబాద్:** టీఎస్ ఎంసెట్–2019 ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థుల ఆప్షన్ల నమోదుకు సోమవారంతో గడువు ముగియనుందని సెట్ కన్వీనర్ నవీన్‌మిట్టల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 29,765 మంది అభ్యర్థులు పాస్‌వర్డ్‌లను జనరేట్ చేసుకున్నారని, 18,902 మంది అభ్యర్థులు ఆప్షన్లు పూర్తి చేశారన్నారు. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా 488 ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకుంటే కోరుకున్న కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉంటుందని విద్యార్థులకు ఆయన సూచించారు.




బ్రెడ్‌ను ముక్కలు చేసే యంత్రాన్ని ఒట్టో ఫ్రెడెరిక్ రోవెడ్డర్ అనే వ్యక్తి కనుగొన్నారు.







మామూలుగా రెండు మూడు అంతస్తుల ఎత్తు నుంచి కిందకు చూస్తేనే చాలా మందికి భయం వేస్తుంటుంది. అలాంటిది ఈ ఫొటో చూశారా.. ఓ వ్యక్తి అంత ఎత్తులో సన్నటి తాడుపై నడుచుకుంటూ ఎలా వెళ్తున్నాడో.. అలాంటివి చూస్తేనే సగం చస్తాం.. అలాంటి సాహసాలు మనల్ని చేయమంటే.. జ్వరం పట్టుకుంటుంది కదా..! 'యురోపియన్ మార్మట్ హైలైన్ ప్రాజెక్టు' ఫెస్టివల్‌లో 7వ ఎడిషన్ ఫ్రాన్స్‌లోని గ్రెనోబెల్ దగ్గరలోని లాన్సెన్ వెర్కోర్స్ ప్రాంతంలో జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు చాలా ఎత్తు, చాలా దూరం పాటు ఇలా సన్నటి తాడుపై నడవాలి.

వడగళ్లను ఎప్పుడైనా చూశారా..? ఓ చూశాం చిన్నప్పుడు వాటితో భలే ఆడుకునే వారు కదా..? కానీ అప్పుడప్పుడు కొంచెం పెద్ద సైజులో కూడా కురుస్తుంటాయి.. వాటివల్ల తలకు దెబ్బలు కూడా తాకుతాయి.. గాయాలపాలవుతుంటారు. అయితే గత వారం కింద మెక్సికోలో కురిసిన వడగళ్ల వాన.. మామూలు వాన కాదండోయ్.. ఏకంగా మంచు దిబ్బలే ఆకాశం నుంచి జారిపడ్డాయి. ఏకంగా రెండు మీటర్ల ఎత్తులో రోడ్లపై పరుచుకున్నాయి. కార్లు, వాహనాలు అందులో కూరుకుపోయాయి. అక్కడి జనం దెబ్బకు దడుసుకుని ఇళ్ల నుంచి బయటకు కూడా రావట్లేదట. ఈ ఫొటో జలిస్కో రాష్ట్రంలోని గౌడాలజర అనే వీధిలో తీశారు..

## వడగళ్లు కాదు.. గుండ్లు బాబోయ్




## 'పుర' ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు

### కాంగ్రెస్ ఓబీసీ సెల్ డిమాండ్



**సాక్షి, హైదరాబాద్:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ డిమాండ్ చేసింది. శనివారం గాంధీభవన్‌లో బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ పి.వినయ్‌కుమార్, మాజీ ఎంపీ వీహెచ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న జనగణన ఆధారంగా, కోర్టులను మెప్పించి బీసీలకు జనాభా ప్రాతిపదికన మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సమావేశంలో భాగంగా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున 50 శాతం టికెట్లు బీసీలకివ్వాలని తీర్మానించారు. అదే విధంగా రాష్ట్ర, జిల్లా, మండల కమిటీలను నెలాఖరుకల్లా ఏర్పాటు చేసుకుని ఓబీసీ సెల్‌ను బలోపేతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఓబీసీ సెల్ తెలంగాణ ఇన్‌చార్జి ప్రకాశ్ సోనెవానె, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్‌లతో పాటు ఓబీసీ సెల్‌కు చెందిన అన్ని జిల్లాల చైర్మన్లు పాల్గొన్నారు.

## అప్పులు బీసీలకు.. ఆస్తులు సంపన్నులకా?



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం బీసీలను మరోసారి దగా చేసిందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.90 లక్షల కోట్లు అప్పులు చేసి బీసీలపై రూ.50 లక్షల కోట్లు భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.27 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం 800 కోట్లు కేటాయించి వారిని అవమానించిందన్నారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఊసేలేదని, బీసీల అభివృద్ధిని కేంద్రం అడుగడునా అడ్డుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే వేలాది మందితో ఢిల్లీని ముట్టడించి బీసీల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. జాతీయ స్థాయిలో ఫీజు, ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు, స్వయం ఉపాధికి సంబంధించిన స్కీముల ప్రస్తావనే లేదన్నారు. 60 కోట్ల జనాభా ఉన్న బీసీలకు ఒక్క కొత్త పథకం లేకపోవడం శోచనీయమన్నారు. బడ్జెట్‌లో సంపన్నులకు అగ్రతాంబులం కల్పించారని ఆరోపించారు. పారిశ్రామికీకరణ, సబ్‌ప్లాన్, కేంద్ర విద్య సంస్థ స్థాపన ఏమైందని ప్రశ్నించారు. బడ్జెట్‌లో బీసీలకు ఇప్పటికైన కేటాయింపులు పెంచాలని, లేనిపక్షంలో మోదీ, అమిత్ షా బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కును కోల్పోతారని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

## ప్రతి తండాకు ఏజెన్సీ హోదా ఇవ్వాలి

### సేవాలాల్ సేన తెలంగాణ వ్యవస్థాపకుడు సంజీవ్‌నాయక్

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి తండాకు ఏజెన్సీ హోదా ఇవ్వాలని సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకుడు భూక్య సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంజీవ్ నాయక్ మాట్లాడుతూ మేమెంతో మాకంత వాటా కావాలని, అందులో భాగంగా గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పెంచాలని అన్నారు. గిరిజన పంచాయతీలో అన్ని శాఖల ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని, తండా అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజనుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు దారావత్ ప్రేమ్ చంద్ నాయక్, మూడావత్ కృష్ణనాయక్, భూక్య చిన్నబాబు నాయక్, కల్యాణ్ నాయక్, సమన్వయ కర్త గుగులోత్ ప్రవీణ్, శంకర్ మహరాజ్ , గుగులోత్ సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షుడిగా బానోత్ కిషన్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాము నాయక్, ప్రధాన కార్యదర్శిగా రఘురాం రాథోడ్, అధికార ప్రతినిధిగా అజయ్, కోశాధికారిగా రాంబాబు, మహిళా అధ్యక్షురాలిగా జ్యోతి బాయ్, రైతు సంఘం అధ్యక్షుడిగా ఉత్తమ్ రాథోడ్ తదితరులు ఎన్నికయ్యారు.

## 8న వైఎస్సార్ జయంతి వేడుకలు

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** ఈ నెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 70వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అన్ని జిల్లా, అసెంబ్లీ, మండల కేంద్రాల్లోని వైఎస్సార్ విగ్రహాలను పూలమాలలతో అలంకరించి నివాళులర్పించాలని శనివారం ఒక ప్రకటనలో కార్యకర్తలకు సూచించారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, ఆస్పత్రులల్లో రోగులకు పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించే వైఎస్సార్ జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

## షమీమ్ ఫైజీ మృతికి సంతాపం

**సాక్షి, హైదరాబాద్:** సీపీఐ జాతీయ కార్యదర్శి షమీమ్ ఫైజీ మృతి పట్ల ఆ పార్టీ నాయకులు చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివ రావు, ఇతర నాయకులు సంతాపం తెలిపారు. ఆయన న్యూఏజ్, ముక్తి సంఘర్ష్ పత్రికల బాధ్యత నిర్వర్తించారు. విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ నాయకుడి నుంచి పార్టీ జాతీయ కార్యదర్శిగా ఎదిగారని, ఆయన మృతి సీపీఐకి తీరని లోటని తమ సంతాప సందేశంలో చాడ పేర్కొన్నారు.

## విలువలకు కట్టుబడే లావాదేవీలు: మై హోం గ్రూప్

**సాక్షి, హైదరాబాద్:** మై హోం గ్రూప్ ఆఫ్ కంపెనీలపై ఆదాయ పన్ను శాఖ దాడులు జరిపిందంటూ వస్తున్న వార్తలపై ఆ సంస్థ వివరణ ఇచ్చింది. ఈ మేరకు శనివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేసింది. 'మై హోం గ్రూప్ ఆఫ్ కంపెనీలపై ఈ నెల 4న ఆదాయ పన్ను శాఖ దాడులు జరిపినట్లు పలు దినపత్రికలు, టీవీ చానెళ్లు, సామాజిక మాధ్యమాల్లో వార్తా కథనాలు వచ్చాయి. బెంగళూరుకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ కంపెనీపై దేశ వ్యాప్తంగా పలు చోట్ల ఐటీ విభాగం సోదాలు నిర్వహించింది. సదరు కంపెనీతో హైదరాబాద్‌లో మై హోం గ్రూప్ ఆఫ్ కంపెనీ జాయింట్ వెంచర్‌లో ఓ రియల్ ఎస్టేట్ ప్రాపర్టీని వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తోంది. ఆ సంస్థపై సోదాల నేపథ్యంలో తమకు లభించిన సమాచారాన్ని ధ్రువీకరించుకునేందుకు మై హోం కార్యాలయంలోనూ సోదాలు జరిపారు. తనిఖీ సమయంలో అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాం. మై హోం గ్రూప్ ఆఫ్ కంపెనీలు అన్నీ విలువలకు కట్టుబడి పూర్తి నియమ నిబంధనలకు లోబడి లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. పన్నులకు సంబంధించిన చట్టాలు, నియమ నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తున్నాయి'అని ఆ ప్రకటనలో పేర్కొంది.

# ఈడబ్ల్యూఎస్ కోటాపై నీలినీడలు!

- ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపుపై రాని స్పష్టత
- దరఖాస్తు చేసి వారం గడిచినా స్పందించని ఎంసీఐ
- కన్వీనర్ కోటా సీట్లకు మొదలైన కౌన్సెలింగ్
- అదనపు సీట్ల పెంపు ఉండకపోవచ్చని వైద్య విద్య వర్గాల అనుమానం
- ప్రైవేట్ సీట్లలో ఈడబ్ల్యూఎస్‌కు అనుమతించి ఎంసీఐ చేతులెత్తేసిందా?

**సాక్షి, హైదరాబాద్:** ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో నీలినీడలు అలుముకున్నాయి. వాటిల్లోని కన్వీనర్ కోటా సీట్లకు నోటిఫికేషన్ విడుదలై కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైనా ఇప్పటికీ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల ప్రకారం సీట్ల పెంపుపై మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిర్ణయం ప్రకటించలేదు. దీంతో అసలు సీట్ల పెంపు జరుగుతుందా? లేదా? అన్న సంశయం విద్యార్థుల్లో నెలకొంది. గత నెల చివరి వారంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్లల్లో అగ్రవర్ణ పేదల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఆ మేరకు సీట్లు పెంచుతామని ఎంసీఐ ప్రకటించింది. అందుకోసం ఆయా కాలేజీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో రాష్ట్రంలో పది ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఈడబ్ల్యూఎస్ కోటా అమలుకు ముందుకు వచ్చాయి. సీట్లు పెంచాలని ఎంసీఐకి దరఖాస్తు చేసుకున్నాయి. ప్రతిపాదనల దరఖాస్తులను ఎంసీఐకి రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పంపాయి. మొత్తం 15 ప్రైవేటు మెడికల్ కాలేజీలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండగా, 10 మాత్రమే ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. దరఖాస్తు చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే సీట్ల పెంపుపై ఎంసీఐ నిర్ణయం ప్రకటిస్తుందని అందరూ ఎదురుచూశారు. కానీ వారం రోజులు దాటినా ఇప్పటికీ పెంపుపై ఎంసీఐ ఎలాంటి ప్రకటనా రాలేదు. ఈసారి ప్రైవేటులోని కన్వీనర్ కోటా సీట్లల్లో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లను ఎంసీఐ ప్రకటించే అవకాశాలు కనిపించడం లేదని వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) కార్యాలయ అధికారులు అంటున్నారు.



**మొదలైన కన్వీనర్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ**

ఈడబ్ల్యూఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసిన 10 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లు 750 ఉన్నాయి. వాటికి పది శాతం రిజర్వేషన్ల అమలుకు 25 శాతం చొప్పున సీట్లు పెంచాల్సి ఉంది. అంటే 188 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా ఈడబ్ల్యూఎస్ అమలుకు ఎంసీఐ పెంచుతుందని భావించారు. కానీ ఆ సీట్లు వచ్చే అవకాశాలు కనిపించడం లేదని అధికారులే అంటుండటంతో విద్యార్థుల్లో నిరాశ అలముకుంది. మరోవైపు ఇటీవల తెలంగాణలో ఆరు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నాలుగు కాలేజీలకు 25 శాతానికి బదులు 20 శాతం చొప్పున మాత్రమే ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు పెంచింది. ఆ ప్రకారం కేవలం 190 సీట్లు మాత్రమే పెంచింది. తక్కువ పెంచడంపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ప్రైవేటు మెడికల్ కాలేజీల విషయంలో ఎంసీఐ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో కన్వీనర్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ పూర్తయింది. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం జాబితాను కూడా ప్రకటించింది. ఆదివారం నుంచి ఈ నెల 10 వరకు వెబ్ కౌన్సెలింగ్ జరగనుంది. కన్వీనర్ కోటా సీట్లంటే ప్రభుత్వ మెడికల్ సీట్లకు, ప్రైవేటులోని కన్వీనర్ కోటా సీట్లకు ఈ వెబ్ కౌన్సెలింగ్ జరుగుతుంది. ఇంత జరుగుతున్నా ఎంసీఐ నుంచి ఈడబ్ల్యూఎస్ సీట్ల పెంపుపై ఆదేశాలు జారీకాలేదు. ఇంకా ఆయా సీట్లపై ఆశలు పెట్టుకున్న ఆరోగ్య విశ్వవిద్యాలయం ఈడబ్ల్యూఎస్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి వెబ్ ఆప్షన్లకు మరో నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించింది. మరోవైపు ఇప్పటికే జాతీయస్థాయిలో అఖిల భారత కోటా సీట్లకు మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. రెండో విడత మొదలుకానుంది. ఎక్కడికక్కడ కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంటే, ఈడబ్ల్యూఎస్ సీట్లపై ఎంసీఐ నిర్ణయం తీసుకోకపోవడం, ఏదో ఒక విషయం స్పష్టంగా చెప్పకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

# ఆ 26 కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

### బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య



**హైదరాబాద్ :** తెలంగాణలోని బీసీ జాబితా నుంచి అయిదేళ్ల కిందట తొలగింపునకు గురైన 26 కులాలను ఆ జాబితాలో వెంటనే చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... 26 బీసీ కులాలను తొలిగించడంపట్ల జాతీయ బీసీ కమిషన్ జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి తగు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ..ఈనెల 8న హైద్రాబాద్‌కు జాతీయ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ సమస్యలపై విచారణకోసం ఈనెల 8న రవీంద్ర భారతిలో సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా తొలగింపునకు గురై విద్యా, ఉద్యోగ అవకాశాలలో నష్టపోతున్న 26 కులాల ప్రతినిధులు జాతీయ బీసీ కమిషన్ బృందానికి తమ గోడు వినిపించడానికి సన్నద్ధమయ్యారని తెలిపారు. ఈ తొలగింపు 2014 ఆగస్టులో జరిగిందని, దీనితో వీరు అన్ని సౌకర్యాలు కోల్పోయారని, స్కాలర్ షిప్‌లు, ఫీజులు, హాస్టల్ సీట్లు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కులాలను తొలగించే అధికారం సీఎంకు గాని, రాష్ట్ర ప్రభుత్వానికి కానీ లేదన్నారు. రాజ్యాంగం ప్రకారం ఏదైనా కులాన్ని బీసీల జాబితానుంచి తొలిగించాలన్నా, కలపాలన్నా బీసీ కమిషన్ ద్వారా మాత్రమే చేయాలన్నారు. త్వరలో 50 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించా మని ఈ సందర్భంగా కృష్ణయ్య తెలిపారు. తొలిగింపునకు గురైన 26 బీసీ కులాల జేఏసీ ప్రతినిధులు శ్రీరామ్, గోల్ల బాబురావు, బుగత సాంబశివ, ఆళ్ల యుగంధర్, పొందరి వెంకట్, పీవీవీ సత్యనారాయణ, జల్లు హేమసుందర్, డియల్ నాయుడు, వర్రీ ప్రభాకర్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి**

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి చూపారని, వారికి కేటాయించిన నిధులతో బిస్కెట్లు కూడా రావాని ఆర్. కృష్ణయ్య ధ్వజమెత్తారు. శనివారం బీసీ భవన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని 70 కోట్ల మంది బీసీలకు రూ. 1050 కోట్ల బడ్జెట్ కేటాయిస్తే ఏ మూలకు సరిపోతుందని అన్నారు. బీజేపీ పార్టీ ఒక బీసీ నేతను ప్రధాన మంత్రిని చేసింది కానీ బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ అభివృద్ధికి ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు చేయలేదన్నారు. 14 లక్షల ఉద్యోగాల భర్తీ ఊసే లేదని , కేంద్రంలోని 72 ప్రభుత్వ శాఖలలో, 245 ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్న ఉద్యోగాల ఖాళీల భర్తీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. బీసీల బడ్జెట్‌ను రూ.1050 కోట్ల నుంచి లక్ష కోట్లకు పెంచాలని, అలాగే ఫీజుల రీయింబర్స్‌మెంటు, హాస్టల్ స్కీములను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

# రాజకీయ కోణంలోనే కేంద్ర బడ్జెట్

### కాళేశ్వరంకు జాతీయ హోదా ప్రస్తావనేదీ?: కర్నె ప్రభాకర్

**సాక్షి, హైదరాబాద్:** రాజకీయ కోణంలోనే కేంద్ర ప్రభుత్వం 2019–20 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, ప్రధాని మోదీ తెలంగాణ పట్ల అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరికి కేంద్ర బడ్జెట్ అద్దం పడుతోందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. శాసనసభ ఆవరణలోని టీఆర్ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడాలనే దృక్పథం బడ్జెట్‌లో లోపించిందని, బడ్జెట్ ప్రతిపాదనల్లో సమాఖ్య స్ఫూర్తి కొరవడిందని కర్నె విమర్శించారు. తెలంగాణలో నాలుగు లోక్‌సభ స్థానాలను గెలుచుకున్న బీజేపీ..బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. తెలంగాణ ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు వెళ్తోందని కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడించిన మరుసటి రోజే బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీ తరఫున అమిత్‌షా ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు.



**నీతి ఆయోగ్ సిఫారసు చేసినా..**

మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు ఆర్థిక సాయం చేయాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసినా బడ్జెట్‌లో నయాపైసా కేటాయించలేదని కర్నె మండిపడ్డారు. అంతర్జాతీయ ప్రశంసలు అందుకున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడంపై అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి బీజేపీ పక్షాన గెలిచిన ఎంపీలు..బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై మాట్లాడాలన్నారు. బడ్జెట్లో కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రస్తావనేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలంటూ టీఆర్ఎస్ అడగలేదంటూ బీజేపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని.. గతంలో ప్రధాని మోదీని కలిసిన ప్రతీ సందర్భంలో సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ ఎంపీలు ఈ అంశంపై వినతి పత్రాలు సమర్పించారన్నారు. టీఆర్ఎస్ నేత లు బీజేపీలో చేరుతున్నారంటూ.. ఆ పార్టీ నేత లు మైండ్‌గేమ్ ఆడుతున్నారని.. కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణలో బీజేపీకి నూకలు చెల్లాయని విమర్శించారు.

# వ్యక్తిగత గోప్యతను దెబ్బతీస్తున్న సర్కార్

### ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన సమగ్ర నివేదికపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పౌరుల వ్యక్తిగత సమాచార వివరాల్ని 25 ప్రభుత్వ శాఖల నుంచి సేకరించి సమగ్ర నివేదిక రూపొందించిందని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు రాష్ట్ర ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొంది. శనివారం గాంధీభవన్‌లో ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రజల వ్యక్తిగత సమాచారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల అనుమతి లేకుండానే ప్రభుత్వం ఎలాంటి వివరాల్ని సేకరించిందో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గోప్యంగా ఉండాల్సిన వివరాల్ని ఏ చట్ట ప్రకారం అధికారికంగా వినియోగిస్తున్నారో తెలియజేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సమాచారం చోరీ చేసిందని ఇటీవల ఐటీ గ్రిడ్స్ కంపెనీపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అదేవిధంగా ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించినందుకు తెలంగాణ ప్రభుత్వంపై కేసు పెడతారా అని నిలదీశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వంటి వివిధ మార్గాల ద్వారా గూఢచర్యానికి పాల్పడి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించిందని ఆరోపించారు. సైబర్ సెక్యూరిటీ యాక్టు కిందకు వచ్చే ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించాలని, దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తామన్నారు.



# బలహీనతలు అధిగమించండి

- రాష్ట్ర పార్టీకి సీపీఎం జాతీయ నాయకత్వం ఆదేశాలు
- రాష్ట్ర పార్టీ ప్లీనరీలో ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, కారత్ దిశానిర్దేశం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పార్టీ సంస్థాగతంగా ఎదుర్కొంటున్న బలహీనతలు, లోటుపాట్లను అధిగమించేందుకు వెంటనే అవసరమైన కార్యాచరణను చేపట్టాలని రాష్ట్ర నాయకత్వాన్ని సీపీఎం జాతీయ నాయకత్వం ఆదేశించింది. కిందిస్థాయి నుంచి పార్టీ బలపడేందుకు, సొంత బలం పెంచుకునేందుకు రాబోయే మూడు నెలల పాటు వివిధ రూపాల్లో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి, వాటిపై ఆందోళనలు, ఉద్యమాలు రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేసింది.



పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టి, సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు, వివిధ స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తలకు మారిన పరిస్థితుల్లో సైద్ధాంతిక అంశాలు, పార్టీ భావజాలాన్ని అర్థమయ్యేలా వివరించాలని సూచించింది. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర పార్టీ ప్లీనరీ సమావేశానికి పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ హాజరై రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలకు పలు సూచనలు చేసినట్టు సమాచారం. యువతకు దగ్గర కావడంతో పాటు పార్టీ భావజాల వ్యాప్తికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవడంలో వైఫల్యాలను అధిగమించాలని సూచించింది. ఎలాంటి కార్యాచరణను చేపట్టాలనే దానిపై పూర్తిస్థాయిలో అధ్యయనం నిర్వహించాలని ఆదేశించింది. ఇటీవలి ఎన్నికల్లో సంప్రదాయ ఓటర్లుగా, మద్దతునిస్తూ పార్టీకి సహకరిస్తున్న వివిధ వర్గాలు దూరం కావడం, బడుగు వర్గాలు సైతం పార్టీపై అనాసక్తి కనబర్చడంపై ఆత్మపరిశీలన చేసుకుని ఆ మేరకు రాజకీయ వ్యూహాలు మార్చుకోవాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించినట్టు తెలుస్తోంది. కొన్నేళ్లుగా పార్టీకి సంప్రదాయ ఓటుబ్యాంక్‌గా మద్దతుదారులుగా ఉన్న రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికవర్గం ఇతర వర్గాలు ఎందుకు దూరమవుతున్నారనే అంశంపై లోతైన విశ్లేషణ చేయాలని సూచించింది.

# తెలంగాణలో బీజేపీ బలపడలేదు

- కేసీఆర్ పాలన ఉన్నంతకాలం మోదీ, షా ఆశలు కల్లలే
- తెలంగాణ ప్రజలు సంఘ్‌పరివార్ యత్నాలను తిప్పికొడతారు
- సామాన్యులపై కేంద్రం బడ్జెట్ భారం మోపింది
- విజయగర్వంతో బీజేపీ నేతలు అల్లులపై దాడులకు పాల్పడుతున్నారు
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

**సాక్షి, హైదరాబాద్:** కేసీఆర్ పాలన ఉన్నంత కాలం తెలంగాణలో పాగా వేయటం బీజేపీకి అసాధ్యమని ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మోదీ ఎన్ని ప్రయత్నాలు చేసినా, కేసీఆర్ లాంటి బలమైన ప్రాంతీయ పార్టీ అధినేతను ఢీకొనలేరని తేల్చి చెప్పారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్నేహభావంతో మెలిగే తత్వం ఉన్న తెలంగాణ ప్రజలు, విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను ఆదరించరని, సంఘ్‌పరివార్ ఆలోచనలను తిప్పిగొడతారన్నారు. గత ఐదేళ్లుగా ముస్లింలు, బడుగు బలహీనవర్గాలు, గిరిజనుల విద్యకోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలతో నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉంటారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదు కోసం బీజేపీ అధినేత అమిత్ షా తెలంగాణకు రావటం ఆ పార్టీ అంతర్గత విషయమని, దాన్ని పట్టించుకోనన్నారు. కానీ, తెలంగాణలో పాగా వేసే చర్యల్లో భాగంగానే అమిత్‌షా ప్రత్యేక దృష్టి సారించి తెలంగాణకు వచ్చినట్టయితే వారికి ఆశాభంగం తప్పదని ఆయన పేర్కొన్నారు. అత్యంత బలీయమైన శక్తిగా ప్రాంతీయ పార్టీలున్న ఒడిషా, తమిళనాడు, తెలంగాణలాంటి ప్రాంతాల్లో బీజేపీ ఎన్నటికీ విజయం సాధించలేదని, ఈ ప్రాంతాల్లో కాంగ్రెస్ కనుమరుగై ప్రాంతీయ పార్టీల హవా సాగుతోందన్నారు. గత ఎన్నికల్లో నాలుగు చోట్ల బీజేపీ గెలవటం ఆ పార్టీ బలంగా ఉండటం వల్ల కాదని, మూడు చోట్ల అతి విశ్వాసం, ఒక స్థానంలో సరైన అభ్యర్థి లేకపోవటం టీఆర్ఎస్ ఓటమికి కారణమని అసదుద్దీన్ పరోక్షంగా పేర్కొన్నారు. ఇక భారీ విజయంతో వచ్చిన అహంకారం బీజేపీలో స్పష్టంగా కనిపిస్తోందని, ఆ పార్టీ నేతలు రెచ్చిపోయి దాడులకు పాల్పడుతున్నారని అసదుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఓ ఎమ్మెల్యే దాడికి పాల్పడటం, ఆయన మనుషులు తుపాకీతో రెచ్చిపోవటం ఇందులో భాగమేనన్నారు. అది మంచి పద్ధతి కాదంటూ ప్రధాని నరేంద్రమోదీ ఖండించిన వెంటనే ఆగ్రా వెళ్లే దారిలో ఓ ఎంపీ అనుచరులు టోల్ సిబ్బందిపై దాడికి పాల్పడటం ఆ పార్టీ నాయకుల వైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. ఎన్నికల్లో సులభంగా రూ.50 లక్షలు ఖర్చు పెట్టే నేతలు, టోల్ వద్ద రూ.50 చెల్లించేందుకు మనసు ఒప్పదా అని ప్రశ్నించారు. సోమవారం జరిగే బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మరోసారి ప్రధాని 'ఈ తీరు నచ్చదు'అని అంటారంటూ ఎద్దేవా చేశారు.



### బడ్జెట్‌తో సామాన్యుని నడ్డి విరిచింది

ఇక కేంద్ర బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని, పేద ప్రజలపై ప్రేమ ఒలకబోసే మాటలు చెప్పే బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో వారిపై భారం మోపిందన్నారు. ఇప్పుడు పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల పేదలకు అశనిపాతమే అవుతుందన్నారు. ఆదాయపన్నుపై సర్‌ఛార్జి కూడా భారంగా మారుతుందన్నారు. మోదీ తరచూ చెప్పే నారీ శక్తి మాటలకు, బడ్జెట్‌లో మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని చూస్తే ఎక్కడా పొంతన కనిపించదని విమర్శించారు. న్యూస్‌ప్రింట్‌పై కస్టమ్ డ్యూటీ పెంపు, పుస్తకాల ధరలకు రెక్కలొచ్చే నిర్ణయాలు సరికాదని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కోటి మంది ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అంటూ ఘనంగా చెప్పుకునే మోదీ ప్రభుత్వం, వారికి అందించే ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌లో కోత పెట్టిందని విమర్శించారు. ఉద్యోగాల కల్పనకు సంబంధించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావనే లేదన్నారు.

## మేమూ ఆడేస్తాం..



రొనాల్డో, మెస్సీ, హారీకేన్.. వీరు ఫుట్‌బాల్ ఆట అనగానే వెంటనే గుర్తొచ్చే వారు.. అయితే వారినే తలదన్నేలా మేమూ ఫుట్‌బాల్ ఆడుతామంటున్నాయి ఈ రోబోలు.. ఇంతకీ విషయం ఏంటంటే ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జూలై 4న 'రోబో కప్' పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలకు దాదాపు 30 దేశాల నుంచి 170 జట్లు ఇక్కడికి తరలి వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ, రోబోటిక్స్ అభివృద్ధిలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. భలే భలే కదూ..!

## నటించమంటే జీవిస్తది..!

ఈ పామును చూడగానే మీకేమనిపించింది.. అయ్యో పాపం పాము చచ్చిపోయిందే.. అనుకున్నారు కదా..! కానీ ఇది మామూలు పాము కాదండోయ్.. పెద్ద మాయల మరాఠీ పాము.. ఉత్తర అమెరికాలో ఎక్కువగా కనిపించే ఈ పాము పేరు 'హాగ్నోస్'.. దీని 'నాటకాలు' చూసి కొందరు 'జాంబీ' పాము అని కూడా పిలుస్తారు. ఇంతకీ దీన్ని ఇన్ని పేర్లతో ఎందుకు పిలుచుకుంటారో తెలుసా.. సాధారణంగా ఏ జంతువు అయినా శత్రువుల నుంచి రక్షించుకునేందుకు చాలా ప్రయత్నాలు చేస్తుంటాయి. ఊసరవెల్లి అయితే రంగులు మార్చుకుంటుంది.. కొన్ని రకాల సీతాకోకచిలుకలు చెట్టు బెరడు రంగులో ఉంటాయి.. అయితే ఈ జాదూ పాము మాత్రం.. ఏదైనా ఆపద వచ్చిందనుకోండి.. మొదట తన తల చుట్టూ ఉన్న చర్మాన్ని ఒక్కసారిగా విదిల్చి తాచుపాము మాదిరిగా నటించి.. గట్టిగా హిస్ అంటూ శబ్దం చేస్తుందట. అది వర్క్ అవుట్ కాలేదనుకోండి వెంటనే.. ప్లాన్–బీ సిద్ధంగా ఉంచుకుంటుంది. అదేంటంటే నోరును బాగా తెరిచి వెల్లకిలా పడుకుని (ఫొటోలో ఉన్నట్లు) చనిపోయినట్లు నటిస్తుందట. అంతే దీని శత్రువులు చనిపోయిన దాన్ని తినడమెందుకు అని వెళ్లిపోతాయట. అయితే దీని ఆస్కార్ లెవల్ నటన గురించి ముందే తెలిసిన వారు దాన్ని పట్టుకుంటే చాలు.. వెంటనే కదులుతుందట. చాలా తక్కువ సందర్భాల్లో కాటేస్తుందట. ఈ పాముకు తన ప్రాణంతో పాటు పక్కవాళ్ల ప్రాణం విలువ కూడా తెలుసేమో!!





1497 జూలై 8న వాస్కోడగామ పోర్చుగీసు నుంచి 170 మంది సిబ్బందితో సముద్ర మార్గం ద్వారా భారత్‌కు బయల్దేరాడు.



# ఇసుకకు బదులు ఇవీ..!

- ఖనిజాల శుద్ధిలో వెల్లడయ్యే పదార్థాలపై పరిశోధనలు
- ఈ పరిశోధనల ద్వారా నదులను సంరక్షించుకోవచ్చన్న శాస్త్రవేత్తలు

ఇసుకకు ఉన్న డిమాండ్.. దాని చుట్టూ నడుస్తున్న రాజకీయాలు, అరాచకాలు ఏ ఒక్కప్రాంతానికో పరిమితం కాలేదు. తెలుగురాష్ట్రాల్లో ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా ఇసుక చుట్టూ ఎన్నో వివాదాలు రాజుకున్నాయి. ఇంటి నిర్మాణం మొదలుకుని.. భారీ ప్రాజెక్టుల వరకూ ప్రతిచోటా ఇసుక పాత్ర అత్యంత కీలకం. అందులోనూ నదీ పరీవాహక ప్రాంతాల్లో దొరికే ఇసుకంటే.. కాంక్రీట్ తయారీలో డిమాండ్ మరీ ఎక్కువ. అందుకే.. ఆంధ్రప్రదేశ్‌లో గత పాలకపక్షం ఇసుక తరలింపు విషయంలో అన్ని రకాల అక్రమాలకూ తెగబడిన సంగతి తెలిసిందే. అయితే కాంక్రీట్ తయారీలో ఇసుకే తప్పనిసరిగా ఉండాలా? వేరే ప్రత్యామ్నాయమే లేదా? అనేదానిపై ఎన్నో పరిశోధనల తర్వాత కొన్ని ప్రత్యామ్నాయాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పైగా ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్నట్టు.. నదులను పరిరక్షించుకోవడంతోపాటు వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేందుకూ ఈ ప్రత్యామ్నాయ ఇసుక పదార్థాలు ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



దేశంలో తలసరి కాంక్రీట్ వినియోగం ఒక టన్ను. దేశవ్యాప్తంగా జరుగుతున్న వివిధ మౌలిక వసతులు, ఇతర నిర్మాణ పనుల కారణంగా ఏటా దాదాపు 45కోట్ల ఘనపు (క్యూబిక్) మీటర్ల కాంక్రీట్ ఖర్చయిపోతోంది. ఇందులో కనీసం మూడోవంతు అంటే 15కోట్ల ఘనపు మీటర్ల ఇసుక వినియోగం జరుగుతోంది. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువే. అయినప్పటికీ మన పర్యావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే మాత్రం ఇది

### ప్రమాదకర స్థాయిలో ఇసుక వినియోగం

ప్రమాదకరమైన విషయమే. నదుల్లో ఇసుక రేణువులు తయారయ్యేందుకు వందల, వేల సంవత్సరాలు పడితే.. అంతకంటే చాలా వేగంగా మనం వాటిని ఖాళీ చేసేస్తుండడమే దీనికి కారణం. ఈ ప్రమాదకర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఇసుకకు మనచుట్టూ ఎన్నో ప్రత్యామ్నాయాలు, వాటి వినియోగం, సామర్థ్యాలపై పూర్తిస్థాయి పరిశోధనలు జరిగాయి.

### రాగి తయారీ వ్యర్థాలు

ముడి ఖనిజం నుంచి రాగిని తయారు చేసే క్రమంలో ఖనిజంలోని వ్యర్థాలు వేరుపడతాయి. 'కాపర్ స్లాగ్' అని పిలిచే ఈ వ్యర్థాలను ఇసుకతో కలిపి కాంక్రీట్‌ను తయారు చేసుకోవచ్చని సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఆర్‌ఆర్‌ఐ) ఎప్పుడో గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 3 కోట్ల టన్నుల కాపర్ స్లాగ్ ఉత్పత్తి అవుతూంటే.. భారత్‌లో ఈ మొత్తం దాదాపు 65 లక్షల టన్నులకు పైనే ఉంటుంది. నది ఇసుక, కాపర్‌స్లాగ్ రెండింటిని సమపాళ్లలో కలుపుకుని తయారు చేసే కాంక్రీట్ సాధారణ కాంక్రీట్ కంటే దృఢంగా ఉంటుందని ఒమన్ శాస్త్రవేత్త ఖలీఫా ఎస్.అలీ 2006 నాటి పరిశోధన వ్యాసంలో పేర్కొన్నారు. పేవ్‌మెంట్ స్థాయి కాంక్రీట్ తయారీలో 40% కాంక్రీట్ వాడటం వల్ల అదే స్థాయి సాధారణ కాంక్రీట్ కంటే 20% ఎక్కువ శక్తి కలిగి ఉంటుందని సీఆర్‌ఆర్‌ఐ ధ్రువీకరించింది.

### ఉక్కు పరిశ్రమ వ్యర్థాలు

సిమెంట్ పరిశ్రమపై భారత ప్రభుత్వ వర్కింగ్ గ్రూప్ 12వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా తయారు చేసిన నివేదిక ప్రకారం.. భారత్‌లో ఉక్కు, ఇనుము పరిశ్రమలు దాదాపు కోటి టన్నుల బ్లాస్ట్ ఫర్నేస్ స్లాగ్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. దీన్ని నదుల ఇసుకకు ప్రత్యామ్నాయంగా వాడవచ్చునని, తద్వారా కాంక్రీట్ కంప్రెసివ్ స్ట్రెంగ్త్ చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ స్ట్రక్చర్ అండ్ సివిల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ (2013)లో ఎంసీ నటరాజ అనే శాస్త్రవేత్త ప్రచురించిన పరిశోధన వ్యాసం చెబుతోంది. ఈ బ్లాస్ట్ ఫర్నేస్ స్లాగ్‌ను వాడటం ద్వారా దాదాపు 75% ఇసుకను ఆదా చేయవచ్చు కూడా. కాపర్ స్లాగ్, ఫెర్రస్ స్లాగ్ (ఇనుము తయారీ వ్యర్థం)లను కలిపి వాడితే నదీ ఇసుకను వాడాల్సిన అవసరమే ఉండదని మరో పరిశోధన వ్యాసం వెల్లడించింది. అయితే కొన్ని సమస్యలను దృష్టిలో ఉంచుకుంటే 80% ప్రత్యామ్నాయంగా వాడటమే మంచిదని తమిళనాడులోని కేఎల్ఎన్ కాలేజీ తన పరిశోధనలో పేర్కొంది. ఎస్సార్ స్టీల్ లాంటి కంపెనీలు ఈ దిశగా ఇప్పటికే ముందడుగు వేశాయి కూడా.

### థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి..

బొగ్గును మండించడం ద్వారా విద్యుదుత్పత్తి జరిగే థర్మల్ పవర్ ప్లాంట్లలో ఫ్లైయాష్ వ్యర్థంగా ఉత్పత్తి అవుతుందన్న సంగతి తెలిసిందే. ఇటుకల తయారీతోపాటు అనేక ఇతర అవసరాలకు దీన్ని వాడుతున్నారు. అయితే ఇది ఇసుకకు ప్రత్యామ్నాయమనే సంగతే చాలామందికి తెలియదు. పవర్ ప్లాంట్ వ్యర్థాల్లో ఫ్లైయాష్ దాదాపు 80% ఉంటే.. మిగిలింది బాటమ్ యాష్. సరైన పద్ధతుల్లో ఈ బాటమ్ యాష్‌ను నిల్వ చేయకపోతే పర్యావరణానికి నష్టం జరుగుతుంది. అయితే కొంచెం శుద్ధి చేసిన బాటమ్ యాష్ (30%).. ఇసుక మిశ్రమంతో తయారు చేసిన కాంక్రీట్ బలంగా ఉంటుందని అంతర్జాతీయస్థాయి పరిశోధనలు చెబుతున్నాయి.

### క్వారీల దుమ్ము

స్టోన్ క్రషర్లలో వృథాగా మిగిలిపోయే దుమ్మును ఇసుకకు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే వాడుతున్నారు. రోబోశాండ్ పేరుతో అందు బాటులో ఉన్న ఈ క్వారీ డస్ట్ 55–75% ఇసుకను ఆదా చేస్తుంది. ఒకవేళ ఫ్లైయాష్‌తో కలిపితే ఇసుకకు బదులుగా ఈ మిశ్రమాన్ని వాడుకోవచ్చు. ఫ్లైయాష్‌ను వాడటం ద్వారా కాంక్రీట్‌లోకి నీరు చొరబడే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. అయితే ఫ్లైయాష్ వాడకంతో కాంక్రీట్ ప్రాథమిక శక్తి స్వల్పంగా తగ్గే అవకాశం ఉన్నందున దీన్ని క్వారీడస్ట్‌తో కలిపి వాడటం మేలని అంచనా.

### ఫౌండ్రీ ఇసుక

ప్రపంచవ్యాప్తంగా ఫౌండ్రీ ఉత్పత్తుల తయారీలో భారత్‌ది 4వ స్థానం. ఈ క్రమంలో ఏటా వెలువడే వ్యర్థాలు 78 లక్షల టన్నులు. అత్యధిక సిలికా పదార్థం ఉండే ఈ ఫౌండ్రీ సాండ్‌ను లోహ పరిశ్రమదారులు వృథా చేస్తూంటారు. ఈ వ్యర్థాన్ని వాడుకోగలిగితే కాంక్రీట్ తయారీలో 30% వరకూ ఇసుకను ఆదా చేయవచ్చు.

### భవనాల వ్యర్థాలూ పనికొస్తాయి

కూల్చేసిన భవనాలు, నిర్మాణాల వ్యర్థాలను లోతట్టు ప్రాంతాల్లో పారబోయడం ప్రస్తుతం మనం చేస్తున్న పని. దేశం మొత్తమ్మీద ఈ వ్యర్థాల మోతాదు ఎంత అన్న దానిపై స్పష్టమైన అంచనాలేవీ లేవు. ఒక్క న్యూఢిల్లీలోనే రోజుకు దాదాపు 4వేల టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు ల్యాండ్ ఫిల్స్‌కు చేరుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యర్థాలను వాడటం ద్వారా ఇసుక వాడకాన్ని తగ్గించవచ్చునని.. కాకపోతే సాధారణ కాంక్రీట్‌తో పోలిస్తే దీని శక్తి 10–15% తక్కువ ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ.. భవనానికి శక్తినిచ్చే స్తంభాలు, పైకప్పులకు బదులు ఫ్లోరింగ్ తదితర పనులకు ఈ కాంక్రీట్ వినియోగం నష్టమేమీ కాదని వీరు అంటున్నారు. ఢిల్లీలో ఇప్పటికే భవన నిర్మాణ వ్యర్థాలను శుద్ధిచేసే ప్రత్యామ్నాయ ఇసుక తయారీ కేంద్రాలున్నాయి.

## చంద్రయాన్‌కు సర్వం సిద్ధం

- ఖరారైన రాష్ట్రపతి పర్యటన
- 15వ తేదీ వేకువ జామున చంద్రయాన్–2 ప్రయోగం

శ్రీహరికోట (సూళ్లూరుపేట): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈనెల 15వ తేదీ వేకువ జామున 2.51 గంటలకు ప్రయోగించనున్న చంద్రయాన్–2 కు సంబంధించి అన్ని పరీక్షలను పూర్తి చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ల్యాండర్–రోవర్‌కు ఉన్న లింక్ చెకింగ్ చేశారు. రాకెట్‌కు సంబంధించి పేజ్–3 లెవెల్–2ఏ పరీక్షలు పూర్తి చేసి అంతా సిద్ధం చేశారు. శనివారం రాత్రికి ఇంకా చేయాల్సిన తుది విడత తనిఖీలు నిర్వహించి ఆదివారం ఉదయాన్నే 6 గంటలకు వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్) నుంచి జీఎస్ఎల్వీ మార్క్3–ఎం1 రాకెట్‌ను ఉంబ్లికల్ టవర్ (ప్రయోగవేదిక)కు అనుసంధానించేందుకు రైల్వేట్రాక్ లాంటి పట్టాలపై తరలించే ప్రక్రియను చేపట్టనున్నారు. దీంతో రాకెట్ అనుసంధానం పనులన్నీ పూర్తి చేసినట్లు అవుతుంది. ప్రయోగవేదికకు అనుసంధానం చేసిన తరువాత మరోమారు పరీక్షలు నిర్వహించి ఆఖరుగా ఎంఆర్ఆర్ సమావేశాన్ని నిర్వహించిన తరువాత కౌంట్‌డౌన్ సమయాన్ని, ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు.

### రాష్ట్రపతి పర్యటన ఖరారు..

భారత రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ షార్ పర్యటన అధికారికంగా ఖరారైంది. ఈ నెల 13వ తేదీన రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ తిరుమలకు వెళ్లి కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని 14న షార్‌కు చేరుకుంటారని షార్ అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈయనతో పాటుగా ఏపీ గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మరో రెండు రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు హాజరయ్యే అవకాశం ఉంది. అదే విధంగా రాజ్యసభ సభ్యులు కొంతమంది వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## టీఆర్‌టీ నియామకాలకు లైన్ క్లియర్!

- ఉమ్మడి జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- రోస్టర్, మెరిట్ జాబితా, అర్హుల జాబితాలను కమిటీలకు అందజేత
- సబ్జెక్టుల వారీ ఖాళీలు, పోస్టు కేటగిరీలను నిర్ణయించాక నియామకాలు



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) అభ్యర్థులకు శుభవార్త. ఏళ్లుగా ఎదురు చూస్తోన్న ఉపాధ్యాయ నియామకాలకు లైన్ క్లియరైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం టీఆర్టీ–2017 నిర్వహించింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా అర్హత పరీక్ష నిర్వహించి ఫలితాలు వెల్లడించినప్పటికీ కోర్టు కేసులు, ఇతరత్ర కారణాలతో నియామకాల ప్రక్రియలో జాప్యం జరిగింది. దీంతో అభ్యర్థులు అప్పట్నుంచి ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రం చేశారు. ఈక్రమంలో టీఎస్‌పీఎస్సీ అర్హుల జాబితాను పాఠశాల విద్యాశాఖకు సమర్పించింది. దీంతో నియామకాల ప్రక్రియ టీఎస్‌పీఎస్సీ నుంచి విద్యాశాఖకు చేరింది. ఎట్టకేలకు ప్రభుత్వం శనివారం స్పష్టత ఇచ్చింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను నిబంధనలకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని స్పష్టం చేస్తూ జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఉమ్మడి జిల్లాలకు కమిటీలు

ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కార్యదర్శిగా జిల్లా విద్యాశాఖ అధికారి వ్యవహరిస్తారు. ఈ కమిటీకి సభ్యులుగా జెడ్పీ సీఈఓ, కొత్త జిల్లాల డీఈఓలు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీ కమిషనర్లు, జిల్లా షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి వస్తే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఉంటారు. ఇప్పటికే టీఆర్‌టీకి సంబంధించి ఎంపిక జాబితాను పాఠశాల విద్యాశాఖ జిల్లా కమిటీలకు సమర్పించినట్లు సమాచారం. రోస్టర్, మెరిట్ ఆధారంగా త్వరగా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా కమిటీలు తమ పరిధిలోని పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఖాళీలను గుర్తించాల్సి ఉంది. అదేవిధంగా కేటగిరీ 1,2,3,4 స్థానాలను సైతం నిర్ధారించాలి. ఈ ప్రక్రియ పూర్తైన అనంతరం నియామకాలు చేపట్టాలి.

## పంట బీమాలో రైతులు నమోదయ్యేలా చూడాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి**



సాక్షి, హైదరాబాద్: పత్తి పంట బీమా గడువు జూలై 15 న, మిగతా పంటల గడువు జూలై 31 న ముగుస్తున్నందున రైతులు పంట బీమాలో నమోదు చేసుకునేలా చూడాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో పార్థసారథి అధ్యక్షతన ఉద్యానవన శాఖలపై జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రుతుపవనాల ఆలస్యంతో పంటలసాగు కూడా జాప్యమైనందున వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు అందుబాటులో ఉండి వారికి తగు సూచనలు చేయాలని ఆదేశించారు. రైతుబంధు పథకం కింద 60 శాతం మంది రైతులకు వారి ఖాతాలకు డబ్బును జమచేశామని, మిగతా వారికి త్వరలోనే జమచేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాలను ప్రభుత్వ పోర్టల్ లో నమోదు చేయించుకోని రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తీర్ణాధికారులను సంప్రదించి నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతు బీమా పథకం కింద 30.65 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నారని, వివిధ కారణాలతో 12,820 మంది మరణించగా వారి కుటుంబీకులకు బీమా వర్తింపజేసి రూ.641 కోట్లు అందజేశామన్నారు. పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి మూడు విడతల్లో రూ.6000 రైతు ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. మొదటి విడత జూలైలో ఇచ్చేలా నిర్ణయించినందున రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా విత్తన, ఎరువుల సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, సరిపడా ఎరువులను పీఏసీఎస్ కేంద్రాలలో నిల్వ చేయాలని, పీఓస్ మిషన్ల ద్వారా అమ్మకాలు జరపాలని సూచించారు. విత్తనాలను కూడా ఆన్‌లైన్ విత్తన పద్ధతి ద్వారా రైతులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జా, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను కరుణించని బ్యాంకర్లు

- ఖరీఫ్ పంట రుణ లక్ష్యం రూ.28 వేల కోట్లు
- సీజన్ మొదలైనా ఇప్పటికీ వెయ్యి కోట్లు కూడా ఇవ్వని స్థితి
- రుణమాఫీ హామీ ఇచ్చినా పాత బకాయిలు చెల్లించాలని రైతులపై ఒత్తిడి
- బ్యాంకుల చుట్టూ తిరిగి నిరాశతో వెనుదిరుగుతున్న రైతులు



| ఏడాది | పంట రుణ లక్ష్యం | బ్యాంకులు ఇచ్చింది (కోట్ల రూపాయల్లో) |
|---|---|---|
| 2014–15 | 18,717.95 | 17,019.92 |
| 2015–16 | 27,800.14 | 20,585.74 |
| 2016–17 | 29,101.36 | 26,282.40 |
| 2017–18 | 39,752.45 | 31,410.57 |
| 2018–19 | 42,494.53 | 33,751.72 |
| 2019–20 | 48,740.00 | 1,000.00 |

(ఖరీఫ్‌లో ఇప్పటివరకు అంచనా)

సాక్షి, హైదరాబాద్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది తెలంగాణలో బ్యాంకుల తీరు. సర్కారు రుణమాఫీ హామీ ఇచ్చినా పాత బకాయిలు చెల్లించాలని రైతులపై బ్యాంకులు ఒత్తిడి చేయడంతో పాటుగా ఖరీఫ్ సీజన్‌కు కొత్తగా రుణాలిచ్చేది లేదంటూ తెగేసి చెబుతున్నాయి. దీంతో తెలంగాణలో బ్యాంకుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. బ్యాంకులు కొత్తగా రుణాలివ్వకపోవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా ఖరీఫ్ సీజన్‌కు ముందే అంటే మే నెల చివరి వారం నుంచే రైతులకు పంట రుణాలు ఇవ్వాలి. కీలకమైన సీజన్ కొనసాగుతుండగా బ్యాంకులు ఇలా వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం ఇప్పటివరకు రైతులకు వెయ్యి కోట్ల రూపాయలు కూడా బ్యాంకులు పంట రుణాలు ఇవ్వలేదు. అధికారికంగా మాత్రం ఇప్పటికీ బ్యాంకులు ఎంతిచ్చాయో కూడా తమకు లెక్కలు చూపలేదని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇలా ఇష్టారాజ్యంగా బ్యాంకులు వ్యవహరిస్తున్న తీరుపై రైతులు, వ్యవసాయశాఖ అధికారులు మండిపడుతున్నారు.

### ఖరీఫ్ పంట రుణాల లక్ష్యం రూ. 28 వేల కోట్లు

ఏడాదికేడాదికి పంట రుణ లక్ష్యాన్ని పెంచడంలో బ్యాంకులు ముందుంటున్నాయి. గతేడాది పంట రుణ లక్ష్యం రూ. 42,494 కోట్లు కాగా, ఈ ఏడాది ఖరీఫ్, రబీల్లో రూ.48,740 కోట్లు ఇవ్వాలని ఇటీవల జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశంలో వెల్లడించాయి. ఈ ఖరీఫ్ సీజన్లో రూ. 28 వేల కోట్లు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. లక్ష్యాలు భారీగానే ఉంటున్నాయి కానీ ఆచరణలో రుణాలు ఇవ్వడంలో వెనకడుగు వేస్తున్నాయి. ఖరీఫ్‌లో సాధారణ పంట సాగు లక్ష్యం 1.08 కోట్ల ఎకరాలు. అందులో ఇప్పటికే 11 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే దాదాపు 10% సాగు నమోదైంది. అందులో అత్యధికంగా పత్తి 8.50 లక్షల ఎకరాల్లో సాగైంది. ఆ ప్రకారం 10% రుణాలు ఇచ్చినా దాదాపు రూ. 2,800 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ వెయ్యి కోట్లు కూడా ఇవ్వలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. రుణ ప్రణాళికలో 55.04 లక్షల మందికి ఖరీఫ్‌లో పంట రుణాలు ఇస్తామని పేర్కొన్న బ్యాంకర్లు ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే అన్నదాతలకు చుక్కలు చూపించారు. దీంతో సాగు ఖర్చుల కోసం రైతులు ఎప్పటిలాగే ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

### రుణమాఫీపై హామీ ఇచ్చినా...?

పాత బకాయిలపై ప్రభుత్వం కచ్చితమైన హామీ ఇచ్చినా రైతులపై బ్యాంకర్లు కరుణించడం లేదు. డిసెంబర్ 11వ తేదీలోపున్న రూ. లక్ష రుణాలను మాఫీ చేస్తానని సర్కారు అధికారికంగా చెప్పింది. గతంలోనూ రుణమాఫీ చేసినా బ్యాంకర్లు ఇదే తీరు ప్రదర్శించారు. గతంలో రుణమాఫీ నాలుగు విడతలుగా చేశారు. స్వయానా ముఖ్యమంత్రి కేసీఆరే అసెంబ్లీ సాక్షిగా రుణమాఫీ ప్రకటనను బ్యాంకర్లు మాత్రం నమ్మడం లేదని అధికారులు అంటున్నారు.

### గత ఐదేళ్లుగా ఇదే దుస్థితి...

రాష్ట్రం ఏర్పాటు కాకముందు తెలంగాణ ప్రాంతంలో పంట రుణాలు లక్ష్యానికి మించి ఇచ్చేవి. తెలంగాణ ఏర్పాటయ్యాక బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. బ్యాంకుల తీరుపై అటు రైతులు, ఇటు సర్కారు పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు మొదటిసారి తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ చేసినప్పుడు, విడతల వారీగా మాఫీ సొమ్మును బ్యాంకులకు అందజేసింది. అయితే ఆ సందర్భంగా బ్యాంకులు రైతుల నుంచి వడ్డీ వసూలు చేయడం కూడా విమర్శలకు దారితీసింది. తెలంగాణ ఏర్పాటు వరకు లక్ష్యాలకు మించి రుణాలు ఇచ్చిన బ్యాంకులు రుణమాఫీ అమలు తర్వాత కొర్రీలు వెతకడం ప్రారంభించాయి. 2011–12 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ప్రాంతంలో బ్యాంకులు తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి 115% పంట రుణాలు ఇవ్వగా, 2012–13లో ఏకంగా 121%, 2013–14లో 103 % రుణాలు ఇచ్చాయి. ఉదాహరణకు 2011–12లో బ్యాంకుల పంట రుణ లక్ష్యం రూ. 10,233 కోట్లు కాగా, రూ. 11,787 కోట్లు ఇచ్చాయి. ఇక తెలంగాణ ఏర్పాటయ్యాక 2014–15 ఆర్థిక ఏడాదిలో పంట రుణాల లక్ష్యంలో 93 శాతమే ఇచ్చాయి. అలా తగ్గిస్తూ గతేడాది 79% మాత్రమే ఇచ్చాయి. 2017–18 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల లక్ష్యం రూ. 39,752 కోట్లు కాగా, కేవలం రూ. 31,410 కోట్లు మాత్రమే ఇచ్చాయి. మరోవైపు చాలాచోట్ల 'రైతుబంధు'సొమ్మును ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయగా ఆ సొమ్మును పాతబాకీ వడ్డీ కింద బ్యాంకులు జమ చేసుకోవడమూ విమర్శలకు దారితీసింది. వడ్డీ వసూలు చేయవద్దని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా బ్యాంకర్లు ఏమాత్రం అంగీకరించడంలేదు. ఇలా రైతులను ఆదుకోవాల్సి ఉండగా, కఠినంగా వ్యవహరిస్తున్నాయి.




సాక్షి
6 నల్లగొండ | ఆదివారం | జూలై | 7 | 2019
www.sakshi.com

# సంక్షేమ రథ సారథి

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢమాసం, తిథి శు. పంచమి ప.2.13 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం పుబ్బ రా.12.36 వరకు, తదుపరి ఉత్తర వర్జ్యం ఉ.9.44 నుంచి 11.13 వరకు దుర్ముహూర్తం సా.4.47 నుంచి 5.39 వరకు, అమృతఘడియలు... సా.6.40 నుంచి 8.09 వరకు.

సూర్యోదయం : 5.34
సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

## పి.చిదంబరం (ఎంపీ) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

బడ్జెట్ వెరైటీగా ఉంది. ఫ్లేవరే లేదు. కాంగ్రెస్ ఎప్పుడూ వెరైటీని చూసుకోలేదు. ఫ్లేవర్ ఉందా లేదా అని చూసుకుంది. నేనూ అలాగే చూసుకున్నాను. నాకు ముందున్న మన్మోహన్‌సింగ్, మన్మోహన్‌కి ముందుండిపోయిన ప్రణబ్ ముఖర్జీ కూడా ఫ్లేవర్‌నే చూసుకున్నారు.

బడ్జెట్ తయారీకి ముందు నిర్మలా సీతారామన్ హల్వాను తయారు చేస్తుంటే ఆ ఫ్లేవర్ నార్త్ బ్లాక్ నుంచి సౌత్ బ్లాక్ దాకా వ్యాపించిందని బీజేపీ వాళ్లు కథలు కథలుగా చెప్పుకున్నారు! బడ్జెట్‌లో మాత్రం ఆ ఫ్లేవర్ నార్త్ వరకే ఉండిపోయింది. అది కూడా బడ్జెట్ ఫ్లేవర్ కాదు. బడ్జెట్ కాగితాలను చుట్టుకొచ్చిన గుడ్డసంచీ ఫ్లేవర్. ఆ గుడ్డసంచీ ఫ్లేవర్ కూడా తమిళ్ ఫ్లేవర్ కాదు. తెలుగు ఫ్లేవర్ కాదు. కన్నడ ఫ్లేవర్ కాదు, మలయాళీ ఫ్లేవర్ కాదు. పూర్తిగా నార్త్‌వారి హిందీ ఫ్లేవర్!

'లెదర్ సూట్‌కేస్ బ్రిటిష్ వాళ్ల సంప్రదాయం, 'బహీ ఖాతా' భారతీయ సంప్రదాయం' అన్నారు సీతారామన్! భారతీయురాలిగా బ్రిటిష్ సంప్రదాయాన్ని వద్దనుకున్నప్పుడు, తమిళియన్‌గా హిందీ సంప్రదాయాన్ని ఆమె ఎందుకు వద్దనుకోలేకపోయారు?! బహీ ఖాతాకు తమిళ్‌లో పేరేమిటని చెన్నైలో ఎవరికి ఫోన్ చేసి అడిగితే ఎవరు మాత్రం చెప్పరు?!

నార్త్ బ్లాక్‌లో ఫైనాన్స్ మినిస్ట్రీ ఉంటుంది. సౌత్ బ్లాక్‌లో ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్ ఉంటుంది. ఫైనాన్స్ మినిస్ట్రీలో వంద మంది ఉంటారేమో. ప్రధాని కార్యాలయం నూటా ముప్పై ఐదు కోట్ల మంది ప్రజలది. సౌత్‌ని వదిలి, నార్త్ వాళ్ల కోసమే హల్వాను, పేపర్ ప్లేట్లను తెచ్చినట్లుగా బహీ ఖాతాను పట్టుకొచ్చారు సీతారామన్.

బడ్జెట్‌ను సమర్పిస్తున్నంత సేపూ బల్లను చేత్తో మోదుతూనే ఉన్నారు మోదీ! ఆయన్ని చూసి ఆయన వెనక కూర్చొని ఉన్నవాళ్లు



మోదడం మొదలుపెట్టారు. వాళ్లను చూసి మళ్లీ ఆయన! సీతారామన్‌కు మోదే అవకాశం లేదు కాబట్టి, స్పీకర్‌ని మోదడం మొదలుపెట్టారు! ఒక లైన్ చదువుతారు.. 'స్పీకర్ సర్' అంటారు. 'ఐ రిపీట్' అంటారు.. 'స్పీకర్ సర్' అంటారు. 'ఇది సాధించాం స్పీకర్ సర్, అది సాధించబోతాం స్పీకర్ సర్' అంటారు, ఏది ఎంత సాధించారో చెప్పరు, సాధించబోతున్నది ఎంతో చెప్పరు. నిజంగా వెరైటీ బడ్జెట్.

అన్నిట్లోనూ మంచే చూడమన్నారు కదా అని అర్థశాస్త్రంలోనూ మంచే చూస్తే అది చెడు అవుతుంది. సీతారామన్ బడ్జెట్‌లో మంచీ లేదు చెడూ లేదు! మంచి చెప్పినవారు మాత్రం ఉన్నారు. ఆ మంచి చెప్పిన మంచివాళ్లు కూడా బడ్జెట్‌లో లేరు. బడ్జెట్ స్పీచ్‌లో ఉన్నారు. వివేకానందుడు ఉన్నాడు. ఉర్దూ కవి మంజూర్ హష్మీ ఉన్నాడు. తమిళ కవి పిసరాందయార్ ఉన్నాడు. కౌటిల్యుడు ఉన్నాడు. కన్నడ బసవేశ్వరుడు ఉన్నాడు. వాళ్లు చెప్పినట్లుగా సీతారామన్ చెప్పిన కోట్స్ ఉన్నాయి.

బడ్జెట్‌లో లెక్కలు ఉంటాయి. ఇంతొస్తుంది, ఇంతపోతుంది అని ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచి ఇంతా వస్తుంది, ఎక్కడెక్కడికి ఇదంతా పోతుంది అని కూడా ఉంటుంది. సీతారామన్ బడ్జెట్‌లో సూక్తులు, సుభాషితాలు, స్పీకర్ సర్ మాత్రమే ఉన్నారు. పాపం.. కృష్ణమూర్తి ఎక్కడున్నాడో మరి! కుర్రవాడు. చిన్నవయసులోనే దేశానికి చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ అయినవాడు.

ఫోన్ చేశాను.

"అబ్బాయి ఇంకా లేవలేదు నాయనా.." అని ఎవరిదో పెద్దావిడ గొంతు!

దేశాన్ని ఐదు లక్షల కోట్ల డాలర్లకు లేపుతానని చెప్పినవాడు ఇంకా లేవకపోవడం ఏమిటి!

బడ్జెట్ వేస్తున్నప్పుడు.. 'నీకేం తెలుసు' అని సీతారామన్ అతడిని మోచేత్తో పక్కకు నెట్టేసే ఉంటారు.. సలహాదారు సలహా తీసుకోకుండా బడ్జెట్‌ను సమర్పిస్తే మరింత వెరైటీగా ఉంటుందని!

ఫ్రీకాలమ్



కె. రామచంద్రమూర్తి



స్వయం సహాయక బృందాల సభ్యులకు ఐదువేల రూపాయల 'ఓవర్‌డ్రాఫ్ట్' (తాత్కాలిక రుణం) సౌకర్యం కల్పిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారంనాడు 2019–20 బడ్జెట్ ప్రసంగంలో ఒకటికి రెండు సార్లు ఉద్ఘాటించినప్పుడు వింతగా వినిపించింది. తెలుగింటి కోడలు దేశ బడ్జెట్‌ను సమర్పించి కేంద్ర ఆర్థిక శాఖను పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్న తొలి మహిళా మంత్రిగా చరిత్ర పుటలలోకి ఎక్కడం సంతోషం కలిగించింది. కానీ ఈ మాత్రం సహాయానికే కేంద్ర ప్రభుత్వం ఇంత గొప్పగా చాటుకుంటే కుటుంబ సభ్యులలో ప్రతి ఒక్కరికీ మేలు చేయడానికి ప్రయత్నించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతగా చెప్పుకొని ఉండాల్సింది? తండ్రి బాటలో నడుస్తూ ఆశా వర్కర్ల వేతనాలను మూడు వేల నుంచి పది వేలకు పెంచిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత ఘనంగా చెప్పుకోవాలి? ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులైన ప్రజలు చెప్పుకోవాలి కానీ ముఖ్యమంత్రులూ, మంత్రులూ, అధికారులూ చెప్పుకోకూడదు. ఇప్పటికీ వైఎస్‌ఆర్ ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నారంటే సంక్షేమ పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణ ప్రధాన కారణం. కులం, ప్రాంతం, పార్టీ ప్రమేయం లేకుండా సర్వజనులకూ సంక్షేమం అనే సూత్రాన్ని అమలు చేసి సిసలైన ప్రజా నాయకుడిగా నిలిచిన వైఎస్ 70వ జయంతి రేపు. సంక్షేమ సారథిగా వైఎస్ పెట్టిన ఒరవడినే ప్రధానులైనా, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులైనా అనుసరిస్తున్నారు. 1983లో ఎన్టీ రామారావు ప్రారంభించిన సంక్షేమ పథకాలను 2004లో పునరుద్ధరించి మరింత వేగంగా, సర్వజన సమ్మతంగా అమలు చేయడమే కాకుండా అనేక కొత్త పథకాలకు శ్రీకారం చుట్టిన జనహృదయాధినేత వైఎస్. పథకాలు కొన్నిటినే ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

### సంక్షేమం అభివృద్ధికి సోపానం

బడ్జెట్‌లో సింహభాగం ఉచితాల(ఫ్రీబీస్)కే పోతే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఉండవనీ, సంక్షేమ వ్యయానికి సరిహద్దులు ఉండాలనీ వాదించే ఆర్థికవేత్తలు చాలామంది ఉన్నారు. సంక్షేమమే అభివృద్ధికి దారితీస్తుందని అర్థం చేసుకోవాలంటే మనసుండాలి. మానవత్వం ఉండాలి. 1991లో నాటి ప్రధాని పి.వి. నరసింహారావు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన సమయంలో 'రిఫార్మ్స్ విత్ హ్యూమన్ ఫేస్' (మానవీయ కోణంతో సంస్కరణలు) అంటూ నొక్కి చెప్పేవారు. 1996లో కాంగ్రెస్ పార్టీ ఓటమి, పి.వి. పదవీ విరమణ తర్వాత ఆయన తరచు హైదరాబాద్ సందర్శించేవారు. నాబోటివాళ్ళు కలుసుకున్నప్పుడు 'వేర్ ఈజ్ హ్యూమన్ ఫేస్?' (మానవీయకోణం ఎక్కడుంది?)అంటూ నిర్వేదంగా పెదవి విరిచేవారు. మానవత్వం లేని భౌతిక సంపద వ్యర్థం. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత సంపన్నులు మరింత సంపన్నులైనారు. సంపద సృష్టిస్తే దాని ఫలితాలు క్రమంగా కిందికి దిగి అట్టడుగు వర్గాలకు మేలు జరుగుతుందనే (ట్రిక్లింగ్ ఎఫెక్ట్) సిద్ధాంతం పనిచేస్తున్నట్టు కనిపించలేదు. కొంతమంది ముఖ్యమంత్రులు ఆర్థిక సంస్కరణలనూ, మార్కెట్ ఎకానమీనీ అపార్థం చేసుకొని క్రోనీ కేపిటలిస్టులకు అక్రమ ప్రయోజనాలు కలిగించే ఉద్దేశంతో విద్య, ఆరోగ్య రంగాలనుంచి ప్రభుత్వాలను తప్పించారు. మార్కెట్ ఎకానమీ పుట్టిన పాశ్చాత్య దేశాలలో సైతం విద్య, ఆరోగ్య రంగాల నుంచి ప్రభుత్వాలు పూర్తిగా నిష్క్రమించలేదు. బ్రిటన్ ప్రధాని సంతానం లేదా అమెరికా అధ్యక్షుడి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకే వెడతారు. ప్రభుత్వ పాఠశాలలూ, కళాశాలలనూ పట్టించుకోకపోవడం, ఏదో ఒక సాకు (రేషనలైజేషన్) చూపించి ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం వల్ల పేద వర్గాలు కూడా పిల్లలను ప్రైవేటు స్కూళ్ళకే పంపక తప్పని పరిస్థితి. ఆరోగ్యరంగం డిటో. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు లేకపోవడం, మందులు దొరకపోవడం, సేవలు క్షీణించడంతో ప్రైవేటు ఆస్పత్రులకు గిరాకీ పెరిగింది. కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వైద్యం అందిస్తామనీ, కార్పొరేట్ కళాశాల స్థాయిలో విద్యను అందిస్తామనీ నాయకులు చెప్పుకునే దుస్థితికి చేరుకున్నాం. గురుకుల పాఠశాలలు కొంత ఊరట కలిగిస్తున్నప్పటికీ పేద, మధ్య తరగతి కుటుంబాలు చితికిపోవడానికి విద్య, ఆరోగ్యం కోసం చేసే శక్తికి మించిన ఖర్చులే ప్రధాన కారణం. దీన్ని గ్రహించి పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకునేందుకు ప్రయత్నించిన తొలి ముఖ్యమంత్రి వైఎస్. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఫలితంగా వేలమంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య అభ్యసించి మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఈ సంక్షేమ చర్య యువతీయువకులకు ఉన్నత విద్యను ప్రసాదించి ఉద్యోగాలకు అర్హులను చేసింది. ఇందులో సంక్షేమం ఉన్నది. అభివృద్ధీ ఉన్నది. ఈ పథకాన్ని విస్తరించి జగన్‌మోహన్‌రెడ్డి 'అమ్మ ఒడి' పథకాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత శాతం పెరుగుతుంది.

వైఎస్ అస్తమించి పదేళ్ళు కావస్తున్నా ఇప్పటికీ ప్రజల హృదయాలలో నిలిచి వెలగడానికి కారణం ఏమిటి? కాంగ్రెస్ ముఠా రాజకీయాలలో వైఎస్ ఆత్మరక్షణ చేసుకుంటూ అంచెలంచెలుగా పైకి వచ్చిన తీరూ, ప్రజలతో మమేకమై వారి సేవ చేసి తరించాలన్న ఆకాంక్ష ఆయనను విలక్షణమైన నాయకుడిగా తీర్చిదిద్దాయి. కార్యాలయంలో కంప్యూటర్ ముందు కూర్చొని వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం కంటే పల్లెలకు వెళ్ళి రైతులతో మాట్లాడటానికి ఇష్టపడే వారు ఆయన. టైమ్స్ కవర్‌పేజీపైన తన ఫొటో ఉండాలనే తాపత్రయం లేదు. పేదవారి కళ్ళల్లో సంతోషం చూడాలని తప్పించేవారు. తన కంటే ముందు పదమూడు మంది అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పని చేసినా రైతులలో, ఉద్యోగులలో, మేధావులలో, ఇతర వర్గాలలో వైఎస్ పట్ల ఉన్నంత ప్రేమాభిమానాలు ఇతరులకు లేవంటే అతిశయోక్తి కాదు. ఒకే ఒక మినహాయింపు ఎన్‌టి రామారావు. వైఎస్ చేపట్టినన్ని సంక్షేమ కార్యక్రమాలు ఎన్‌టిఆర్ అమలు చేయలేదు. ఎన్‌టిఆర్ 1994లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సంతకాలు చేసి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలనూ, అంతకు ముందు ఎన్టీఆర్ అమలు చేసిన కార్యక్రమాలనూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చాక రద్దు చేశారు. 2004లో వైఎస్ రాష్ట్ర పగ్గాలు చేపట్టగానే వ్యవసాయ రంగానికి రోజూ తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్తు ఇచ్చేందుకూ, రూ. 1,250 కోట్ల మేరకు పేరుకున్న విద్యుచ్ఛక్తి చార్జీల బకాయిలు మాఫ్ చేసేందుకూ సంబంధించిన ఫైళ్ళపైన సంతకాలు చేశారు. పేదల సమస్యల పట్ల అవగాహన, వాటిని పరిష్కరించాలనే తపన వైఎస్‌కు రాజకీయాలలో ప్రవేశించినప్పటి నుంచీ ఉండేది. పాదయాత్రలో ఎదురైన అనుభవాలూ, ప్రజల సమస్యలను ఆలకించిన తర్వాత మనసులో కదలాడిన భావాలూ సంక్షేమ కార్యక్రమాలకు రూపునిచ్చి ప్రాణంపోశాయి.

### పాదయాత్రల కుటుంబం

మండుటెండలో ఏప్రిల్ మాసంలో (9 జూన్ 2003) రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుంచి వైఎస్ ప్రారంభించిన పాదయాత్ర 67 రోజులు సాగింది. 1,475 కిలో మీటర్లు నడిచి ఇచ్ఛాపురం చేరుకొని అక్కడ ప్రజాప్రస్థాన జ్ఞాపిక స్థూపాన్ని నెలకొల్పడానికి ముందే ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్ వంటి పథకాల రూపకల్పన జరిగి ఉంటుంది. నాయకుల దగ్గరికి ప్రజలు వస్తారు. తమ కష్టాలు చెప్పుకుంటారు. మనసున్న నాయకులు స్పందించి వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తారు. అది ఉత్తమం. నాయకులే ప్రజల దగ్గరికి వెళ్ళి వారి సమస్యలను ప్రత్యక్షంగా చూడడం అత్యుత్తమం. పరిష్కారాలు అక్కడే సాక్షాత్కరిస్తాయి. అమలు చేయడమే తరువాయి. వైఎస్ బాటలోనే ఆయన తనయ షర్మిల పాదయాత్ర చేశారు. అనంతరం జగన్ సుదీర్ఘ పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించారు. ఒకే కుటుంబంలో ముగ్గురు ఇంత దూరం పాదయాత్ర చేయడం ప్రపంచంలో మరెక్కడా లేదు. వైఎస్ మొదటి పాదయాత్ర చేవెళ్ళ–ఇచ్ఛాపురం కాదు. దీని కంటే 17 సంవత్సరాల ముందే పోతిరెడ్డిపాడు పాదయాత్రకు వైఎస్ నాయకత్వం వహించారు. 1986 జనవరి ఒకటో తేదీన లేపాక్షి నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఆరు పట్టణాలూ, 60 గ్రామాల మీదుగా ఇరవై రోజుల పాటు 500 కిలోమీటర్లు సాగి పోతిరెడ్డిపాడు చేరుకున్నది. మూడేళ్ళకు ఒకసారి కరువు కరాళనృత్యం చేసి ప్రజల బతుకుల్లో బడబాగ్ని నింపుతుంటే ఏదో ఒకటి చేయాలనే దీక్షతో వైఎస్, ఇతర మిత్రులు కలసి జరిపిన జనయాత్ర అది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి కృష్ణా జలాలను రాయలసీమకు ఉదారంగా సరఫరా చేయాలన్నది వారి డిమాండ్. రెండు దశాబ్దాల తర్వాత ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ ఆ పని చేశారు. ఆ పాదయాత్రలో ఎదురైన అనుభవాలూ, 2003 నాటి ప్రజాప్రస్థానం తాలూకు అనుభవాలూ కలబోసి జలయజ్ఞం ఆవిష్కృతమైంది. లక్షా ఎనభై వేల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రాజెక్టులు నిర్మించి కోటి ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని కల కన్నారు. 86 ప్రాజెక్టు ప్రారంభించారు. ఆయన హయాంలోనే 12 ప్రాజెక్టులు పూర్తయినాయి. 21 ప్రాజెక్టులు పాక్షికంగా అమలు జరిగాయి. అమెరికాలోని కొలరాడో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మాదిరే ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజెక్టు నిర్మించి గోదావరి జలాలను 600 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోయాలని సంకల్పించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత దాని రూపం మారి కాళేశ్వరం బృహత్తర ప్రాజెక్టు అవతరించింది. 2000లో టీడీపీ ప్రభుత్వం విద్యుచ్ఛక్తి రంగంలో అమలు చేయడానికి ప్రయత్నించిన సంస్కరణలను ప్రతిఘటించడంలో వైఎస్ ముందున్నారు. పాత ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌లో ఆమరణదీక్ష చేపట్టిన అఖిలపక్ష ఎంఎల్‌ఏలకు నాయకత్వం వహించారు. ఆ సంవత్సరం ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో పోలీసులు జరిపిన కాల్పులలో ఇద్దరు మరణించారు. 14 రోజుల ఆమరణదీక్ష విరమించారు. ఆ ఉద్యమమే వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్తు ఇవ్వాలనే నిర్ణయానికి స్ఫూర్తి.

### ఓటమి ఎరుగని విజేత

ముప్పయ్ నాలుగేళ్ళ రాజకీయ ప్రస్థానంలో ఓటమి ఎరుగని నేత వైఎస్. ఆయన రాజకీయ జీవితం ఆది నుంచీ ఏటికి ఎదురీదడమే. పట్టువిడవని దృఢదీక్షతో అవరోధాలను అధిగమిస్తూ విజయలక్ష్యం వైపు సాగింది. ఇచ్చిన మాటకు కట్టుబడే తత్వం ఆద్యంతం ఆయనను రాజీలేకుండా నడిపించి ఎనలేని విశ్వసనీయతను సంపాదించిపెట్టింది. కడప జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరించిన వైఎస్ 1978 నాటికి చీలిపోయిన కాంగ్రెస్‌లో కాసు బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలోని రెడ్డి కాంగ్రెస్ నాయకులు అడిగితే ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని మాట ఇచ్చారు. అప్పుడు రెడ్డి కాంగ్రెస్ కంటే ఇందిరా కాంగ్రెస్ లేదా జనతా పార్టీకి విజయావకాశాలు అధికంగా ఉన్నాయని స్పష్టంగా తెలిసినా రెడ్డి కాంగ్రెస్ ఆవు–దూడ గుర్తుతోనే పులివెందుల నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. అప్పటి నుంచి 2009 ఎన్నికల వరకూ తిరుగులేదు. 1996లో జరిగిన ఎన్నికలలో పులివెందులలో వైఎస్‌ను ఓడించేందుకు చంద్రబాబు విశ్వప్రయత్నం చేశారు. కుటుంబసభ్యులనూ, మద్దతుదారులనూ గృహనిర్బంధంలో ఉంచారు. ప్రచారం చేయనివ్వలేదు. తక్కువ మెజారిటీతో (5,445 ఓట్లు) వైఎస్ గెలుపొందారు. అంత తక్కువ మెజారిటీ తర్వాత ఎన్నడూ రాలేదు. తనకు పరిచయం ఉన్న సంజయ్‌గాంధీ విమాన ప్రమాదంలో మరణించారు. ఇందిరాగాంధీకి వైఎస్ దగ్గరౌతున్న సమయంలో ఆమెను 1984లో సిక్కు అంగరక్షకులు హత్య చేశారు. రాజీవ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న రోజులలోనే కే.ఇ. కృష్ణమూర్తిని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించమని వైఎస్ సలహా చెబితే వైఎస్‌నే ఆ పదవిలో రాజీవ్ నియమించారు. అప్పటికి వైఎస్ వయస్సు 34 ఏళ్ళు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం అనంతరం 1985లో జరిగిన ఎన్నికలలో ఎన్‌టిఆర్ ప్రభంజనాన్ని తట్టుకోవడం కాంగ్రెస్‌కు సాధ్యం కాలేదు. 1999లో వైఎస్ సారథ్యంలోనే కాంగ్రెస్ ఎన్నికల బరిలో దిగింది. కార్గిల్ యుద్ధంలో విజయం వాజపేయి ప్రాబల్యాన్ని విశేషంగా పెంచింది. అది టీడీపీకి ఉపకరించింది. పాదయాత్ర అనంతరం 2004 ఎన్నికలలో టీడీపీపైన కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. వైఎస్ సంక్షేమ రాజ్యం స్థాపించారు. 2009 ఎన్నికలలో విజయం సాధించారు. అదే సంవత్సరం సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు. అప్పటి నుంచీ ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని నివసిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో సంక్షేమ రథాన్ని రెట్టింపు వేగంతో పరుగులు పెట్టిస్తున్నారు. ధన్యజీవి.

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



### జై శ్రీరామ్



"భారత్‌లో ఏం జరుగుతోంది? జై శ్రీరామ్ అననందుకు కొందరిపై మూకదాడులు జరుగుతున్నాయి. రామాయణం చదువుతున్నందుకూ చితకబాదుతున్నారు. అలీగఢ్‌లోని దిల్షద్ అనే ముస్లిం వ్యక్తి 1979 నుంచి హిందూ గ్రంథాలను చదువుతున్నాడు. ఇప్పుడు అతడి ఇంటిపై దాడి చేసిన కొందరు అతడిని కొట్టడంతోపాటు కాల్చిపారేస్తామని హెచ్చరించారు. ఈ చర్యలు ఆమోదయోగ్యం కాదు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మతాన్ని అనుసరించే హక్కు ఉంది"

– షమా మహ్మద్, కాంగ్రెస్ నేత

### నాటకం



"కర్ణాటకలో నాటకం సుదీర్ఘంగా కొనసాగుతోంది. తిరుగుబాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గోవాలోని రిసార్ట్‌కు వెళ్లిపోయారు. దీనికి బిల్లు ఎవరు కడతారో? పార్టీ మారుతున్నందుకు ఒక్కో ఎమ్మెల్యేకి ముట్టేది ఎంతో? బసవన్న నేల ఇప్పుడు కాసుల వర్షం కురిసే నేలగా మారిపోవడం విషాదకరం"

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

### దోషులు



"సమాచార హక్కు కార్యకర్త అమిత్ జెత్వా హత్య కేసులో బీజేపీ మాజీ ఎంపీ సోలంకీని దోషిగా ప్రత్యేక సీబీఐ కోర్టు నిర్ధారించింది. సాక్షులను బెదిరించడానికి సోలంకీ తన బలాన్నంతా వినియోగించారు. కీలకమైన సాక్షులందరినీ మళ్లీ పిలిపించారు. చివరికి సోలంకీని దోషిగా తేల్చారు"

– ప్రశాంత్ భూషణ్, న్యాయమూర్తి

### రిచ్



"ధనవంతులంతా బయటకు వెళ్లిపోతూనే ఉన్నారు. 43 శాతం పన్ను అన్నప్పుడు కెనడా ఎందుకు వెళ్లకూడదు? పరిశుభ్రమైన గాలి, తక్కువ కాలుష్యం, సామాజిక భద్రత అన్నీ అక్కడ లభిస్తాయి. మన దేశంలో లభించేవి ఏమున్నాయి. గుంతలు పడిన రోడ్లు, నాసిరకం వైద్యం, కాలుష్యంతో నిండిన గాలి తప్ప"

– కరణ్ జోహార్, దర్శకుడు

### బానిసత్వం



"బడ్జెట్ ప్రసంగాన్ని సంస్కృతంలో ఎందుకు చేయలేదు? ఇంగ్లిష్‌లోనే ఎందుకు చేశారు? అతడు టై కట్టుకుని, సూటు బూటు ఎందుకు వేసుకున్నాడు? అవన్నీ పాశ్చాత్య బానిసత్వ ధోరణికి ప్రతీకలు కాదా? ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను బాహి ఖట్టాలో తీసుకురావడం పాశ్చాత్య బానిసత్వ ధోరణిని విడనాడటమేనని ముఖ్య ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ వ్యాఖ్యానించడం విడ్డూరం"

– రాకేష్ శర్మ, ఫిల్మ్ మేకర్

## ఎన్నాళ్లీ ఆంక్షలు?

తన ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తున్న అమెరికా ఆంక్షలపై వెనిజులా ప్రభుత్వం నిరసనగళమెత్తింది. ఈ విషయంలో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలంటూ ఐక్యరాజ్యసమితి మానవహక్కుల హైకమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. సమితి ఛార్టర్ ప్రకారం ఏ దేశమూ మరొక దేశంపై ఏకపక్షంగా ఈ తరహా ఆంక్షలు అమలు చేయకూడదని జెనీవాలో జరిగిన మానవ హక్కుల మండలి సమావేశంలో వెనిజులా విదేశాంగ శాఖ ఉపమంత్రి విలియం కాస్టిలో గుర్తుచేశారు. 'ఈ ఆంక్షలు మా ఆర్థిక వ్యవస్థను దిగ్బంధించాయి. విదేశీ రుణాలను తీర్చడానికి గల శక్తిసామర్థ్యాలను, విదేశాలతో వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తున్నాయి' అని తెలిపారు. ఈ ఆంక్షల పర్యవసానంగా తలెత్తిన ఆర్థిక సంక్షోభం వల్ల మానవ హక్కులకు విఘాతం కలుగుతోందని మానవ హక్కుల మండలి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని ఆయనన్నారు. అయితే వెనిజులా ప్రభుత్వం కొన్ని సరిచేసుకోవాల్సిన అంశాలున్నాయన్న అభిప్రాయంతో విభేదించారు. అమెరికా సృష్టించిన ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటూనే సామాజిక విధానాల అమలుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కాస్టిలో సమావేశానికి వివరించారు. ఎనిమిదేళ్లలో 26 లక్షలకు పైగా గృహాలు నిర్మించి కోటిమందికి మించి ప్రయోజనం అందించామని, 60 లక్షల కుటుంబాలకు నిత్యావసరాలు సరఫరా చేస్తున్నామని చెప్పారు.

## ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టిన బడ్జెట్

ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన ఆరవ బడ్జెట్ ఆయన రెండో దఫా పాలనకు అభినందనలు తెలిపిన బడ్జెట్‌గా చరిత్రలో నిలిచిపోనుంది. జవహర్‌లాల్ నెహ్రూ, మన్మోహన్ సింగ్ తర్వాత అయిదేళ్ల పూర్తి కాలం తర్వాత మరోసారి కేంద్రంలో ఎన్నికైన మూడో ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు. నూతన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తొలి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నప్పుడు ఢిల్లీలో వర్షం కురిసింది, సెన్సెక్స్ కూడా తాత్కాలికంగా కుప్పగూలింది. ఇది ఏరకంగా చూసినా విశిష్టమైన సందర్భం. అవకాశాలను విస్తరించిన సందర్భం.

నరేంద్రమోదీ రెండో దఫా పాలనలో తొలి బడ్జెట్ సందర్భంగా శుక్రవారం ఉదయం అందరి ఆశలూ ఆకాశాన్ని అధివసించాయి. తొలి దఫా పాలనలో మోదీ ఆర్థిక వ్యవస్థను చక్కగా నిర్వహించారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి భారీ సంస్కరణలతోపాటు, సులభతరమైన వాణిజ్యం, ద్రవ్యోల్బణ నియంత్రణ, ద్రవ్యలోటును తగ్గించడం, ఆర్థిక వృద్ధిరేటను 7శాతం వద్ద నిలకడగా కొనసాగించడం వంటి చర్యలు మోదీ ప్రతిష్టను మరింతగా నిలిబెట్టాయి. ఇప్పుడు ఆయన ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్లకు పెంచడంపై దృష్టిపెట్టింది. ఇది ప్రస్తుతం ఉన్న 2.7 ట్రిలియన్ డాలర్లనుంచి పెనుగంతు వేయడం లాంటిదే. ఉపాధి కల్పన, వృద్ధి, ఆర్థిక వ్యవస్థపై డేటాను స్థిరీకరించడం, ఆర్థిక వ్యవస్థను మెరుగు చేయడంలో సమస్యలు, పన్నుల తగ్గింపు, ఆదాయ పెంపు, ద్రవ్య సమతుల్యతను కొనసాగించడం వంటి భారీ సవాళ్లు ప్రస్తుత కేంద్రప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి.

ప్రైవేట్ పెట్టుబడులు ఇప్పటికీ ఒడిదుడుకులతో సాగుతుండటంతో ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చి, పబ్లిక్ పెట్టుబడి ఆధారంగా ఉద్యోగాలను కల్పించడం పెనుసవాలుగా మారుతోంది. కేంద్రప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన భారీ పథకాలు ఉజ్వల, సౌభాగ్య.. వంట గ్యాస్, విద్యుత్ సరఫరాను అవసరమైన వారికి అందించి కోట్లమంది జీవితాలను సౌకర్యవంతంగా మార్చాయి. దాదాపుగా 1.95 కోట్ల గృహాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తగినంతమేరకు ప్రయోజనాలు లభించాయి. ఇక ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకంతో రూ. 80,200 కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా 1.25 లక్షల కిలోమీటర్ల రహదారులను నిర్మించడమైంది.

గత అయిదేళ్లుగా దేశం సాధించిన ప్రయోజనాలను మరింత సంఘటితం చేయడంపై తాజా బడ్జెట్ దృష్టి సారించింది. గావ్, గరీబ్, కిసాన్, స్వదేశీలపై మరింతగా కేంద్రీకరించనున్నారు. ఆర్థిక వృద్ధి నమూనాను ప్రతిపాదించడమే కాకుండా, ప్రతిరంగంలోనూ ప్రైవేటీకరణకు, విదేశీ పెట్టుబడులను స్వాగతించడం కోసం విస్తృతంగా తలుపులు తెరవటం జరుగుతోంది. 2018–2030 మధ్యలో ఒక్క రైల్వే మౌలిక వసతుల కల్పనకే దాదాపు 50 లక్షల కోట్ల రూపాయల మదుపు అవసరముంది. కాలం చెల్లిన పవర్ ప్లాంట్లను తప్పించి మెరుగైనవాటి కల్పన కోసం అత్యున్నత స్థాయి సాధికారిక కమిటీకి సిఫార్సు చేయనున్నారు. ఉదయ్ ఇప్పటికే ఈ విషయంలో ఎంతో సహకరించింది. రానున్న సంవత్సరాల్లో ఇది మరింత వృద్ధి చెందనుంది.

పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ లీడర్లు, కార్పొరేట్ సావరిన్, వెంచర్ ఫండ్లు అనే మూడు గ్లోబల్ ప్లేయర్లను ఏకత్రాటికి తీసుకురావడానికి కేంద్రప్రభుత్వం వార్షిక గ్లోబల్ మీట్‌కు ప్లాన్ చేస్తోంది. గడచిన సంవత్సరాల్లో పెద్దగా విజయం సాధించని మేక్ ఇన్ ఇండియాకు ఈ బడ్జెట్ మరింత ప్రాధాన్యత ఇవ్వనుంది. ఇక టూరిజం, విద్య, సంస్కృతి వంటి వెనుకబడిన రంగాలపై తాజాగా దృష్టి పెట్టనున్నారు. సరళీకరణ అనంతర దశలో అభివృద్ధి చోదకశక్తులుగా గుర్తింపు పొందిన ఐటీ, విద్య, సేవారంగాలు గత అయిదేళ్లుగా మంచి పనితీరు కనబర్చలేదు. భారత్‌మాల రోడ్ కనెక్టివిటీని పెంచే ప్రాజెక్టుగా ఖ్యాతి పొందనుంది. సాగరమాల అనేది ఓడరేవులు, జలమార్గాల కనెక్టివిటీలో ఇతోధికంగా తోడ్పడనుంది. వీటితో మౌలిక వసతుల కల్పనా రంగం తిరిగి గాడిన పడుతుంది. నిర్మలా సీతారామన్ తాజా బడ్జెట్‌లో వేతనజీవులు, మధ్య ఆదాయ బృందాలు, రైతులు, యువజనులు ప్రధాన లబ్ధిదారులు అవుతున్నారు. పైగా సగటు మనిషి జేబులో మరింత డబ్బును ఉంచేందుకు ఈ బడ్జెట్ ప్రయత్నించింది. ఇది డిమాండును మరింతగా పెంచి వృద్ధికి తోడ్పడుతుంది. మొత్తంమీద నిర్మల బడ్జెట్ వాణిజ్య అనుకూల బడ్జెట్ అనే చెప్పాలి.

డాక్టర్ ఆర్ బాలశంకర్, బీజేపీ సెంట్రల్ కమిటీ మెంబర్

## సామాజిక ఉద్యమ స్ఫూర్తి 'దండోరా'

వర్తమాన సామాజిక ఉద్యమాల చరిత్రలో చెరిగిపోని అధ్యాయాన్ని లిఖించిన మాదిగ దండోరా ఉద్యమం ఉద్భవించి నేటికి పాతికేళ్లు పూర్తయింది. 1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మంద కృష్ణ మాదిగ నాయకత్వాన ఇరవైమంది యువకులతో పురుడుపోసుకున్న ఈ ఉద్యమం ఆనాటినుంచీ సామాజిక అసమానతలపై సమరం సాగిస్తూ, సమాజాన్ని సంస్కరించడం కోసం అలుపెరగని కృషి చేస్తోంది. అణగారిన కులాల ఆత్మగౌరవ పతాకగా, ప్రతీకగా పాలకులను ప్రశ్నిస్తూ ప్రజలమధ్యే నిలిచి ఉంది. సామాజిక న్యాయమంటే 'సమాన పంపిణీ'యేనని నినదించింది. జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్ల కోటాను కోరుతూ అంబేడ్కర్ వారసత్వ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నది. ఈ ఉద్యమం తరతరాలుగా అవమానాలకూ, అన్యాయాలకూ, అణచివేతలకూ, హత్యలకు, అత్యాచారాలకు గురవుతున్న జాతిని ఏకం చేసింది. జాతి మొత్తాన్ని ఒక్కతాటిపైకి తెచ్చి దాన్నొక శక్తిగా మలిచింది. నిషిద్ధాక్షరిగా మారిన 'మాదిగ' పదాన్ని శక్తిమంతమైన నినాదం చేసి జాతిలోని ప్రతి ఒక్కరూ తమ పేరు చివర చేర్చుకోవడమే నిజమైన, నిండైన ఆత్మగౌరవమని ప్రకటించింది. దౌర్జన్యానికి గురయ్యే జాతికి సమాజంలో గుర్తింపునూ, గౌరవాన్నీ, సామాజిక భద్రతనూ సాధించిపెట్టింది. వివిధ పార్టీల్లో మాదిగల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచింది. మాదిగ దండోరా ఉద్యమం ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు, అడ్డంకులు, అవమానాలు, అవరోధాలు, నిందలు, నిర్బంధాలు, కష్టాలు, కన్నీళ్లు, కుట్రలు, కుతంత్రాలు అధిగమించింది.

ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యం ఎస్సీ రిజర్వేషన్ల సామాజిక వర్గీకరణ సమస్త అణగారిన కులాల్లో సామాజిక స్పృహను రగిల్చింది. తుడుందెబ్బ, నంగారభేరి, మోకు దెబ్బ, పూసలకేక, కుర్రు, చాకిరేవు, మాలమహానాడు, ముదిరాజ్ మహాసభ తదితర కులహక్కుల సంఘాల ఆవిర్భావంలో దండోరా ఉద్యమ ప్రభావ స్ఫూర్తే ఉంది. వివిధ మాదిగ ఉపకులాల సంఘాలను బలోపేతం చేసి వాటిల్లో సైతం నాయకత్వాన్ని అభివృద్ధి చేసింది. ఉపకులాలవారికి ఆర్డీఓల ద్వారా కాక ఎమ్మార్వో ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా పోరాడి సాధించింది. ఏబీసీడీ వర్గీకరణ ఫలాల్లో ప్రథమ ఫలాన్ని మాదిగలకు కాకుండా వారికన్నా వెనకబడి ఉన్న రెల్లి ఉపకులాలకు అందించి కింది కులాలపట్ల తన బాధ్యతను ఆచరణాత్మకంగా నిర్వర్తించింది. అంబేడ్కర్ స్ఫూర్తిని నిలబెట్టింది. అంతేకాదు...సందర్భం వచ్చినప్పుడల్లా మాలల పక్షపాతిగా మాదిగ దండోరా నిలబడింది. ప్రజా గాయకుడు గద్దర్‌పై కాల్పులు జరిగినప్పుడు, సుద్దాల దేవయ్యను చంద్రబాబు అకారణంగా కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసినప్పుడు వారికి అండగా నిలబడింది. ఢిల్లీలో చందర్‌రావు అనే మాల అధికారిపై తెలంగాణ ఉద్యమ సమయంలో హరీష్‌రావు దాడిచేసినప్పుడు, గీతారెడ్డిపై కోదండరాం అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు పోరాడింది. ఉమ్మడి అభివృద్ధికి, పురోగతికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు సాధించిపెట్టింది. ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని నీరుగార్చాలని చూసినప్పుడు జాతీయ స్థాయిలో పెద్దన్న పాత్ర పోషించి ఆ కుట్రలను వమ్ము చేసింది.

తెలుగు నేలపై ఇంతటి సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఉన్నా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరగలేదనే ఆవేదన మాదిగ జాతిని వెన్నాడుతోంది. పాలకపక్షాలు మోసం చేస్తుంటే ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు మౌనం వహించడం, ఈ ఉద్యమ ప్రభావంతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మాదిగ జాతి నేతలు రాజకీయ బానిసత్వం చేస్తూ ద్రోహం చేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది. మాదిగల అస్తిత్వ ఉద్యమానికి పునాదులు వేసిన ఈదుమూడి వేదికగానే ఎంఆర్‌పీఎస్ 'మాదిగల ఆత్మగౌరవ జాతర' పేరుతో జరిగే 25 వసంతాల ఉద్యమ ప్రస్థాన వేడుకలో సమరశంఖం పూరించబోతోంది.

రాగల్ల ఉపేందర్ మాదిగ | మొబైల్: 95736 35356

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

**ఇల్లు వదిలి రచ్చ గెలిచేవాడు కళాకారుడు.
రంగస్థలాన్ని నివాసం
చేసుకునేవాడు కళాకారుడు.
పూటకొక వేషం కట్టి,
రోజుకొక ఊరు చేరి
జనాన్ని రంజింప చేసేందుకు
పరిశ్రమ చేసేవాడు కళాకారుడు.
సంపాదించినదానితో
అతడు తన కుటుంబం కోసం
ప్రేమగా కోట కట్టించవచ్చు.
కాని అతడు ఉండేది మాత్రం
జనం గుండెల్లోనే.
ఉండిపోయేది అక్కడి కోటలోనే.**



ఫోటో: శివ మల్లాల

● కోట శ్రీనివాసరావు

# గుండెల్లో కోట కట్టుకున్నా

● **ఈ నెల 10న మీ పుట్టినరోజు. నటుడిగా దాదాపు 40 ఏళ్ల కెరీర్. మీ ఏజ్ ఎంత?**

75 నిండి 76వ ఏట అడుగు పెడతాను.

● **ఆరోగ్యం ఎలా ఉంది?**

బాగుంది. కొంచెం మోకాళ్ల నొప్పులు... అంతే. వయసును బట్టి వస్తాయని డాక్టర్లు చెబుతుంటారు. ఇక మనం చేసే శ్రమని బట్టి కూడా ఉంటాయి. నడవడానికి ఇబ్బంది లేదు కానీ మెట్లెక్కేటప్పుడు, దిగేటప్పుడు కొంచెం కష్టం. వయసు పెరుగుతోంది కదా.. ఇలాంటివన్నీ సాధారణమే. లైఫ్ అంటే ఏంటి? ఎంట్రీ అయింతర్వాత ఎగ్జిట్ కూడా కామనే కదా (నవ్వుతూ).

● **750 సినిమాల వరకూ చేశారు? శరీరానికి ఎక్కువ శ్రమ ఇచ్చామనే ఆలోచన ఉందా?**

ఆ ఆలోచన ఎప్పుడూ రాలేదు కానీ శరీరానికి ఎక్కువ శ్రమ ఇచ్చానని ఇప్పుడిప్పుడు తెలుస్తోంది. ఎవరికైనా సరే 'టైమ్ వస్తే టైమ్ ఉండదు'. కనీసం భోజనం చేయడానికి కూడా టైమ్ ఉండదు. దానికి తోడు మన లైఫ్ మన చేతుల్లో ఉండదు. దాదాపు 38 ఏళ్లు రోజుకు 20 గంటలు పని చేశా. నెలకి, రెండు నెలలకోసారి భార్యాపిల్లల్ని చూసేవాడ్ని. ఫ్యామిలీ లైఫ్‌ని మిస్సయ్యాం అని ఇప్పుడు బాధగా ఉంది.

● **ఇప్పుడు సినిమాలు తగ్గించాక ఎలా ఉంది?**

నాకు పని తగ్గించుకోవాలని ఎప్పుడూ లేదు. ఇప్పుడూ ఎవరైనా కనిపిస్తే 'నాయనా ఓ వేషం ఇవ్వరా.. ఇంట్లో కూర్చొని పిచ్చెక్కిపోతోంది' అంటుంటా. ఎందుకంటే గడిచిన 40ఏళ్లల్లో రేయింబవళ్లు దాదాపు 100–150 మంది మధ్యలో జీవితం గడిపా. పొద్దునే 7 గంటలకు ముఖానికి రంగు వేసుకుంటే రాత్రి మినిమం రెండు గంటలయ్యేది. అప్పుడొచ్చి ఏదో రెండు మెతుకులు తిని పడుకుంటే పొద్దున్నే మళ్లీ 5:30 గంటలకు లేవాలి. అప్పుడన్నీ రైళ్లే కదా. ఇప్పుడైతే విమానంలో వెళ్లిపోతాం. అప్పట్లో జర్నీలోనే సగం గంటలు పోయేవి. అయినా ఎక్కువ పని చేశాననే పశ్చాత్తాపం లేదు. ఎందుకంటే ప్రజల్లో నటుడిగా నాకు మంచి గుర్తింపు ఉంది. నాకు ఆరేళ్ల కుర్రాళ్ల నుంచి 60 ఏళ్ల ముసలోళ్లవరకూ అభిమానులున్నారు. నాకు ఏ కష్టమొచ్చినా, సుఖమొచ్చినా వాళ్ల సొంత మనిషిలా భావిస్తారు. ఫ్యామిలీ లైఫ్‌ని మిస్ కావడంతో పాటు నేను కోల్పోయిన ఇంకో విషయం ప్రపంచ జ్ఞానం. బయట ఏం జరుగుతోందో తెలిసేది కాదు. ఇప్పటిలాగా ఫోన్లు, సౌకర్యాలు అప్పుడు లేవు కదా. అటు కుటుంబంతో గడపకపోవడం ఇటు బయటి ప్రపంచ జ్ఞానం తెలుసుకోకపోవడం నేను కోల్పోయాను. సినిమా రంగమే కాదు.. ఏ రంగంలోనైనా బిజీగా ఉన్నవారందరికీ అలాగే ఉంటుందనుకోండి.

● **తొలి సినిమా 'ప్రాణం ఖరీదు' చాన్స్ గురించి?**

'ప్రాణం ఖరీదు' (1978) సినిమాలో రావు గోపాలరావుగారు ప్రధాన పాత్ర. 'ప్రాణం ఖరీదు' నాటకంలో ఆ పాత్రను నేను స్టేజ్‌పై వేసేవాణ్ణి. ఆ నాటకాన్ని నిర్మాత వాసుగారు, దర్శకుడు క్రాంతి కుమార్‌గారు చూసి సినిమా తీయాలనుకున్నారు. ఆ నాటిక రాసిన సీ.ఎస్.రావుగారే సినిమాకి కూడా రచయిత. ఆయన సెంటిమెంట్‌గా చిన్న వేషం ఉంది.. చేయాలని నన్ను తీసుకెళ్లడం, ఓ చిన్న పాత్ర చేయడంతో నా సినీ ప్రయాణం మొదలైంది.

● **ఆ తర్వాత ఓ ఐదేళ్లు మీరు సినిమాలు చేయలేదేం?**

జంధ్యాలగారితో పరిచయం ఉండటం వల్ల, ఆయనెప్పుడైనా హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తుంటే సరదాగా వెళ్లి రెండు మూడు సీన్లు చేసేవాణ్ణి. అలా దాదాపు ఎనిమిది సినిమాలు చేశాను. నిజం చెబుతున్నా.. నేనెప్పుడూ సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించలేదు. నాకెప్పుడూ నాటకాల గోలే. అయితే సినిమా అవకాశం వస్తే చేయకుండా ఎవరూ ఉండరు కదా? కానీ, చాన్స్‌ల కోసం ప్రయత్నించలేదు. ఎందుకంటే అప్పుడు సినిమా యాక్టర్ అంటే ఒడ్డూ పొడుగు ఉండాలి, ఎర్రగా, అందంగా ఉండాలనుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. అప్పుడు నేను బాగా నల్లగా ఉండేవాణ్ణి. అవకాశం అడిగితే, 'నీ మొహం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావేంట్రా?' అంటారేమో అని భయం. పైగా స్టేట్‌బ్యాంకులో మంచి ఉద్యోగం ఉంది. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎందుకు రిస్క్ తీసుకోవడం అనే భయం ఉండేది. ఆ తర్వాత అనుకోకుండా సినిమాల్లోకి వచ్చాను, ఆ జర్నీ ఇంతదాకా వచ్చింది.

● **నటుడిగా 'ప్రతిఘటన' మీ కెరీర్‌కి మంచి టర్నింగ్ పాయింట్ అయింది కదా?**

అవును. ఆ సినిమా 1985లో విడుదలైంది. ఆ రాత్రికి రాత్రి స్టార్ అయిపోయాను. అప్పుడు మా బ్యాంక్ హైదరాబాద్‌లోని నారాయణగూడ బ్రాంచ్‌లో ఉండేది. బయటకు వస్తే జనం గోల. నన్ను చూడ్డానికి ఉత్సాహంగా వచ్చేవారు. దాంతో మా బ్రాంచ్ మ్యానేజర్ ఇలా ముందు గదిలో వద్దు... లోపల కూర్చోండి అన్నారు.

● **మరి.. ఉద్యోగం ఎప్పుడు మానేశారు?**

సినిమాల్లో యాక్ట్ చేయడానికి మా బ్యాంక్ వాళ్లు పర్మిషన్ ఇవ్వలేదు. అప్పుడు చాలా రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ఉండేవి. 'ప్రతిఘటన' తర్వాత చాన్సులు వచ్చినా సర్వీస్‌లో ఎన్ని సెలవులుంటాయో అవే వాడుకోవాలి. అయితే నటుడిగా బాగా క్రేజ్ రావడంతో ఐదువేలు, పదివేలు.. ఇలా నిర్మాతలు అడ్వాన్సులు ఇచ్చారు. ఇండస్ట్రీలో టైమ్ వస్తే టైమ్ ఉండదు. ఇక, 86 ఎండింగ్‌లో రిజైన్ లెటర్ ఇచ్చాను. అసలు అంతకుముందే ఫలానా డేట్‌లో చేరాలి. లేకపోతే ఈ ఉద్యోగం మీద మీకు ఆసక్తి లేదని అనుకుంటాం అని ఫైనల్ లెటర్ పంపారు. అది నా చేతికి వచ్చేసరికి ఆ డేట్ దాటి 7–8 రోజులు అయిపోయింది. బెంగుళూరులో ఎక్కడో ఉన్నాను. ఉద్యోగం పోయింది.

● **సీరియస్ విలన్, కామెడీ విలన్, కమెడియన్, సపోర్టింగ్ ఆర్టిస్ట్, స్త్రీ పాత్రలు కూడా చేశారు. బాగా హోమ్‌వర్క్ చేసేవారా?**

గొప్ప విశేషం ఏంటంటే.. నేను చేసిన ఏ పాత్ర కూడా నాకు ముందు చెప్పింది కాదు. షూటింగ్ స్పాట్‌కి వెళ్లినప్పుడు 'మీ పాత్ర ఇది' అని డైరెక్టర్ చెప్పేవారు. ముందు చెప్పడం , హోమ్ వర్క్ చేయడం లాంటివి ఏమీ లేదు. ఒకవేళ ఏదైనా ప్రత్యేకమైన గెటప్ అనుకోండి.. అంటే బట్టతల, బోడిగుండు.. వంటి వాటికి మాత్రం ముందు వర్క్ చేసేవాళ్లు. ఇలా చేయాలనుకుంటున్నాం చేతిలో ఉన్న సినిమాలకు ఏమైనా ఇబ్బంది అవుతుందా? అని అడిగేవారు. నేను బాగా నమ్మేది.. అందరికీ చెప్పేది కూడా ఒక్కటే. మనకు పెద్ద గుమ్మడి కాయ అంత ప్రతిభ ఉంటే సరిపోదు. చిన్న ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. ఆ రెండూ ఉన్నవాడే కోట శ్రీనివాసరావు.

● **మీరెక్కువగా నెగటివ్ రోల్స్ చేశారు. పాత్రతాలూకు ప్రభావం ఆర్టిస్టుల మీద పడుతుందా? మీరు కొంచెం కటువుగా, ముక్కుసూటితనంగా మాట్లాడినట్లు అనిపిస్తుంది?**

ఏమో.. ఆ ప్రభావం ఉందేమో. ఎప్పుడైనా అరవడం, టక్కున తిట్టడం వంటివి చేశానేమో? ఏదైనా సహించలేనిది జరిగినప్పుడే అలా రియాక్ట్ అయ్యుంటాను తప్ప కారణం లేకుండా ఎవర్నీ ఏమీ అనలేదు. నాకు ముక్కుసూటిగా మాట్లాడటమే వచ్చు. వెనక మాట్లాడటం కన్నా ముఖం మీద అనడం కరెక్ట్ అనుకుంటాను.

● **దానివల్ల మిమ్మల్ని నిందించేవారు ఎక్కువ ఉంటారేమో?**

ఉండొచ్చేమో. నాలుగు మంచి మాటలు చెప్పాలనుకున్నప్పుడు నిందల గురించి పట్టించుకోకూడదు. ఇప్పుడున్నవాళ్ల పరిస్థితి ఎలా ఉందంటే సాధన తక్కువ వాదన ఎక్కువ. టెక్నాలజీ పెరుగుతోంది. పెరగాలి కూడా. దాంతో ఇవాళ వయసుకి మించిన విజ్ఞానం అయిపోయింది. అది పెద్ద ప్రమాదం. వయసుతో పాటే తెలివి కూడా పెరగాలి. మనకు 'ఏ వయసులో జరగాల్సినది ఆ వయసులో జరగాలి' అనే సామెత ఉంది. మన చదువును కూడా మన జీవితంతో జోడించి సృష్టించారు. జీవితంలో నాలుగు స్టేజీలు. బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం. చదువు కూడా ఎలిమెంటరీ, హై స్కూల్, కాలేజ్, యూనివర్శిటీ. ఈ నాలుగింటినీ జీవితంతో లింక్ చేశారు. ఓ పాతిక మంది పిల్లల్ని ఒకేచోట ఓ గంటసేపు కూర్చోబెట్టడం కష్టం. అది ఎలిమెంటరీ స్కూల్. ఆ తర్వాత హైస్కూల్. పద్యాలు నేర్పుతారు. పదోతరగతి రాయాలంటే 16 ఏళ్లు కంపల్సరీగా ఉండాలి. అప్పుడు అంతకుముందు క్లాసుల్లో చెప్పిన పద్యాలకు తాత్పర్యం చెబుతారు. అప్పుడు అర్థం చేసుకోవడం అలవడుతుంది. కాలేజీలు ఇప్పటిలాగా గల్లీగల్లీకి లేవు. డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్‌లో మాత్రమే ఉండేవి. వేరే ఊరు వెళ్లి చదవాలి. అప్పుడు నీకు ఎవరూ తోడు రారు. సొంతంగా నేర్చుకోవాలి. జాగ్రత్తగా ఉండాలి అని చెప్పి పంపేవారు. లైఫ్‌ని డీల్ చేయడం అలవాటు అవుతుంది. మన జీవితాలతో లింక్ చేసిన చదువుని విస్మరించేశాం. కార్పొరేట్ స్కూల్‌లో చేరతారు. 3 లక్షలు అంటారు. అంతా అంటే? ఫారిన్ నుంచి వచ్చారు టీచర్లు అంటారు. పీజీ వాడు కేజీకి చెప్పాలి. పీజీ వాడు కేజీకి దిగలేడు, కేజీ వాడు పీజీకి ఎదగలేడు. మరి వీళ్లు చెప్పేది ఎవరికి చెప్పండి?

● **మాతృభాషను ఖూనీ చేయడం, పెద్దలను ఎదిరించడం.. ఇలా ఇప్పటి తరంలో ఎక్కువ శాతం మంది ఉన్నారు.. దాని మీద మీ అభిప్రాయం?**

బిడ్డ ఎదుగుదలకు మాతృ స్తన్యం ఎంత అవసరమో... పిల్లాడి మానసిక ఎదుగుదలకు మాతృభాష అంతే అవసరం. పుట్టిన బిడ్డకు అన్ని 'ఇంగ్స్' నేర్పేది తల్లే. టాకింగ్, వాకింగ్, ఈటింగ్, రీడింగ్, రైటింగ్.. ఇలా అన్నీ నేర్పుతుంది. తల్లిలో అంత ఇది ఉంది. పై చదువులు, పెద్ద పెద్ద ఉద్యోగాలు అంటూ ఫారిన్ పోవడం, అక్కడే స్థిరపడిపోవడం, తల్లిదండ్రులను ఇక్కడే వదిలేయడం. అప్పట్లో పిల్లలకు క్రమశిక్షణ ఉండేది. 'మీ అబ్బాయి సిగిరెట్ తాగుతున్నాడు' అని ఎవరైనా ఇంట్లో చెబితే ఇంటికి వెళ్లిన తర్వాత మన పరిస్థితి ఏంటి? కొడితే చర్మం ఊడిపోయేది. అదే ఇప్పటి పిల్లలైతే 'ఏం నువ్వు తాగడంలేదా?' అని తండ్రిని నిలదీస్తారు. అయితే పెద్దవాళ్ల ఉద్దేశం ఏంటంటే 'నీ వయసు ఏంటి? నువ్వు చేసే పనేంటి' అని. ఇప్పుడు పాఠం చెప్పే సమయంలో సరిగ్గా వినడం లేదనో, సరిగ్గా చదవడం లేదనో టీచర్ ఓ దెబ్బ వేస్తారు. దాన్ని కొట్టడం అనుకుంటే ఎలా? కొందరు డాక్టర్లు పిల్లల్ని కొడితే వాళ్ల తెలివితేటలు పోతాయి అంటారు. అదో బిజినెస్. ఆ విషయం గురించి పెద్ద చర్చ. వీటికి చర్చ ఎందుకు?

● **కోటగారు నీతులు చెబుతున్నారు? అని ఎవరైనా అంటే?**

ఈ మాట డైరెక్ట్‌గా నాతో ఒకరు అన్నారు. నాది మార్పు రావాలని చెప్పే వయసు. ఈ మధ్య కోటగారు నీతులు చెబుతున్నారు అని ఎవరో అంటే... నాకు చెడు ఎక్కువగా తెలుసయ్యా... అందుకే మంచి గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాను అన్నాను. మరి.. తెలియనివాడు ఏం మాట్లాడతాడు? ఏదో నా అనుభవంతో నలుగురికీ ఉపయోగపడే నాలుగు మంచి మాటలు చెప్పాలనిపించింది. చెప్పాను. అయితే ఎవరినీ బాధపెట్టాలన్నది నా ఉద్దేశం కాదు.

● **ఫైనల్లీ... ఇంతకు ముందున్నంత ఉత్సాహంగా సినిమాలు చేయగలరా?**

చేయలేను అనుకోవడం తప్పు. దర్శకులకు కావాల్సింది వారికి ఇవ్వడమే కదా. అయితే 'బాబూ కాస్త మెట్లు ఎక్కలేను. దిగలేను. ఆలోచించి వేషం ఇవ్వండి' అంటాను. అలా చెబితే తప్పేంటి? నాకున్న అనుభవానికి, నాకున్న వయసుకి చెప్పాలి కూడా. ఎందుకంటే షూటింగ్ లొకేషన్‌కి వెళ్లాక 'చేయలేను' అన్నాననుకోండి.. ఈ కుర్రాళ్లు ఒక మాట అంటే సిగ్గుగా ఉంటుంది. నేను మాట పడలేను.

– డి.జి. భవాని

● **రంగస్థలం నుంచి సినిమాలకు వచ్చారు... ఇప్పుడు నాటక రంగం కనుమరుగవడం గురించి?**

నాటకం వల్ల మనకో కాన్ఫిడెన్స్ వస్తుంది. డిక్షన్ అన్నీ తెలుస్తాయి. ఎక్కడ కామా ఉండాలి ఫుల్‌స్టాప్ పెట్టాలో తెలుస్తుంది. అది ఎప్పుడు ఉపయోగపడుతుందంటే సినిమాలో పెద్ద పెద్ద వాళ్లతో యాక్ట్ చేసే సమయంలో బెరుకు ఉండదు. నేను అమితాబ్‌గారితో యాక్ట్ చేశాను. అమితాబ్ అంటే ప్రపంచంలో గుర్తింపబడ్డ నటుడు. అతనితో నటించేటప్పుడు ఎలా ఉంటుంది? అదేమీ లేకుండా నేను చేయగలిగానంటే అది నాకు నాటకాల వల్ల వచ్చింది. ఇప్పుడు నాటకాలు వేస్తే ఎవరు చూస్తారు? అంటున్నారు. ఓ పది మంది కలిసి నాటకం వేసి, చూపించండి. మీకూ (నటీనటులు) ప్రాక్టీస్ అవుతుంది.

● **మీ నాన్నగారు మిమ్మల్ని డాక్టర్ చేయాలనుకున్నారట?**

మేం ముగ్గురు అన్నదమ్ములం. అన్నయ్య, నేను, తమ్ముడు శంకర్రావు. అన్నయ్యను డాక్టర్ చేయాలనుకున్నారు. శంకర్రావు కూడా మంచి నటుడే. సినిమాలు, సీరియల్స్ చేస్తున్నాడు. నాకు చదువుపై ఆసక్తి లేదని అన్నయ్యగారు నాన్నగారికి చెప్పారు. 'ఏం డాక్టరుగారూ.. మీ తర్వాత మీ అబ్బాయిలు ఎవరూ లేరా?' అనే ఊళ్లో అడిగేవారు. అందుకని డాక్టర్ చదివించాలనుకున్నారు. మెడికల్ సీటు కోసం ఏడాది పాటు బాగా ట్రై చేశాను. అప్పుడప్పుడే డొనేషన్ పద్ధతి ప్రారంభమైంది. నాకు ఫస్ట్‌క్లాస్‌కి కెమిస్ట్రీలో ఒక శాతం తక్కువ వచ్చింది. మద్రాసు వెళ్లాను. మాకు తెలిసిన డాక్టరుగారు వైద్యసీటు కోసం ప్రయత్నించగా డొనేషన్ పద్ధతిలో ఇస్తామన్నారు. అప్పుడు ఐదు వేలు కడితే చాలు. అయితే నువ్వు ప్రపంచంలో ఎక్కడైనా చదువు.. చదివిస్తాను కానీ డొనేషన్ మాత్రం కట్టను అన్నారు నాన్నగారు. దాంతో సీటుకోసం ఓ ఏడాది వృథా చేశాను. ఏదీ కుదరక బీఎస్సీలో చేరాను.



● తల్లిదండ్రులు కోట సీతారామాంజనేయులు విశాలాక్షి

● **మొదటి నుంచి మీది బాగా ఉన్న కుటుంబమేనా?**

మా నాన్నగారు డాక్టర్ అని చెప్పాను కదా. ఆయన ప్రాక్టీస్ చాలా బాగుండేది. ఆ రోజుల్లోనే రోజుకు 200 -300 మంది రోగులు వచ్చేవారు. మా నాన్నగారి గురించి గొప్పగా చెప్పటం కాదు కానీ, రోగులు డబ్బు లిస్తుంటే తన చేత్తో తీసుకునేవారు కాదు.. ఈ రోజు కలెక్షన్ ఇది అని కాంపౌండర్ ఇచ్చేవారు. ఆ రోజుల్లో నాన్నగారు రెండు నెలలకోసారి 100, 115 రూపాయలు ఆంధ్రాబ్యాంకులో డిపాజిట్ చేసేవారు. 74 ఏళ్ల క్రితం 100 రూపాయలంటే చాలా ఎక్కువ. త్వరగానే ఇల్లు కట్టుకున్నాం. మా తల్లిదండ్రులకు మేం 12 మంది సంతానం.. ముగ్గురు అబ్బాయిలు, 9 మంది అమ్మాయిలు. ఇప్పుడు ఏడుగురు ఉన్నాం.






## మంచి విషయం

# బతుకు నుంచి బడికి

**సెంట్రల్ జైల్లో ఉన్న ఒక పాపను జిల్లా కలెక్టర్ స్కూల్లో చేర్పించగానే ఆ స్ఫూర్తితో మరో పది హేడు మంది చిన్నారుల్ని తమ స్కూల్లో చేర్చుకుని ఉచిత విద్య, వసతి ఇచ్చేందుకు స్కూళ్ల యాజమాన్యాలు ముందుకు వచ్చాయి!**

సంజయ్ కుమార్ అలాంగ్.. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లా కలెక్టర్. ఏటా ఆయన బిలాస్‌పూర్‌లోని సెంట్రల్ జైల్ తీరుతెన్నుల్ని పర్యవేక్షించేందుకు వెళుతుంటారు. వెళ్లి, ఖైదీల బాగోగులను, వారి వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకుంటారు. వారికేమైనా సమస్యలున్నాయేమో కనుక్కుంటారు. పోలీసు అధికారులు జైలును సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని కూడా ఖైదీలను అడుగుతారు!

### తల్లి చనిపోయింది.. తండ్రి జైలుపాలు!

సంజయ్ కుమార్ ఈ ఏడాది కూడా బిలాస్‌పూర్ సెంట్రల్ జైలుకు వెళ్లారు. అలా వెళ్లినప్పుడు మహిళా వార్డులో కొందరు ఖైదీల మధ్యన కూర్చొని ఒక బాలిక కనిపించింది! ఆ బాలిక పేరు ఖుషీ. ఐదేళ్లుగా జైల్లో ఉంటోంది. అయిదేళ్లుగా అంటే.. దాదాపుగా ఆమె పుట్టినప్పటి నుంచీ! తండ్రి ఏదో నేరం చేసి, ఐదేళ్ల క్రితం జైలు పాలు అయినప్పట్నుంచీ ఖుషీ కూడా అదే జైల్లో ఉంటోంది. ఖుషీ తల్లి ఖుషీ 15 రోజుల బిడ్డగా ఉన్నప్పుడే పచ్చకామెర్లతో చనిపోయింది. ఈ వివరాలన్నీ కలెక్టర్‌కు చెప్పారు జైలు అధికారులు. అప్పటికి ఆయన వెళ్లిపోయారు. ఆ తర్వాత ఖుషీ జీవితం ఒక్కసారిగా మలుపు తిరిగింది. ఆమెను ఇంటర్నేషనల్ స్కూల్లో చేర్పించారు కలెక్టర్ సంజయ్ కుమార్. నిజానికి అది కలెక్టర్ విధులలో భాగం కాదు. అంతరాత్మ ప్రబోధానుసారం ఆయన ఆ బాధ్యతను స్వీకరించారు.



● సంజయ్ కుమార్ అలాంగ్

● ఖుషీని స్కూలుకు తీసుకెళుతున్న కలెక్టర్ సంజయ్ కుమార్, పోలీసు అధికారి

ఖుషీ అనేది అసలు పేరు కాదు. చట్ట ప్రకారం ఆమె అసలు పేరును వెల్లడించడానికి లేదు. అలాగే ఆమె ఫొటోను పత్రికల్లో చూపించడానికి లేదు. ఈ జాగ్రత్తలన్నీ కలెక్టర్ తీసుకున్నారు. మొదటి రోజు తనే స్వయంగా ఖుషీని స్కూలుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఖుషీ ప్రమేయం లేకుండా ఖుషీ జీవితం ఎలా జైలు వైపు అడుగులు వేసిందో, అలాగే ఖుషీ ప్రమేయం లేకుండా ఖుషీ అంతర్జాతీయ పాఠశాల వైపు నడిచింది. జైలు నిబంధనల ప్రకారం మహిళా ఖైదీల మైనర్ పిల్లల్ని ఇంట్లో చూసేవాళ్లెవరూ లేనప్పుడు, మరీ చిన్నవారిగా ఉన్నప్పుడు తల్లితో పాటే జైల్లో ఉంచుతారు. ఒకవేళ తల్లి లేని పిల్లలు అయి ఉండి, తండ్రి నేరం చేసి జైలుకు వెళితే అదే జైల్లో మహిళా ఖైదీలతో పాటు పిల్లల్ని ఉంచి, ఆరేళ్ల వయసు వచ్చాక బంధువులకు గానీ, బంధువులు కూడా లేకుంటే ప్రభుత్వ సంరక్షణ గృహాలకు గానీ తరలిస్తారు. ఆ తర్వాత వాళ్లే స్కూల్లో చేర్పిస్తారు.

### స్కూల్లో తొలి రోజు.. ఖుషీ మర్చిపోలేదు

ఖుషీని స్కూల్లో చేర్పించాలన్న ఆలోచన వచ్చిన వెంటనే కలెక్టర్ సంజయ్ కుమార్.. ''పెద్దయ్యాక నువ్వేం అవాలని అనుకుంటున్నావు'' అని అడిగారు. ''పెద్ద స్కూల్లో చదవాలని ఉంది'' అని చెప్పింది ఖుషీ. వెంటనే ఆ చుట్టుపక్కల ఉన్న పెద్దస్కూళ్లకు సమాచారం పంపించారు. 'ఇలా ఒక చిన్నారి జైల్లో ఉంది. ఆమెకు అడ్మిషన్ కావాలి' అని అడిగించారు. జైన్ ఇంటర్నేషనల్ స్కూలు ముందుకు వచ్చింది. ఉచితంగా చదువు చెప్పడం మాత్రమే కాక, ఆమె ఇంటర్ పూర్తి చేసేవరకు ఉచితవసతి కల్పిస్తామని తెలిపింది. వెనువెంటనే అడ్మిషన్ ప్రాసెస్ అంతా చకచకా జరిగిపోయింది. ''తాము చేయని తప్పుకు అన్యాయంగా జైల్లో ఉంటున్న పిల్లల్ని చదివించనన్నా చదివించాలి లేదా వారికోసం మంచి యాక్టివిటీస్‌ని అయినా రూపొందించాలి. అలా కాలానికి వదిలిపెట్టడం సరికాదు'' అని సంజయ్ అంటారు.

స్కూల్లో మొదటిరోజు ఖుషీకి అనూహ్యమైన ఆదరణ లభించింది. ఎవరో చీఫ్ గెస్ట్ వస్తున్నట్లుగానే ప్రిన్సిపాల్ సహా సిబ్బంది అంతా స్వాగతం పలికారు. ఆ అపురూపమైన సందర్భం ఖుషీకి బహుశా జీవితాంతం గుర్తుండి పోతుంది. ఖుషీని ఆయన స్కూల్లో చేర్చగానే, ఆ విషయానికి ప్రాధాన్యం లభించి, సెంట్రల్ జైల్లో ఉన్న మరో పదిహేడు మంది చిన్నారులను స్కూల్లో చేర్పించడం కోసం ఎన్జీవో సంఘాలు దరఖాస్తు పెట్టుకున్నాయి! సంజయ్ కుమార్ ఇచ్చిన ఇన్‌స్పిరేషన్ అది.

బాల్యం తిరిగి రానిది. తిరిగిరాని ఆ బాల్యాన్ని జైల్లో ఉంచి స్వేచ్ఛ లేకుండా చేయడంపై ఇండియాలో ఏళ్లుగా చర్చ నడుస్తోంది. దానికొక ముగింపు రావడం లేదు. అమ్మగానీ, నాన్న గానీ, అమ్మానాన్న గానీ జైల్లో ఉన్నప్పుడు బయటెవరూ లేని పిల్లల్ని జైల్లో ఉంచితే భద్రంగా ఉంటారు కదా అనే వాదన కూడా ఉంది. భద్రత ఉంటే సరిపోయిందా? భవిష్యత్తు ఉండొద్దా? ఆరేళ్లకే ఏం భవిష్యత్తు ఏర్పడుతుంది అనే వాళ్లు ఉన్నారు. ఆరేళ్లకు భవిష్యత్ ఏర్పడకపోవచ్చు. అరవైఏళ్ల భవిష్యత్తు ఈ ఆరేళ్ల మీదే కదా ఆధారపడి ఉండేది. ఇప్పుడే కదా ఆలోచనలు వికసించేది. ఇప్పుడే కదా ఆశలు చిగురించేది. ఇప్పుడే కదా జ్ఞాపకాలు స్థిరపడిపోయేది.

## ఇంటిప్స్

- పండ్లను కోశాక ముక్కలు నల్లబడకుండా వుండాలంటే, ముక్కలపై ఉప్పు కలిపిన నీళ్లు చల్లి తడిబట్టతో కప్పాలి.
- ఖీర్ మిగిలిపోతే మళ్ళీ వేడి చేయకూడదు. దాన్నలాగే కుల్ఫీకప్స్‌లో పోసి ఫ్రిజ్‌లో పెట్టి, గడ్డకట్టాక పిల్లలకివ్వవచ్చు.
- బంగాళాదుంప, చిలగడదుంప మొలకలు పెరిగితే, వాటిని ముక్కలుగా కోసి కుండీలలో పెంచొచ్చు. ఇండోర్ ప్లాంట్స్‌గా ఇంటి అందాన్ని పెంచుతాయి.
- అల్లం వెల్లుల్లి పేస్ట్ ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే, గ్రైండ్ చేసేప్పుడు ఒక స్పూన్ నూనె కలపాలి.



- ఇనుప సామాను తుప్పుపట్టకుండా ఉండడానికి వాటి మధ్య కర్పూరం బిళ్ళలు ఉంచాలి.
- కొత్తిమీర, కరివేపాకు, పుదీన వంటి ఆకుకూరలు పేపర్‌లో చుట్టి పాలిథిన్ కవర్‌లో వుంచితే ఎక్కువకాలం నిలవ వుంటాయి.
- కిరోసిన్‌లో ముంచిన బట్టతో కిటికీలు, తలుపులు తుడిస్తే తుప్పు మరకలు పోతాయి. ఆ వాసనకు దోమలు కీటకాలు ఇంట్లోకి రావు.

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ ఆదివారం
7-7-2019

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**పల్లవి :**

అరెరే వాన జడివాన
అందాల నవ్వులే పూల వాన
॥అరెరే॥
మళ్లీమళ్లీ వానొస్తే మనసు
గొడుగు చెలి పడితే
గారం పెరిగింది దూరం తరిగింది
ఏమైంది ఏమైంది ఏదేదో జరిగింది
నెమలికన్నులాగ చెలి నాట్యమాడుతుంటే
ఎదే పాలపుంతై నా మనసు నాడమంది
ఏమైంది ఏమైంది ఏదేదో జరిగింది
॥అరెరే॥

**చరణం : 1**

ఆటా పాటా ఓ పాడని పాట
వానే పాడింది అరుదైన పాట
నిన్ను నన్ను కలిపిన
ఈ వానకొక్క సలామ్ కొట్టు
నేను తప్పిపోయాను నీలోన వెతికి పెట్టు
మంత్రంలాగ ఉంది ఇది తంత్రంలాగ ఉంది
చిత్రంగానే మదిలో
ఒక యుద్ధం జరుగుతోంది
దేవత ఏది నా దేవత ఏది
తను సంతోషంగా ఆడుతూ ఉంది

**చరణం : 2**

నిన్ను మించి వేరెవరూ లేరే
నన్ను మించి నీకెవరూ లేరే
చిన్ని చిన్ని కళ్ళు రెండు
దేవుడు నాకు ఇచ్చాడంట
కళ్లు రెండు మూసుకున్న
నీవున్నదె మాయమట
మల్లెపూల పొద్దు నాకు ఇచ్చి పోవే ముద్దు
ముద్దుచాటు సద్దు చెరిపేయమంది హద్దు
పులకించింది ఎద పులకించింది
చెలి అందాలనే చిలికించింది
॥అరెరే॥

చిత్రం : ఆవారా (2010)
రచన : వెన్నెలకంటి
సంగీతం : యువన్‌శంకర్‌రాజా
గానం : రాహుల్ నంబియార్, సైంధవి

కట్‌చేయ్...దాచేయ్...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | | | | 1 | 9 | 2 | 3 | 6 |
| | | | | 4 | | | 9 | |
| 2 | | | 5 | | | 1 | | |
| | | 8 | 4 | 9 | | | | |
| 4 | 9 | 2 | 6 | | 8 | 5 | 7 | 1 |
| | | | | 2 | 1 | 4 | | |
| | | 7 | | | 4 | | | 3 |
| | 2 | | | 6 | | | | |
| 3 | 5 | 6 | 2 | 8 | | | | 4 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 8 | 1 | 3 | 6 | 7 | 9 | 5 | 4 |
| 5 | 3 | 6 | 9 | 4 | 8 | 7 | 2 | 1 |
| 9 | 7 | 4 | 2 | 5 | 1 | 3 | 6 | 8 |
| 6 | 9 | 7 | 1 | 8 | 5 | 2 | 4 | 3 |
| 1 | 4 | 5 | 7 | 2 | 3 | 6 | 8 | 9 |
| 3 | 2 | 8 | 4 | 9 | 6 | 5 | 1 | 7 |
| 7 | 6 | 9 | 5 | 1 | 4 | 8 | 3 | 2 |
| 4 | 5 | 3 | 8 | 7 | 2 | 1 | 9 | 6 |
| 8 | 1 | 2 | 6 | 3 | 9 | 4 | 7 | 5 |

## బ్రేక్ వస్తుందనుకుంటున్నాం

''రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే రివెంజ్ స్టోరీ 'బైలంపుడి'. తమకు జరిగిన అన్యాయాన్ని తెలివిగా ఎలా తిప్పికొట్టారు? అనే కథాంశం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది'' అని బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఆయన నటించి, నిర్మించిన చిత్రం 'బైలంపుడి'. హరీశ్ వినయ్, తనిష్క్ రాజన్ హీరోహీరోయిన్లుగా నటించారు. అనిల్ పీజే



● బ్రహ్మానందరెడ్డి

రాజ్ దర్శకుడు. ఈ చిత్రం ప్రీ-రిలీజ్ ఫంక్షన్ ఈ నెల 13న జరగనుంది. ఈ సినిమా గురించి బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ – ''యాక్టింగ్ మీద ఆసక్తితో కొన్ని వెబ్‌సిరీస్‌లు, డెమో సినిమాల్లో నటించాను. ఈ సినిమాలో నటించిన యాక్టర్స్ అందరూ కొత్తవారే. అందరం బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నాం. త్వరలోనే రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం. నెక్ట్స్ మరో సినిమాలో నటిస్తూ, నిర్మిస్తున్నాను'' అన్నారు.



సందడి సందడిగా షూటింగ్‌లో పాల్గొంటూ షాట్ గ్యాప్‌లో చిల్ అవుతుంటారు నటీనటులు. సరదాగా సెల్ఫీకు ఫోజులిస్తుంటారు కూడా. అలాంటిదే ఇది. 'వెంకీ మామ' షూటింగ్ గ్యాప్‌లో నాగచైతన్యతో రాశీఖన్నా క్లిక్ చేసిన సెల్ఫీ ఇది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. వెంకటేశ్, నాగ చైతన్య హీరోలుగా కేయస్ రవీందర్ (బాబీ) తెరకెక్కిస్తున్నారు. పాయల్ రాజ్‌పుత్, రాశీ ఖన్నా హీరోయిన్లు.

# అసంపూర్ణమైన సంపూర్ణం

''సినిమా స్టార్స్‌ని చూసి అలానే ఉండాలనే ఆలోచనను సమాజం ఏర్పరచుకుంది. దీని ద్వారా చాలా మంది అనవసరమైన ఒత్తిడిని కొనితెచ్చుకుంటున్నారు. ఈ ఆలోచనా ధోరణిని బద్దలు కొట్టాలనుకున్నారు. ఈ విషయాల గురించి తన అభిప్రాయాలను పంచుకుంటూ – ''బాడీ షేమింగ్ ఎదుర్కొన్నవాళ్ల కోసమే అండర్ వాటర్ ఫొటోషూట్ చేసుకున్నాను. ఇంతకు ముందు బికినీ ధరించాలంటే


● సమీరా రెడ్డి



ఎంతో ఆలోచించేదాన్ని. ఎన్నో ఆలోచనలు. కానీ తొమ్మిదో నెల ప్రెగ్నెంట్‌గా ఉంటూనే బికినీలో ఎంత కంఫర్టబుల్‌గా ఉన్నానో చెప్పలేను. మొదటిసారి గర్భవతిని అయినప్పుడు నా వంతు ట్రోలింగ్ (విమర్శలు) ఎదుర్కొన్నాను. 'ప్రెగ్నెంట్ అయినప్పుడు సమీర బరువు పెరిగింది. గ్లామర్ తగ్గింది' అనే కామెంట్స్ విన్నాను. కానీ ఈసారి దాన్ని పట్టించుకోదలుచుకోలేదు. వాటిని తిప్పికొట్టి కాన్ఫిడెంట్‌గా ఉండాలనుకున్నాను. మన శరీరాన్ని మనమే అంగీకరించకపోతే ఎలా? అన్ని వయసుల ఆడవాళ్లకు చెప్పేది ఏంటంటే.. మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీ శరీర తత్వాన్ని అర్థం చేసుకొని, అంగీకరించండి'' అన్నారు.

కుంటున్నాను'' అన్నారు సమీరా రెడ్డి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆమె విమర్శలు ఎదుర్కొంటున్నారు. దానికి కారణం ఈత కొలనులో ఫొటోషూట్ చేయించుకోవడమే. గర్భంతో ఉండి, ఇలా పొట్ట కనిపించేట్లు ఫొటోలు దిగుతారా? అని కొందరు సమీరాను విమర్శిస్తున్నారు. ఈ విమర్శలకు సమీరా సమాధానం ఇచ్చారు. 'అసంపూర్ణమైన సంపూర్ణం' అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో తన ఆలోచనలను పంచుకున్నారామె. రెండోసారి తల్లి కాబోతున్న సమీరా రెడ్డి బాడీ పాజిటివిటీ, మనల్ని మనం ప్రేమించుకోగలగడం, మూస ధోరణి ఆలోచనల గురించి అవగాహన కలిగించాల

# శ్రీనివాస్‌రెడ్డితో మరో సినిమా తీస్తా

– శ్రీనివాస్ కానూరు


● శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ కానూరు

కథానాయిక ఈషా రెబ్బా ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'రాగల 24 గంటల్లో'. సత్యదేవ్ హీరోగా నటించారు. శ్రీనివాస్‌రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీ నవ్‌హాస్ క్రియేషన్స్ పతాకంపై శ్రీ కార్తికేయ సెల్యులాయిడ్స్ సమర్పణలో శ్రీనివాస్ కానూరు ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ– ''స్వతహాగా వ్యాపారవేత్తను అయిన నేను సినిమా నిర్మాణం ఎంత కష్టమో, ఎంత కష్టపడతారో కళ్లారా చూశాను. నిర్మాతగా నా తొలి సినిమాని శ్రీనివాస్ రెడ్డి దర్శకత్వంలో నిర్మించడం సంతోషంగా ఉంది. అనుకున్న బడ్జెట్‌లో సినిమాను పూర్తి చేశాం. సెప్టెంబర్ 5న ఈ సినిమాను విడుదల చేయనున్నాం. నా నెక్ట్స్ సినిమా కూడా శ్రీనివాస్ రెడ్డి దర్శకత్వంలోనే ఉంటుంది'' అని అన్నారు. ''కొంత గ్యాప్ తర్వాత మంచి కంటెంట్ ఉన్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నా. స్క్రీన్‌ప్లే బేస్డ్‌గా సాగే అద్భుతమైన థ్రిల్లర్ మూవీ ఇది. ఈ సినిమా తర్వాత ఈషా రెబ్బా పెద్ద హీరోయిన్ల జాబితాలోకి వెళుతుంది. సత్యదేవ్ హీరోగా బిజీ అవుతారు. హాస్యనటుడు కృష్ణభగవాన్ ఈ సినిమాకు మాటలు రాయడం అదనపు ఆకర్షణ'' అని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముస్కాన్ సేథీ, గణేష్ వెంకట్రామన్, కృష్ణభగవాన్, అనురాగ్, 'టెంపర్' వంశీ, రవి ప్రకాష్, రవి వర్మ తదితరులు నటించిన ఈ సినిమాకు రఘు కుంచె సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆలీబాబా.

# ఏజెంట్ కంటిన్యూ అవుతాడు



● రాహుల్, నవీన్ పొలిశెట్టి, స్వరూప్

స్వధర్మ ఎంటర్‌టైన్ మెంట్ పతాకంపై నవీన్ పొలిశెట్టి, శృతిశర్మ జంటగా స్వరూప్ ఆర్ ఎస్‌జె దర్శకత్వం వహించిన చిత్రం 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' రాహుల్ యాదవ్ నక్కా నిర్మాత. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ– ''ఈ సక్సెస్ మా టీమ్ రెండున్నరేళ్ల కష్టం. సినిమా రిలీజ్ వరకు ఫుల్ టెన్షన్ పడ్డాం. అసలు రెండు, మూడు థియేటర్స్ దొరుకుతాయో లేదో అనుకున్నాం. అయితే మా సినిమా 70 థియేటర్లలో విడుదలైంది. విజయవంతంగా మూడో వారంలోకి అడుగుపెడుతున్నాం. విజయ్ దేవరకొండ మొదటి నుండి మమ్మల్ని సపోర్ట్ చేశారు. బన్నీ (అల్లు అర్జున్) ట్వీట్ చేయటంతో పాటు మమ్మల్ని పిలిచి ఓ అరగంట మాట్లాడారు. నేనీ రోజు ఇక్కడ నిలబడి ఉండటానికి కారణం మా దర్శకుడు స్వరూప్, నిర్మాత రాహులే'' అన్నారు. స్వరూప్ మాట్లాడుతూ– ''డిజిటల్ మాధ్యమం పెరిగిన తర్వాత కూడా మా సినిమా మూడో వారంలోకి రావటం ఆనందంగా ఉంది. ఏజెంట్‌కు పార్ట్–2 ఎప్పుడు అని అందరూ అడుగుతున్నారు. మేం ఉన్నంతకాలం ఈ సినిమాకు ఫ్రాంచైజీ వస్తూనే ఉంటుంది'' అన్నారు. రాహుల్ మాట్లాడుతూ– ''సినిమాపై చాలామందికి అపనమ్మకాలు ఉండేవి. వాటన్నింటినీ దాటుకొని ఈ రోజు సినిమా హిట్ అవటం హ్యాపీగా ఉంది. థియేటర్స్ అడిగినప్పుడు ఫస్ట్ షోకు తీసేసే సినిమాకు థియేటర్స్ ఎందుకు? అన్నారు. సినిమా తీయటం కంటే రిలీజ్ చేయటం కష్టం. రేపు రిలీజ్ అన్నప్పుడు కూడా టెన్షన్ పడ్డాను'' అన్నారు.

# ఓషన్ బేబీ


● త్రిష



తీరిక లేని షెడ్యూల్స్‌తో బిజీగా ఉండే త్రిష సినిమాలను కాస్త పక్కన పెట్టి చిన్న బ్రేక్ తీసుకున్నారు. మాల్దీవుల్లోని సముద్ర తీరాలకు వాలిపోయి ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. తన ఆనందానికి గుర్తులుగా తీసుకున్న ఫొటోలను ప్రేక్షకులతో పంచుకున్నారు. ''మాల్దీవుల్లో ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నా. మేకప్ లేకుండానే నా ఫొటోలను షేర్ చేసున్నాను. ఓషన్ బేబీలా ఉండటం నాకు ఇష్టం'' అని త్రిష అంటున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం 'రాంగీ' అనే సినిమా చేస్తున్నారు. ఆమె నటించిన కొన్ని సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి.

# ప్రతిదీ డ్రీమ్ ప్రాజెక్టే

''అభిమానిగా మొదలైన నా ప్రయాణం జర్నలిస్ట్‌గా, పీఆర్వోగా ప్రస్తుతం నిర్మాత వరకూ వచ్చింది. ఈ ప్రయాణంలో నన్ను నిలబెట్టిన వాళ్లు, నాతో నిలబడ్డవాళ్లకు కృతజ్ఞతలు'' అన్నారు యస్.కె.ఎన్. 'భలే భలే మగాడివోయ్, మహానుభావుడు' సినిమాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా 'ఈ రోజుల్లో, టాక్సీవాలా' సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు యస్.కె.యన్. ఇవాళ ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా తన ప్రయాణాన్ని గురించి యస్.కె.యన్. మాట్లాడుతూ– ''ఇంటర్‌నెట్ ఇంకా ఊపు అందుకోని సమయంలో ఏలూరులో ఎర్లీ మార్నింగ్ షో చూసి సినిమా మీద నా అభిప్రాయాన్ని ఆన్‌లైన్‌లో షేర్ చేసేవాణ్ణి. ఆన్‌లైన్‌లో మెగాఫ్యాన్స్ క్లబ్ రన్ చేసేవాళ్లం. అల్లు శిరీష్‌గారితో పరిచయం అయింది. ఆయన నన్ను బన్నీ (అల్లు అర్జున్)గారికి పరిచయం చేశారు. బన్నీగారు హీరో అయ్యే సమయం నుంచి ఆయనతో ట్రావెల్ అవుతూ వచ్చాను. ఏం చేస్తావు? అని అడిగారు బన్నీ. మీ ఫ్యామిలీతో ట్రావెల్ అవుతాను అని చెప్పాను. అప్పటి నుంచి మెగా ఫ్యామిలీతో అనుబంధం ఏర్పడింది. టీవీ9లో కొంత కాలం పని చేశాను. ఆ తర్వాత పీఆర్వోగా సినిమాలు చేశాను. యూవీ క్రియేషన్స్ వంశీ, దర్శకుడు మారుతీ, నేను కలసి కొన్ని సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చేశాం. మారుతితో ఏర్పడ్డ అసోసియేషన్ వల్ల తన ప్రతీ సినిమాలో భాగమవుతూ వస్తున్నాను. జర్నలిస్ట్‌గా ఉన్నప్పుడు సినిమాను విశ్లేషిస్తూ, ఎలా ఉండాలో అని విమర్శించాం. ఇప్పుడు ఆ విమర్శలు రాకుండా స్క్రిప్ట్స్ ఎంపిక చేసుకుంటున్నాం. ప్రస్తుతం తెలుగు సినిమా మంచి ఫేజ్‌లో ఉంది. దేశంలో బెస్ట్ కమర్షియల్ సినిమాలు మనమే తీయగలం అని నా అభిప్రాయం. మమ్మల్ని గైడ్ చేస్తున్న అరవింద్‌గారికి, చిరంజీవిగారికి థ్యాంక్స్. మొదటి సినిమాకే విజయ్ దేవరకొండ లాంటి అప్‌కమింగ్ స్టార్ హీరోతో సినిమా నిర్మించడం మంచి ఎక్స్‌పీరియన్స్. ప్రస్తుతం ఇద్దరు డైరెక్టర్స్ కథల్ని ఓకే చేశాం. సాయి తేజ్‌తో మారుతి తీస్తున్న 'ప్రతి రోజూ పండగ' భిన్నంగా ఉంటుంది. ప్రతీ ప్రాజెక్ట్ నాకు డ్రీమ్ ప్రాజెక్టే'' అన్నారు.


● యస్.కె.యన్

# నా కెరీర్ బెస్ట్ ఫిల్మ్ సవారి

– నందు


● ప్రియాంక, సాహిత్,సంతోష్, నందు, తరుణ్ భాస్కర్

''తెలుగు తెరపై కొత్త కథలు వస్తున్నాయి. సాహిత్ ఎంచుకొన్న కథ డిఫరెంట్‌గా ఉంది. దాన్ని తెరపై బాగా చూపించి ఉంటారనే నమ్మకం ఉంది. నందుకు ఈ సినిమా చక్కటి బ్రేక్ ఇస్తుంది అనుకుంటున్నాను' అన్నారు దర్శకుడు తరుణ్ భాస్కర్. 'బంధం రేగడ్' అనే ఇండిపెండెంట్ ఫిల్మ్‌తో గుర్తింపు పొందిన సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'సవారి'. సంతోశ్ మోత్కూరి, నిశాంక్ కుడితి నిర్మించారు. నందు, ప్రియాంకా శర్మలు జంటగా నటించిన ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దర్శకుడు తరుణ్ భాస్కర్, ప్రణయ్‌రెడ్డి వంగా, టి.ఎన్.ఆర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ– ''ఇదివరకు నేను చాలా సినిమాల్లో నటించాను. 'సవారి' నా కెరీర్ బెస్ట్ ఫిల్మ్. సాహిత్ ఓ కొత్త కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నా బాడీ లాంగ్వేజ్, క్యారెక్టర్ ఈ సినిమాకు కరెక్ట్‌గా సెట్ అయ్యాయి'' అన్నారు. సాహిత్ మాట్లాడుతూ– ''టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. హీరో పాత్ర విభిన్నంగా ఉంటుంది. నందు ఈ పాత్రకు బాగా సెట్ అయ్యాడు'' అన్నారు. ''ఈ చిత్రం షూటింగ్ సమయంలో నందు నన్ను ఎంతగానో సపోర్ట్ చేశాడు. ఈ సినిమాలో నేను చాలెంజింగ్ రోల్ చేశాను. ఇంత మంచి పాత్ర ఇచ్చిన సాహిత్‌కు థ్యాంక్స్'' అన్నారు ప్రియాంకా శర్మ.


● అమలాపాల్

## కొత్త అమలాపాల్‌ను కనుగొన్నా

''ఈ మధ్య కాలంలో నా దగ్గరకు వచ్చిన అన్ని స్క్రిప్ట్‌లు అబద్ధాలతో నిండినవే. దాంతో విసిగిపోయి ఇక సినిమాలను వదిలేద్దాం అనుకుంటున్న సమయంలో 'ఆడై' సినిమా నా దగ్గరకు వచ్చింది'' అన్నారు అమలాపాల్. రత్నకుమార్ దర్శకత్వంలో అమలాపాల్ నటించిన చిత్రం 'ఆడై'. అంటే బట్టలు అని అర్థం. ఈ సినిమాలో కొన్ని సన్నివేశాల్లో నగ్నంగా నటించారు అమలాపాల్. ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం రిలీజ్ చేశారు. చెన్నైలో జరిగిన ఈ వేడుకలో అమలాపాల్ మాట్లాడుతూ – ''ఆడై' స్క్రిప్ట్ ఫస్ట్ పేజీ చదవగానే షాక్ అయ్యాను. ఈ సినిమాకు నిర్మాత కూడా దొరికారా? అని ఆశ్చర్యపోయాను. 'ఆడై' అనేది చాలా క్రేజీ ఫిల్మ్. నటిగా మనం ఒక సైడ్‌ని మాత్రం చూపిస్తాం. ఎందుకంటే మనకు మనమే ఓ పరిధి గీసేసుకుంటాం. కానీ ఈ సినిమా ద్వారా కొత్త అమలాపాల్‌ని కనుగొన్నాను. నాలో అలాంటి ఒక అమ్మాయి ఉంటుంది అనే విషయానే ఇన్నేళ్లూ నేను గుర్తించలేదు'' అన్నారు. 'ఆడై' చిత్రం 'ఆమె' పేరుతో తెలుగులో రిలీజ్ కానుంది.

# దర్శకుడు ధవళ సత్యంకు మాతృవియోగం


● ధవళ సత్యం

విప్లవ చిత్రాల దర్శకునిగా ఎంతో పేరు సంపాదించారు దర్శకుడు ధవళ సత్యం. శనివారం ఉదయం నర్సాపూర్‌లో ఆయన తల్లి సరస్వతి (86) తుది శ్వాస విడిచారు. ఆమెకు నలుగురు కుమారులు. ముగ్గురు కుమారులు చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్నారు. ఒక కుమారుడు నర్సాపూర్‌లో కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. సరస్వతి అంత్యక్రియలు శనివారం నర్సాపూర్‌లో నిర్వహించారు.


● 'థాకడ్'లో కంగనా రనౌత్

# ఇంకెవరైనా మిగిలారా?

నిప్పుల రణరంగంలోకి ఎర్రటి చూపులతో ఆగ్రహంగా అడుగుపెట్టారు బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్. రెండు చేతుల్లో తుపాకులను పట్టుకుని ఇంకెవరైనా మిగిలారా? అంటూ ఆ రణరంగంలోని ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. కంగనా రనౌత్ నటించనున్న తాజా యాక్షన్ చిత్రం 'థాకడ్'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ రజనీష్ రాజీ ఘయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ''మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' సినిమా సక్సెస్ తర్వాత ఫీమేల్ యాక్షన్ సినిమాల పట్ల ఆడియన్స్ ఆసక్తిగా ఉన్నారని తెలుస్తోంది. ఈ సినిమా నా కెరీర్‌లో ఒక బెంచ్ మార్క్‌లా నిలిచిపోవడమే కాదు.. ఇండియన్ సినిమాకు ఒక టర్నింగ్ పాయింట్‌లా ఉంటుందని ఆశిస్తున్నాను'' అని కంగనా రనౌత్ అన్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయాలనుకుంటున్నారు. ఇంకా 'జడ్జ్‌మెంటల్‌హై క్యా?' కంగనా నెక్ట్స్ రిలీజ్. ఈ సినిమాలో రాజ్‌కుమార్ రావు హీరో. అలాగే కబడ్డీ ప్లేయర్‌గా కంగనా రనౌత్ నటించిన 'పంగా' సినిమా కూడా రిలీజ్‌కు రెడీ అయింది.


● ప్రియాంక, నిక్

# పాస్తా చేస్తాం!

తీపి కబుర్లు చెప్పుకోవడం, తియ్యని మిఠాయిలు తినిపించుకోవడం వంటివే కాదు భార్యాభర్తలు కలసి వంట చేయడం కూడా తీపి ఓ జ్ఞాపకమే. అలాంటి తీయని జ్ఞాపకాన్ని జీవిత కాలం గుర్తుంచుకోవాలనుకుంటున్నారు ప్రియాంకా చోప్రా, నిక్ జోనస్. ఫ్రాన్స్‌లో జరిగిన నిక్ జోనస్ కజిన్ జో జోనస్‌ల పెళ్లికి హాజరయ్యాక ప్రియానిక్ ఇటలీ చెక్కేశారు. అక్కడ డిన్నర్ డేట్‌ని డిఫరెంట్‌గా ప్లాన్ చేసుకున్నారు. ఇద్దరూ పాస్తా తయారు చేశారు. విశేషం ఏంటంటే.. ఇద్దరికీ వంట రాదు. కలసి నేర్చుకుంటూ పాస్తా చేశారు. ''ఇదో అందమైన అనుభూతి'' అంటోంది ఈ జంట.



● రజిత్

# వాస్తవ సంఘటనలతో...

అరే మామా వాడెవడో ఎక్స్‌ట్రాలు చేస్తున్నాడురా ధమ్కీ ఇవ్వాలిరా అంటూ ఉంటాం. రజిత్, త్రిషాలాషా జంటగా నటిస్తున్న చిత్రం పేరు 'ధమ్కీ'. భాస్కరరావు, శ్రీమతి ఆదిలక్ష్మి సమర్పణలో సుంకర బ్రదర్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సత్యానారాయణ సుంకర నిర్మాత. ఏనుగంటి దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఏనుగంటి మాట్లాడుతూ– ''కొన్ని వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాను. క్రైమ్, యాక్షన్, థ్రిల్లర్ జోనర్‌లో రూపొందుతోంది. ఆద్యంతం సినిమా అలరిస్తుంది' అన్నారు. సత్యనారాయణ సుంకర మాట్లాడుతూ– ''ధమ్కీ' చిత్రం ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని త్వరలో రిలీజ్ చేస్తాం. సినిమా కథ నచ్చి నిర్మించాను. దర్శకుడు ఏనుగంటి కొన్ని సీన్స్‌ను మెస్మరైజింగ్‌గా తెరకెక్కించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి ఫైట్స్: రామ్ లక్ష్మణ్, కెమెరా: ఎసి.బి. ఆనంద్.

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
7-7-2019

ఆషాడం

# ఆధ్యాత్మికతకు ఆలవాలం



పూర్వాషాడ నక్షత్రంలో కూడిన పౌర్ణమి ఉన్న నెల ఆషాడ మాసం. ఆషాడ మాసాన్ని శూన్య మాసం అని అంటారు. ఈ మాసంలో చేసే స్నానం, దానం, జపం, పారాయణలు విశేషఫలితాన్ని ఇస్తాయి. ఆషాడ మాసంలోనే దక్షిణాయనం ఆరంభమవుతుంది. దక్షిణాయనం పితృదేవతలకు ప్రీతికరమని ప్రతీతి. ఆషాడ మాసం శుభకార్యాలకు పనికిరాదని చెప్పబడుతూ ఉన్నా ఈ నెలలో ఎన్నో పండుగలు, పుణ్యదినాలు ఉన్నాయి.

**ఆషాడ మాసం విశేషం ఏమిటి?**

శుభకార్యాలకు పనికిరానప్పటికీ ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకతను, ఎన్నో మహిమలను సొంతం చేసుకుని పుణ్యఫలాలను ప్రసరించే మాసం ఆషాడం. ఈ మాసంలో శుద్ధపంచమికి స్కంధ పంచమి అని పేరు. సుబ్రమణ్య స్వామిని ఈ రోజు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఆషాడ షష్ఠిని కుమార షష్ఠిగా జరుపుకొంటారు

శుక్లపక్ష షష్ఠినాడు శ్రీసుబ్రహ్మణ్యసామి వారిని పూజించి కేవలం నీటిని మాత్రమే స్వీకరించి కఠిన ఉపవాసం ఉండి మరునాడు స్వామి ఆలయానికి వెళ్ళి దర్శించడం వల్ల వ్యాధులన్నీ తొలగిపోయి ఆయురారోగ్యాలు అభివృద్ధి చెందుతాయని చెప్పబడుతుంది.

**తొలి పండగ... తొలి ఏకాదశి**

దీనికే ప్రథమ ఏకాదశి అని శయన ఏకాదశి అని కూడా పేరు. శ్రీ మహావిష్ణువు ఈ దినం మొదలుకుని నాలుగునెలలపాటు పాలకడలిలో శేష శయ్యపై శయనించి యోగనిద్రలో ఉంటాడు. కనుక దీన్ని 'శయన ఏకాదశి' అంటారు. ఈ దినమంతా ఉపవాసం ఉండి విష్ణువును పూజించాలి. మరునాడు ద్వాదశినాడు తిరిగి శ్రీమహావిష్ణువును పూజించి నైవేద్యం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించిన తర్వాత భుజించాలి. ఒక రకంగా పరిశీలిస్తే, ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు (పంచ భూతాలు, సూర్యచంద్రులు, గ్రహాలు పరస్పర సంబంధాన్నీ, వాటి గమనాన్ని బట్టి) సంకేతంగా చెప్పుకోవచ్చు. అంతేగాక చాతుర్మాస్య వ్రతం కూడా ప్రారంభమౌతుంది. ఇదే రోజున గోపద్మ వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఈ రోజు మొదలుకొని, కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు అంటే క్షీరాబ్ధి ద్వాదశి వరకు ఆచరించాలని మన పురాణాలు చెబుతున్నాయి.

మన పంచాంగం ప్రకారం నెలకు రెండు చొప్పున ఇరవై నాలుగు(24) ఏకాదశులు వస్తాయి. చాంద్రమానం ప్రకారం మూడు సంవత్సరాల కొక సారి అధిక మాసం వస్తుంది. అలాంటప్పుడు ఇరవై ఆరు ఏకాదశులు వస్తాయి. అన్నిటిలోకి తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి ఎక్కువగా జరుపుకుంటాము.

ఏకాదశి అంటే పద కొండు అని అర్థం. ఈ ఏకాదశి విశిష్టత గురించి పద్మ పురాణం వివరించింది. త్రిమూర్తులలో శ్రీహరితో ముడిపడిన ఈ ఏకాదశి మహత్యం గురించి అనేక కథలు కూడా మన పురాణాలలో వివరించబడిన సంగతి విదితమే.

అష్టకష్టాలతో తల మునకలౌతున్న మానవ జాతిని ఉద్ధరించటానికి సాక్షాత్ శ్రీహరే ఈ ఏకాదశిని ఏర్పాటు చేశాడనీ, ఈ వ్రతాన్ని నియమనిష్ఠలతో ఆచరించిన వారు సమస్త వ్యధల నుంచీ విముక్తి పొందగలరనీ, మరణానంతరం వైకుంఠ ప్రాప్తి లభిస్తుందనీ పద్మ పురాణం పేర్కొంది.

**శుభకార్యాలు ఎందుకు జరుపుకోరు?**

ఆషాడం అనారోగ్య మాసం అని కూడా మనందరికీ తెలుసు. విపరీతమైన ఈదురుగాలుల తో్ చినుకులు పడే సమయం ఈ ఆషాడ మాసమే. కాలువ లోను, నదుల లోను, ప్రవహించే నీరు పరిశుభ్రంగా ఉండదు. చెరువుల లోనికి వచ్చి చేరిన నీరు మలినంగా ఉండి మనుషుల ఆరోగ్యాలకు హాని కలిగిస్తుంది. మనది వ్యవసాయ ఆధారిత దేశం. పొలం పనులన్నీ ఈ మాసం లోనే మొదలు పెడతారు రైతులు. చైత్ర వైశాఖ మాసాలలో వ్యవసాయపు పనులు ఉండవు. కాబట్టే ఈ సమయంలోనే వివాహాది శుభముహూర్తాలు ఎక్కువగా ఉంటాయి,

ఆషాఢమాసం అనగానే గుర్తుకు వచ్చే విషయం వివాహమైన తరువాత వచ్చే తొలి ఆషాఢ మాసంలో కొత్తగా అత్తవారింటికి వచ్చిన కోడలు, అత్తగారు ఒకచోట కలిసి ఉండరాదు అనే విషయం. అంటే పెళ్ళయిన తొలి ఆషాఢ మాసంలో అత్తా కోడళ్ళు ఒకేగడప దాటకూడదు అనేది దీని అర్థం. సామాజికంగా, చారిత్రకంగా పరిశీలిస్తే కొన్ని ఆరోగ్య రహస్యాలు కూడా ఇమిడి ఉన్నాయి.

ఈ రోజుల్లో కొత్తగా పెళ్లి అయిన యువకులు ఆరు నెలల కాలం అత్తగారి ఇంట్లో ఉండే సంప్రదాయం ఉండేది. కష్టపడి వ్యవసాయపు పనులు చేయవలసిన యువకులు అత్తవారింట్లో కూర్చొని ఉంటే, సకాలంలో జరగాల్సిన పనులు జరగవు. వర్షాలకు తగినట్లుగా విత్తనాలు చల్లుకొనే రోజులు అవి. ఇప్పటిలాగ కాలువల ద్వారా నీరు లభించేది కాదు. సరైన సమయంలో విత్తనాలు చల్లకపోతే సంవత్సరమంతా దారిద్ర్యంతో బాధ పడవలసిందే. అందుకే కొత్త కోడలు పుట్టింట్లోనే ఉండాలి. అల్లుడు అత్తవారింటికి వెళ్ళకూడదు అనే నియమం విధించారు పెద్దలు. ఇంటిధ్యాసతో పనులు సరిగా చేయరని ఆషాడమాస నియమం పెట్టారు. అంతేకాకుండా, అనారోగ్య మాసం ఆషాడం. కొత్త నీరు తాగటం వల్ల చలి జ్వరాలు, విరోచనాలు, తల నొప్పి మొదలైన రోగాలు వచ్చే సమయం, స్త్రీలు గర్భం ధరించడానికి మంచి సమయం కాదు, అనారోగ్య దినాలలోను అశుభ సమయాలలోను, గర్భధారణ జరిగితే ఉత్తమ సంతానం కలగదనే నమ్మకం కూడా ఉంది. ఇన్ని కారణాల వల్ల ఆషాడ మాసాన్ని కొన్ని పనులకు నిషిద్ధం చేసారు పెద్దలు.

ఆషాడమాసంలో మహిళలు ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవాలంటారు. ఎందుకంటే, ఆషాడంలో పడే వర్షాలకు, చేసే పనులకు అరచేతులు పాచిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం మంచిదంటారు. అలాగే వాతవ్యాధులు రాకుండా ఉండేందుకు ఆహారంలో మునగ ఆకు, మునగ పూలు, మునగ కాయలు వాడటం మంచిదని అంటారు. పెద్దలు ఏర్పాటు చేసే ఆచారాల వెనక అనేక అంతరార్థాలు ఉంటాయి. తెలుసుకుని పాటించడం శ్రేయోదాయకం.

– డి. శ్రీలేఖ

### తొలి ఏకాదశిన ఏం చేయాలి?

● దశమి నాడు రాత్రి నిరాహారులై ఉండి ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందుగా కాలకృత్యాలు తీర్చుకుని శ్రీహరిని పూజించాలి ● ఆ రోజు మొత్తం ఉపవాసం ఉండాలి ● అసత్య మాడరాదు ● స్త్రీ సాంగత్యం పనికి రాదు ● కాని పనులు, దుష్ట ఆలోచనలు చేయకూడదు ● ఆ రోజు రాత్రంతా జాగరణ చేయాలి మర్నాడు అనగా ద్వాదశినాడు ఉదయాన్నే కాలకృత్యాదుల అనంతరం శ్రీహరిని పూజించి నైవేద్య తాంబూలాలు సమర్పించి భోజనం చేయాలి ● రోజంతా శ్రీహరి నామస్మరణ చేయటం వలన గొప్ప ఫలితాలు కలుగుతాయి ● అన్నదానం చేయడం చాలా మంచిది ● ఆషాఢమాసంలో పాదరక్షలు, గొడుగు, ఉప్పు దానం చేయడం మంచి ఫలితాలనిస్తుంది ● ఈ వ్రతం చేసుకున్నవారికి సూర్య చంద్ర గ్రహణాలలో భూరి దానాలిచ్చినంత, అశ్వమేధ యాగం చేసినంత, అరవై వేల సంవత్సరాలు తపస్సు చేసినంత పుణ్యం లభిస్తుందని ఏకాదశి వ్రత మహత్యాన్ని గురించి మన పురాణాలు వివరిస్తున్నాయి.

### ఆషాడ బోనాలు

ఆషాడ మాసంలోనే తెలంగాణా ప్రాంతంలో సంప్రదాయ బద్ధమైన బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. మహంకాళి అమ్మవారి కోసం తయారు చేసే భోజనాన్ని బోనంగా చెప్తారు (భోజనానికి వికృతి పదమే బోనం). దీనిని అమ్మవారికి నివేదన చేసే పర్వదినాన్నే బోనాలు అంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఈ పండుగను అత్యంత వైభవంగా జరుపుకొంటారు. సమస్త జగత్తుకు కారణమైనటువంటి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. అన్నం, బెల్లం, పెరుగు, పసుపు నీళ్ళు, వేపాకులు ఈ బోనంలో ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి హాని కలిగించే వ్యాధుల నుండి ఉపకరించేవి. ఈ సమయంలో ప్రకృతిలో జరిగే మార్పుల వలన అనారోగ్యాల పాలు కాకుండా ఇవెంతో మేలు చేస్తాయి.

నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్

## ప్రశ్నోత్తర భారతం



269. సత్యవతితో భీష్ముడు ఏమని పలికాడు?
270. భీష్ముడు సత్యవతిని ఏమని అర్థించింది?
271. పూర్వం పరశురాముడు క్రోధంతో ఏం చేశాడు?
272. క్షత్రియులు హతం కావడంతో ఏం జరిగింది?
273. ఆ సమయంలో రాజులకు ఎవరు సంతానాన్ని ప్రసాదించారు?
274. దీర్ఘతముడు ఎవరు? దీర్ఘతముని భార్య ఎవరు?
275. ప్రద్వేషిణి దీర్ఘతముడి మీద పెంచుకున్న కోపంతో ఏమంది?
276. దీర్ఘతముడు కోపంతో ఏం చేశాడు?
277. భర్త మీద కోపంతో ప్రద్వేషిణి ఏం చేసింది?
278. కొడుకులు ఏం చేశారు?
279. దీర్ఘతముడిని ఎవరు రక్షించారు?
280. దీర్ఘతముడిని ఏమని అర్థించాడు?
281. బలి ఏం చేశాడు?

–నిర్వహణ: డా. పురాణపండ వైజయంతి

**జవాబులు:** 269) అమ్మా! సూర్యుడు తేజస్సును, చంద్రుడు చల్లదనాన్ని, అగ్ని ఉష్ణాన్ని వీడలేనట్లే నేను నా బ్రహ్మచర్యాన్ని వీడలేను' అని పలికాడు. 270) వంశరక్షణ చేసే మార్గాన్ని చూపమని అర్థించిచగా, అమ్మా! పూర్వం ఇటువంటి సమస్య వచ్చినప్పుడు అవలంబించిన విధానాన్ని అవలంబించటం ధర్మం' అన్నాడు 271) క్షత్రియుల మీద కోపంతో క్షత్రియులను హతమార్చాడు 272) రాజవంశాలు నశించే దశ వచ్చింది. 273) బ్రాహ్మణులు రాజుల భార్యలకు సంతానం ప్రసాదించారు. ఇది ధర్మ మార్గం 274) అతడు ఒక ఋషి, గుడ్డివాడు. అతడి భార్య ప్రద్వేషిణి. ఆమె అనుకూలవతి. ఆమెకు గౌతముడు మొదలగు అనేకమంది సంతానం కలిగారు. 275) భార్యను భరించేవాడు భర్త, భరించబడేది భార్య. కాని మన విషయంలో నేను నిన్ను భరిస్తున్నాను, ఇంక భరించలేను, మరొక ప్రదేశానికి వెళ్ళమని కోపంగా అంది 276) కోపంతో స్త్రీలను శపించాడు 277) తన కుమారులను పిలిచి, తండ్రిని నదిలో వేసి రమ్మంది 278) తండ్రిని నది దగ్గరకు తీసుకువెళ్లి, కట్టెలకు కట్టి, నదిలో విడిచారు 279) ఆ సమయంలో బలి అనే రాజు స్నానానికి వచ్చాడు. వేదాధ్యయనం చేస్తున్న దీర్ఘతముడిని రక్షించి రాజాసాధానికి తీసుకువెళ్లాడు 280) తనకు సంతానం లేదని, ప్రసాదించమని దీర్ఘతముడిని అర్థించాడు 281) తన భార్య సుధేష్ణను దీర్ఘతమునికి అర్పించాడు. ఆమెకు అంగరాజు అనే కుమారుడు జన్మించాడు.

సువార్త

# ఇశ్రాయేలీయులకు తప్పిన మహా ప్రమాదం

ఐగుప్తులో 430 ఏళ్ళు బానిసలుగా బతికిన ఇశ్రాయేలీయులను దేవుడు విడిపించి వాగ్దాన దేశానికి మళ్ళీ తీసుకెళ్లడం అనేది క్రైస్తవంలో అత్యంత ప్రధానమైన ఘట్టం. ఈ ఘట్టమంతటికీ నాయకత్వం వహించిన మోషే పాత్ర క్రైస్తవంలో కీలకమైనది. అటు పరిశుద్ధతకు, ఉగ్రతకు మారుపేరైన దేవునికి, ఇటు కృతజ్ఞతారాహిత్యానికి, అవిధేయతకు మారుపేరైన ఇశ్రాయేలీయులనే తన ప్రజలకు మధ్య అనుసంధానకర్తగా మోషే చేసిన త్యాగం,చూపిన తెగువ, జ్ఞానం, భక్తి, పట్టుదల, సమయస్ఫూర్తిని వర్ణించడానికి మాటలు చాలవు. ఒకసారైతే ఇశ్రాయేలీయులు గొప్ప ప్రమాదంలో పడ్డారు. ఒకవైపు దేవుని అపారమైన ప్రేమను, సహాయాన్ని అనుభవిస్తూనే దేవుని మీద తిరుగుబాటు చేశారు. ధర్మశాస్త్రాన్ని తేవడానికి సీనాయి పర్వతాన్నెక్కిన మోషే దిగిరావడం ఆలస్యం కావడంతో, వాళ్ళు ఒక బంగారు దూడను చేసుకొని అదే ఇకనుండి తమకు దేవుడంటూ దానికి సాగిలపడటం చూసి దేవుడు మహోగ్రరూపం దాల్చాడు. వాళ్ళందరినీ ఒక్క దెబ్బతో సంహారం చేస్తానని దేవుడు మోషేకు తెలిపాడు. అయితే ఎంతసేపూ దేవుని సన్నిధిలో విధేయుడిగా తలవంచి ఆయన చెప్పినదల్లా వినడం, అలా చెయ్యడం మాత్రమే తెలిసిన మోషే అది విని తలెత్తి దేవునితో మాట్లాడుతూ 'అలా చెయ్యకండి ప్రభువా' అని వారించాడు. 'నువ్వు వాళ్ళ గురించి ప్రాధేయపడకు, కావాలంటే నాకోసం మరో కొత్తజనాంగాన్ని నీ నుండే సృష్టిస్తాను' అని దేవుడు చెబితే, 'వాగ్దాన దేశానికి తీసుకెళ్తానన్న దేవుడు తన ప్రజల్ని మధ్య దారిలోనే సంహారం చేసి మాట తప్పాడన్న అపఖ్యాతి మీకు వస్తుంది కదా. అందువల్ల దయచేసి అలా చెయ్యకండి' అంటూ మోషే దేవుణ్ణి మరింత వేడుకోగా చివరికి దేవుడు సమ్మతించాడు (నిర్గమ 23:1–14). మోషే దేవునికే 'కౌన్సెలింగ్' చేసి ఆయన్ను ప్రశాంతపర్చే స్థాయికి తన విధేయత, భయభక్తుల్లో ఎదగడం నిజంగా ఆశ్చర్యం, అపూర్వం. అందుకే దేవుడు 'మోషే నా ఇల్లంతటిలోకి నమ్మకమైనవాడు' అని కితాబునిచ్చాడు( సంఖ్యా12:7).

పౌలు విశ్వాసులంతా దేవుని ఇంటివాళ్ళంటాడు(ఎఫె 2:19). ఆ ఇంటికి దేవుడు యజమాని అయితే, మోషే ఇంటిపెద్ద అయ్యాడు. దేవునికే పట్టని ప్రజల్ని నేనెందుకు పట్టించుకునేది? అనుకోకుండా, ఇంటికి పెద్దవాడుగా మోషే తన యింటివారిని దేవుని ఉగ్రత నుండి కాపాడుకొనే బాధ్యత తీసుకున్నాడు. వాళ్ళను సంహరించి నీ కుటుంబం నుండే కొత్త జనాంగాన్ని సృష్టిస్తానంటే మోషే కాకుండా మరెవరైనా ఆయన స్థానంలో ఉంటే దాన్ని



మించిన బంపర్ ఆఫర్ లేదనుకొని ఎగిరి గంతేసేవారే. కానీ తన ప్రజలకోసం మోషే అంతటి భాగ్యాన్ని కూడా వదులుకొని గొప్ప దైవజనుడనిపించుకున్నాడు. మోషేలాంటి నిస్వార్థపరులైన, దైవభయమున్న, తమ ప్రజలపట్ల మమకారం కలిగిన దైవసేవకులు, పాస్టర్లు, పరిచారకులు ఈనాడు కూడా ఉంటే ఎంత బావుండేది కదూ!! ఆనాడు ప్రజలు బంగారుదూడను చేసుకుంటే మోషే వారి పక్షంగా క్షమాపణ చెప్పి దేవుణ్ణి ఒప్పించాడు. కానీ కంచె చేను మేసినట్టు, ఈనాడు పరిచారకులకే బంగారు దూడలుంటే అదెంత బాధాకరం? మోషే లాంటి పరిచారకులు ఒక ప్రార్ధనతో కోట్లాదిమంది విశ్వాసులకు ఆశీర్వాదాలు సాధించి పెట్టగలరు. కాని బంగారు దూడలున్న కోటిమంది పరిచారకులు చేసే శత కోటి ప్రార్థనలు కూడా ఆశీర్వాదాలు సాధించి పెట్టలేవు, ఒక మోషే, ఒక ఏలియా, ఒక పౌలు వంటి పరిచారకులతోనే అది సాధ్యం.

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

సంగీత సాహిత్యం

## ఏకాంతవేళలో చెబితే
# వింటాడమ్మా!





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వాగ్గేయకారులకు ఎంత స్వతంత్రమో చూడండి. వారి భక్తి, వారి తాదాత్మ్యత, వారి దార్శనికత అటువంటివి. ఆ పరమేశ్వరుడు కూడా భక్తులను తన పిల్లలలాగానే చూస్తూ వారి నిష్కపటత్వాన్ని సానుకూలంగా చూస్తాడు. కారాగారంలో భటులు అత్యంత క్రూరంగా హింసించడాన్ని తట్టుకోలేక రామదాసు వ్యక్తం చేసిన బాధలో కూడా భక్తి మరింత చిక్కగా కనిపిస్తుంది. ఆయన కీర్తనలోని ఆర్తిని చూడండి..''ప్రక్కను చేరిక చెక్కిలి నొక్కుచు చక్కగా మరుకేళి చొక్కి యుండెడివేళ/నను బ్రోవమనీ చెప్పవే../లోకాంతరంగుడు శ్రీకాంత నినుగూడి ఏకాంతమున ఏకశయ్యానున్నా వేళ../నను బ్రోవమనీ చెప్పవే సీతమ్మ తల్లీ../అద్రిజా వినుతుడు భద్రగిరీశుడు నిద్రా మేల్కొను వేళ నెలతరో బోధించి.../నను బ్రోవమనీ చెప్పవే...''

అమ్మా! నేను రామచంద్రమూర్తికి ఎంతగా మొర పెట్టుకున్నా ఆయన ఆలకించడం లేదమ్మా...నన్ను కరుణించమని నువ్వయినా చెప్పమ్మా.. రాత్రి ఏకాంత శయనం చేయడానికి వచ్చినప్పుడు, నీ పక్కన కూర్చుంటాడు కదా..ఆ చెక్కిలిని చేత్తో పట్టుకుంటాడు. ఆ అనురాగంలో మురిసిపోతున్న నీ ముఖం చూసుకుని బాహ్య ప్రపంచాన్ని మరిచి మనస్సంతా నీయందే లగ్నమయిపోయినప్పుడు ''ఆ రామదాసు సంగతేం చేసారు'' అని గుర్తుచెయ్యమ్మా..అప్పుడు చెప్తే ఆయనకు బాగా గుర్తుంటుంది. నీ పక్కన కూర్చుని నీ బుగ్గలు పట్టుకుని 'మరుకేళి చొక్కేటటువంటి సమయంలో ఒక్కసారి నా గురించి చెప్పమ్మా'.... అప్పుడేమంటారో తెలుసామ్మా ఆయన...''రామదాసు సంగతా, సీతా తప్పకుండా చూస్తా' అంటాడు. అలా అనగానే నమ్మకమ్మోయ్! తెల్లవారి నిద్రలేచిన తరువాత మళ్ళీ తన వ్యాపకంలో తాను పడిపోతాడు. అద్రిజా వినుతుడు–ఆ రామచంద్రమూర్తి తెల్లవారి నిద్రలేచి వెళ్ళేసమయంలో నెలతరో.... అంటూ... గుర్తు చెయ్యమ్మా...' అని అంత శారీరక బాధలో, అంత గుండెలు పిండే ఆర్తితో చేసుకున్న విన్నపాలలో ఎక్కడా తన రామచంద్ర మూర్తిపట్ల కఠినంగా మాట్లాడలేదు, కానీ అమ్మ దయను వర్ణించారు. దానికి అమ్మ తల్లడిల్లిపోయిందట.

ఇదే ఒరవడిని దాశరథిగారు కూడా ఒక గీతంలో పాటించారు. ''నడిరేయి ఏ ఝాములో, స్వామి నిను చేర దిగివచ్చునో/తిరుమల శిఖరాలు దిగి వచ్చునో/మముగన్న మాయమ్మ అలివేలు మంగమ్మ/పతిదేవు ఒడిలోన మురిసేటివేళ/స్వామి చిరునవ్వు వెన్నెలలు కురిసేటి వేళ/విభునికి మా మాట వినిపించవమ్మా/ ప్రభువుకు మా మనవి వినిపించవమ్మా.../అడగవే మాతల్లి అనురాగవల్లి....'' అన్నారు.

తల్లడిల్లిన అమ్మ చరచర నడుచుకుంటూ వెళ్ళి 'స్వామీ, నేనడిగానని అనుకోవద్దు. పన్నెండేళ్ళయి పోతున్నది. ఆ కారాగారంలో పడి బిడ్డ అన్ని దెబ్బలు తింటున్నాడు. శరీరమంతా చిట్లిపోయింది. తేళ్ళు కరుస్తున్నాయి. అయినా 'శ్రీ రామ నీనామమెంత రుచిరా, ఏమి రుచిరా' అని చిందులు వేస్తున్నాడు. ఏం రక్షించరా మీరు?''అని నిలదీసిందట.

''సీతా! నీకేనా, నాకు బాధలేదనుకుంటున్నావా, నేనెంత బెంగ పెట్టుకున్నానో తెలుసా! రాత్రిళ్ళు నాకు నిద్రపట్టడం లేదు. మనసులో మనసు ఉండడం లేదు. కానీ రామదాసు ఒక తప్పు చేసాడు. గతజన్మలో ఒక చిలుకను తెచ్చి 12 ఏళ్ళు పంజరంలో బంధించాడు. ఆ ప్రారబ్ద కర్మ పూర్తికావాలి కదా. అదెప్పుడు పూర్తవుతుందా అని నేను ప్రతిక్షణం లెక్కపెట్టుకుంటున్నాను. నా భక్తుడిని ఎప్పుడు రక్షించుకుందామా అని ఆరాటపడిపోతున్నాను. ఆ కీర్తనలు వినపడుతుంటే నిలబడలేక పోతున్నాను,కూర్చోలేక పోతున్నాను...'అని తన ఆంతరంగాన్ని ఆవిష్కరించాడట. అది తీరిన మరుక్షణమే ఆరు లక్షల వరహాలు ఇచ్చేసి రశీదు పుచ్చేసుకున్నాడు. ఆ సీతారాములను కదిలించిన కీర్తనలు అవి.

ధర్మజిజ్ఞాస

**రేపటినుంచి మూఢమి అంటున్నారు. ఈ కాలంలో చేయదగ్గ పనులేవి?**

– ఎ. పార్వతి, హైదరాబాద్

గురుగ్రహం కాని, శుక్ర గ్రహం కాని సూర్యునితో కలసి ఉండే కాలాన్ని మౌఢ్యమి లేదా మూఢమి అంటారు. మీరు చెప్పినట్లు రేపటినుంచి శుక్రమౌఢ్యమి. ఇది సెప్టెంబర్ 20 వరకు ఉంది. ఈ మౌఢ్య కాలంలో గ్రహ కిరణాలు భూమిపై ప్రసరించడానికి సూర్యుడు అడ్డంగా ఉంటాడు. అందువల్ల మౌఢ్యకాలంలో గ్రహాలు బలహీనంగా ఉంటాయి. శుభగ్రహమైన శుక్రునకు మౌఢ్యమి వచ్చినప్పుడు సమస్త శుభకార్యాలు నిషిద్ధం. మౌఢ్యమిని 'మూఢమి'గా వాడుకభాషలో పిలుస్తారు. ఈ మూఢమి సమయంలో నూతన కార్యక్రమాలు చేయకూడదని పెద్దలు చెబుతారు. మూఢమి అంటే చీకటి అని అర్థం.

శుక్రమౌఢ్యమి కాలంలో ప్రకృతి సంపద క్షీణిస్తుంది. సముద్రం ఆటుపోటులలో మార్పులు వస్తాయి. శుక్రగ్రహ పాలిత ద్వీపాలకు, ప్రదేశాలకు భూకంప ప్రమాదాలు పొంచి ఉంటాయి. స్త్రీల మీద అత్యధికంగా అత్యాచారాలు జరిగే అవకాశాలుంటాయి. శుక్రుడు సంసార జీవితానికి –శృంగార జీవితానికి కారకుడు. జాతకంలో శుక్రుడు బలహీనంగా ఉంటే సంసారజీవితం సజావుగా సాగదు. ఇలాంటి వారు ఇంద్రాణీ దేవి స్తోత్రం పారాయణం చేయండి.

**మౌఢ్యమిలో చేయకూడనివి:** పెళ్ళిచూపులు, వివాహం, ఉపనయనం, గృహారంభం, గృహ ప్రవేశం, యజ్ఞాలు, మంత్రానుష్టానం, విగ్రహ ప్రతిష్టలు, వ్రతాలు, నూతనవధువు ప్రవేశం, నూతన వాహనం కొనటం, బావులు, బోరింగులు, చెరువులు తవ్వటం, పుట్టువెంట్రుకలకు, వేదా'విద్యా'ఆరంభం, చెవులు కుట్టించటం, నూతన వ్యాపార ఆరంభాలు.

**మౌఢ్యమిలో చేయదగ్గవి:** మౌఢ్యమిలో జాతకర్మ, జాతకం రాయించుకోవడం, నవ గ్రహ శాంతులు, జప, హోమాది శాంతులు, గండనక్షత్ర శాంతులు ఉత్సవాలు, సీమంతం, నామకరణం, అన్నప్రాసనాది కార్యక్రమాలు చేయవచ్చు. వీటికి గురుమౌఢ్యమి వచ్చినా, శుక్రమౌఢ్యమి వచ్చినా ఫరవాలేదు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరి పరిస్థితులలో మూఢాలలో ప్రయాణం చేయాల్సి వస్తే శుభ తిథులలో అశ్వని, రేవతి నక్షత్రాలలో శుభ హోరలో భర్తతో కలిసి ప్రయాణం చేస్తే శుక్రదోషం వర్తించదని శాస్త్రం సూచిస్తుంది.

ఇస్లాం వెలుగు

# ధర్మబద్ధమైనదే అసలు జీవితం

పూర్వం ఒకరాజు ఉండేవాడు. అతను తన రాజ్యంలో అందరూ సత్యమే మాట్లాడాలని, ఎవరైనా రాజాజ్ఞను ఖాతరు చేయకుండా అబద్ధాలాడినట్లు రుజువైతే, ఒక్కొక్క అబద్ధానికి ఐదు వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని ఉత్తరువులు జారీ చేశాడు. అలా రోజులు గడిచిపోతున్నాయి.

ఒకరోజు రాజు మారువేషం ధరించి, మంత్రిని వెంటబెట్టుకొని గస్తీకి బయలు దేరాడు. అలా తిరుగుతూ.. తిరుగుతూ ఒకవ్యాపారి ఇంటివద్దకు చేరుకున్నాడు. అతని పేరు ఫఖ్రుద్దీన్. మంచివాడు. ధార్మిక చింతన కలవాడు. రాజును, మంత్రిని బాటసారులుగా భావించిన ఫఖ్రుద్దీన్ వారికి తేనీరు ఇచ్చాడు. మాటల సందర్భంలో రాజు వ్యాపారిని, 'నీ వయసెంత?' అని అడిగాడు. అతను 'ఇరవై సంవత్సరాలు' అని చెప్పాడు. రాజు భృకుటి ముడిపడింది. ఫఖ్రుద్దీన్‌కు నలభై సంవత్సరాలు పైనే ఉంటాయి. కాని అబద్ధం చెబుతున్నాడు.

'ఎంత సంపాదించావు.. ఎంత ఆస్తి ఉంది' అని మరో ప్రశ్న అడిగాడు. 'లక్ష రూపాయలు' అని సమాధానమిచ్చాడు ఫఖ్రుద్దీన్. 'పిల్లలెంత మందీ?'అని మళ్ళీ ప్రశ్నించాడు రాజు. 'ఒక్కడే' అన్నాడు ఫఖ్రుద్దీన్.

ఎందుకో ఫఖ్రుద్దీన్ మాటలు నమ్మబుద్ధికాలేదు. మరుసటిరోజు, ఫఖ్రుద్దీన్ గురించి ఆరా తీశాడు. ఆ వివరాల ప్రకారం, ఫఖ్రుద్దీన్ వయసు నలభై మూడేళ్ళుగా, పిల్లలు ముగ్గురున్నట్లుగా, ఆస్తి కూడా అతను చెప్పిన దానికంటే అధికంగానే ఉన్నట్లు తెలిసింది. తరువాత, రాజు ఫఖ్రుద్దీన్‌ను తనదర్బారుకు పిలిపించాడు.

నిన్నటిరోజు మారువేషంలో అడిగిన ప్రశ్నలనే మళ్ళీ అడిగాడు. ఫఖ్రుద్దీన్ అవే సమాధానాలు మళ్ళీ చెప్పాడు.

రాజుకు ఆశ్చర్యం వేసింది. అసలు విషయం ఏమిటో చెప్పమని ఆదేశించాడు.

అప్పుడు ఫఖ్రుద్దీన్ .. 'మహారాజా..! నాకు వయసు ఎంతున్నప్పటికీ, ధర్మబద్ధమైన, అర్థవంతమైన, నీతివంతమైన జీవితం గడిపింది ఇరవై ఏళ్ళే. మిగతా జీవితమంతా ఆటపాటల్లో, విలాసాల్లో గడిచిపోయింది. అందుకే ధర్మబద్ధంగా గడిచిన జీవితాన్నే నేను పరిగణనలోకి తీసుకున్నాను. నా ఆస్తి లక్ష రూపాయలు అని చెప్పడానికి కారణం ఏమిటంటే, ఒక మస్జిద్, ఒకపాఠశాల, ఒకబోరు బావి నిర్మాణాల్లో నేను ఖర్చు చేసిన లక్ష రూపాయలే నా ఆస్తి. రేపటి రోజున పనికొచ్చేది అదే కాబట్టి దాన్నే నా ఆస్తిగా పరిగణించాను. ఇక సంతానమంటారా..? ముగ్గురు సంతానంలో ఒక్కడే బుద్ధిమంతుడుగా, దర్మబద్ధమైన జీవితం గడుపుతూ, సమాజ సంక్షేమం కోసం పాటు పడుతున్నాడు. అందుకే, వక్రమార్గాన పయనించే వారిని వదిలేసి, ఈ ఒక్కణ్ణే నా సంతానమని చెప్పాను.' అన్నాడు ఫఖ్రుద్దీన్ .

ఫఖ్రుద్దీన్ మాటలు రాజుకు ఎంతగానో నచ్చాయి. అతనికి విధించిన జరిమానా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాడు.

నిజమే.. అల్లాహ్ ఆదేశానుసారం ధర్మబద్ధంగా గడిపిన జీవితానికే విలువ.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

ఆలయం.. ఆగమం

# ఆరు లోకాలు... ఆరు భాగాలు



ఆలయం (గర్భగుడి) కేవలం ఒక నిర్మాణమే కాదు. అది సాక్షాత్తు భగవంతుడి స్వరూపం. ఆలయంలో దాని అధిష్ఠానదేవత అయిన ఆలయ పురుషుడు సదా నిలిచి ఉంటాడు.అది భగవంతుడి దేహం. మన దేహంలో షట్చక్రాలు ఎలా ఉంటాయో, అలాగే ఆలయాన్ని (గర్భగుడి )ఆరు భాగాలతో ఒక దానిపై మరోభాగం పేర్చుకుంటూ పొడవుగా పైకి నిర్మిస్తారు. భూమిపై ఉన్న భక్తుడు ఆలయాన్ని ఆలంబనగా చేసుకొని ఒక్కో భాగాన్ని ఒక్కో స్థితిగా భావించి వాటిని దాటుకుని ఉన్నత స్థితికి చేరుకుంటాడు. భగవంతుని అనంతతత్త్వంలో ఐక్యమౌతాడు. భూమి పైన ఉండే భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్య లోకాలనే ఆరులోకాలకూ అధిష్ఠానం, స్తంభవర్గం, ప్రస్తరం, కంఠం, శిఖరం, స్తూపి అనేవి ఈ ఆరుభాగాలు ప్రతీకలని కూడా చెప్పబడ్డాయి. అందుకే ఆ ఆరుభాగాలను, అందులోని విశేషాలను భక్తులు తప్పని సరిగా తెలుసుకోవాలి.

ఈ ఆలయాన్ని నిలుచున్న దేవుడితో పోలిస్తే ఈ ఆరు భాగాలు ఆలయపురుషుడి శరీరంలోని ఒక్కో భాగంగా భాసిల్లుతాయి. మొదటిది అధిష్ఠానం. ఇది భూమి నుండి పైకి లేచే మొదటి భాగం. ఆలయానికి ఆధారం. రాజుకు సింహాసనం ఎలాగో ఆలయానికి అధిష్ఠానం అలాంటిది. దీన్ని ఆలయపురుషుడి పాదాలనుండి మోకాలి దాకా ఉండే భాగంగా భావించాలి. రెండవది స్తంభవర్గం అంటే ఇది గర్భగుడి గోడ. ఇక్కడ అనేక రకాలైన తోరణాలు, దేవకోష్ఠం(దేవుడి గూడు) మొదలైనవి ఉంటాయి. ఇది ఆలయ పురుషుడి చేతులు. మూడవది ప్రస్తరం. ఇది ఆలయం పైకప్పు. మనకు బయటకి మాత్రం వంపు కలిగిన ఆలయం చూరు మాత్రమే కనిపిస్తుంది. ఈ చూరు ఆలయపురుషుడి బాహువులు. జాగ్రత్తగా గమనిస్తే బాహుమూలం ఎలాంటి వంపు ఉంటుందో ఈ భాగం అలాగే ఉంటుంది. నాల్గవది కంఠం. శిఖరభాగం ఇక్కడే మొదలవుతుంది. ఇది ఆలయపురుషుడికి కంఠం. మన శరీరంలో కంఠం ఎలా లోపలికి ఉంటుందో ఈ భాగం కూడా అలాగే ఉంటుంది. పైగా ఈ కంఠభాగంలో దేవతలను ప్రతిష్ఠిస్తారు. ఐదవ భాగం శిఖరం. ఈ భాగాన్ని చాలా మంది విమానగోపురం అని పిలుస్తారు. ఇది వికసించని పద్మాకారంలో ఉంటుంది. ఆ భాగం ఆలయ పురుషుడి ముఖం. ఆరవది స్తూపి. ఈ భాగం ఆలయానికి చిట్టచివరి భాగం. అనంతవిశ్వశక్తి ఆలయం లోనికి రాకపోకలు సాగించేది ఈ భాగం ద్వారానే. ఇది పద్మం ముకుళం(మొగ్గ) వలె ఉంటుంది. ఇది ఆలయపురుషుడి శిఖా(జుట్టుముడి). ఇలా ఆలయంలోని అన్ని భాగాలలోనూ ఆలయపురుషుడు ఆవిష్కృతమౌతాడు. ఇలా ఆలయాన్ని ఆపాదమస్తకం దర్శించి తరించండి.

– **కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య,** ఆగమ, శిల్పశాస్త్రపండితులు

గురు సన్నిధి

# జనహృదయవాసి భావానంద యతి



నిజాం నిరంకుశ పాలన కింద నలుగుతున్న తెలంగాణ ప్రాంతమది. రజాకార్లు, పెత్తందార్లు తమ ఆగడాలతో సామాన్య జనాల శ్రమను దోచుకుంటున్న సంఘటనలను చూచి ఓ హృదయం ద్రవించింది. వారి దీనస్థితిని తొలగించేందుకు మార్గం వెతికింది. సకల లోక రక్షకుడైన జగన్నాథుడే మార్గం చూపగలడని నమ్మింది. భగవన్నామంతో జనాలను ఏకీకృతం చేసి సంఘశక్తిని నిరూపించింది. ఆ చైతన్య స్వరూపమే శ్రీభావానంద యతీశ్వరులు.

తెలంగాణ రాష్ట్రంలోని మరుకూకు గ్రామంలో శంభయ్య–రత్నమ్మ దంపతులకు జన్మించారు సత్యనారాయణులు. చిన్నవయసులోనే భక్తి వైరాగ్య భావాలతో భగవధ్యానంలో లీనమై ఉండేవాడు. అతని నోటివెంట వచ్చిన ప్రతి మాట జరిగి తీరేదట. దాంతో తండోపతండాలుగా జన ప్రవాహం మొదలైంది. అలా వచ్చినవారికి సనాతన ధర్మంలోని అనేక విషయాలను వివరించేవారు. నృత్య భజనకు శ్రీకారం చుట్టారు.

భగవద్భజనలో పరవశులై తన్మయత్వంతో వీరు చేసే నృత్యాన్ని చూస్తూ ఆ బాలగోపాలం మైమరచేవారు.

**భావానంద భారతీ స్వామిగా...**

కాలక్రమేణా వీరు గ్రామాన్ని విడిచి పొలిమేరలో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పారు. పండరీపురం నుండి తెచ్చిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలను అక్కడ నిలిపి 'శ్రీపాండురంగాశ్రమమ్' అని పేరు పెట్టారు. అనంతరం సన్న్యాసాన్ని స్వీకరించి శ్రీ భావానంద భారతీస్వామిగా యోగపట్టాను పొందారు.

**'నాదం... ప్రసాదం'**

ఊరూరా తిరుగుతూ, శ్రామికవర్గాన్ని సైతం చేరదీస్తూ భగవన్నామాన్ని జపించమని ఉపదేశిస్తు, భగవద్గుణాలను విరివిగా ప్రచారం చేశారు భావానందులు. ఆశ్రమంలో ఎవరు, ఏ వేళలో అడుగుపెట్టినా అన్నప్రసాదాలకు కొదవలేకుండా అందించడం ఆయన ఆశయం.

**'ఆషాఢీ ఉత్సవాలు'**

పాండురంగాశ్రమంలో నేటినుంచి ఏడురోజుల పాటు 88వ ఆషాఢీ ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా శతరుద్రాభిషేకం, సామూహిక కుంకుమార్చన, అఖండ నామ సంకీర్తన, రుక్మిణీ పాండురంగ స్వామివారికి క్షీరాభిషేకం, పుష్పార్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయి.

– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని
వేదపండితులు

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
ఆదివారం
7-7-2019

# హర్యానా హరికేన్


● రణ్‌వీర్ సింగ్

... అనగానే క్రికెట్ ప్రేమికులకు ఆల్ రౌండర్ కపిల్ దేవ్ గుర్తుకు వస్తారు. కానీ రీసెంట్ టైమ్‌లో బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్‌ను గుర్తు చేసుకుంటున్నారు సినీ లవర్స్. కపిల్‌దేవ్ సారథ్యంలో ఇండియన్ క్రికెట్ టీమ్ 1983లో ప్రపంచకప్ సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంలో సారథిగా కపిల్‌దేవ్ కీలక పాత్ర పోషించారు. ఈ మధుర క్షణాలను వెండితెరపైకి తీసుకువచ్చేందుకు రంగంలోకి దిగారు బాలీవుడ్ దర్శకుడు కబీర్ ఖాన్. కపిల్‌దేవ్ పాత్రలో రణ్‌వీర్‌సింగ్ నటిస్తున్నారు. శనివారం రణ్‌వీర్ సింగ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా '1983' హిందీ సినిమాలోని రణ్‌వీర్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. అలాగే వివాహం తరవాత తొలిసారి ఈ సినిమాలోనే జంటగా నటిస్తున్నారు రణ్‌వీర్ సింగ్ అండ్ దీపికా పదుకోన్.

# గ్రాండ్ ఎంట్రీ?


● ఎన్టీఆర్, రామ్‌చరణ్

ప్రస్తుతం చిన్ని బ్రేక్‌లో ఉన్న 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ త్వరలో నార్త్ ఇండియాకు పయనం కానున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. ఈ సినిమాలో స్వాతంత్ర్య సమరయోధులు కొమురం భీం పాత్రలో ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు పాత్రలో రామ్‌చరణ్ నటిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ ఆలియా భట్ నటిస్తున్నారు. ఎన్టీఆర్ సరసన హీరోయిన్ ఇంకా ఫైనలైజ్ కాలేదు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్స్ పుణే, అహ్మదాబాద్ పరిసర ప్రాంతాల్లో జరగనున్నట్లు తెలిసింది. అంతేకాదు ఈ సినిమాలో ఎన్టీఆర్ ఎంట్రీ సీన్‌కు పాతిక కోట్లు, రామ్‌చరణ్ ఎంట్రీ సీన్‌కు పదిహేను కోట్ల రూపాయలను టీమ్ కేటాయించిందట. ఆల్రెడీ రామ్‌చరణ్ ఎంట్రీ సీన్ పూర్తయిన సంగతి తెలిసిందే. దీంతో చరణ్‌కు చిన్న బ్రేక్ ఇచ్చి ఎన్టీఆర్‌పై చిత్రీకరణ స్టార్ట్ చేస్తారట. ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్రకు తండ్రి పాత్రలో అజయ్ దేవగణ్ నటించనున్నారని తాజా సమాచారం. ఈ నార్త్ ఇండియా షెడ్యూల్స్‌లోనే ఆలియా, అజయ్ పాల్గొంటారట. సముద్రఖని, రాహుల్‌రామకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు కీరవాణి స్వరకర్త. ఈ సినిమాను వచ్చే ఏడాది జూలై 30న విడుదల చేయాలనుకుంటున్నారు.

# నాదీ అక్కదీ ఒకటే కల

**"వారం రోజుల నుంచి మా ఇంట్లో సెలబ్రేషన్ మూడ్ నడుస్తోంది. డాడీ (రాజశేఖర్) 'కల్కి' రిలీజ్ అయిన 15 రోజులకే నా సినిమా (దొరసాని) రిలీజ్ అవుతోంది. ఇది ప్లాన్ చేసింది కాదు. కానీ ఈ మూమెంట్‌ని అందరం కలసి సెలబ్రేట్ చేసుకుంటున్నాం. అప్పుడప్పుడు కొంచెం టెన్షన్ కూడా పడుతున్నాం (నవ్వుతూ)" అని శివాత్మిక రాజశేఖర్ అన్నారు. విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ, జీవితారాజశేఖర్ తనయ శివాత్మిక హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం 'దొరసాని'. కెవీ మహేంద్ర దర్శకత్వంలో 'మధుర' శ్రీధర్, యష్ రంగినేని నిర్మించారు. ఈ నెల 12న ఈ సినిమా రిలీజ్ కానున్న సందర్భంగా శివాత్మిక చెప్పిన విశేషాలు.**


● శివాత్మిక రాజశేఖర్

● నేను చిన్నప్పటి నుంచీ సినిమా వాతావరణంలోనే పెరిగాను. షూటింగ్ స్పాట్‌లోనే ఎక్కువ రోజులు గడిపాను. చిన్నపటి నుంచి సినిమాలే ప్రపంచం. నాన్న సినిమాల షూటింగ్స్‌కి వెళ్లడం, స్క్రిప్ట్స్ చూడటం ఇలా అన్నీ చూస్తూ పెరిగిన నా మీద సినిమా ప్రభావం చాలా ఉంది.

● ఇంటర్ సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ పూర్తి చేసి కొంచెం బ్రేక్ తీసుకుని డ్రామా క్లాసులకో, డ్యాన్స్ ఏదైనా నేర్చుకుందాం అనో ప్లాన్ చేశాను. ఆ సమయంలో 'దొరసాని' కథ నా దగ్గరకు వచ్చింది. 'మధుర' శ్రీధర్ అంకుల్ మా ఫ్యామిలీ ఫ్రెండ్. ఈ సినిమా కోసం కొత్త అమ్మాయిని చూస్తున్నారు. ఆ సమయంలో కథ వినమన్నారు. మహేంద్రగారు నాలుగు గంటలు కథ చెప్పారు. చాలా గొప్పగా రాసుకున్నారు. కథ నాకు బాగా నచ్చింది. ఆ తర్వాత ఆడిషన్ తీసుకున్నారు. స్క్రీన్ టెస్ట్ కూడా జరిగిన తర్వాతే నన్ను ఎంపిక చేశారు.

● తెలంగాణ ప్రాంతంలో జరిగిన పీరియాడికల్ మూవీ ఇది. ఒక దొరసానికి, రాజు అనే మామూలు కుర్రాడికి ప్రేమ ఎలా ఏర్పడింది? ఆ కాలంలో జరిగే ఇష్యూలను ఇందులో చూపించాం. మహేంద్రగారికి ప్రతీది ఆయన రాసుకున్నట్టుగానే ఉండాలి. సినిమాలో నా ఫస్ట్ సీన్ ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడటం. అది బ్యాక్ షాట్. కెమెరా నా వెనక ఉంటుంది. యాక్టింగ్ నా బ్లడ్‌లోనే ఉంది. సింగిల్ టేక్‌లో చేసి పడేస్తా (నవ్వుతూ) అనుకున్నాను. సెట్లోకి వెళ్లగానే ఫ్రీజ్ అయిపోయా. ఆ సీన్‌ని కూడా నాలుగైదు సార్లు చేయించారు మహేంద్రగారు. దొరసాని ఫోన్ అలా ఎత్తాలి, బాడీ లాంగ్వేజ్ ప్రత్యేకంగా ఇలానే ఉండాలి అన్నారు.

● ఆడిషన్ జరిగిన తర్వాత ఫస్ట్ సెలెక్ట్ అయింది ఆనందే. తను చాలా మంచి యాక్టర్. సెట్లో మేం మంచి ఫ్రెండ్స్ అయిపోయాం. 'దొరసాని' లో నా పాత్ర చాలా తక్కువ మాట్లాడుతుంది. సినిమా మొత్తం మీద 12 డైలాగ్స్ కూడా ఉండవేమో? అన్నీ కళ్లతోనే వ్యక్తపరచాలి. కొన్ని సీన్లలో చాలా స్ట్రయిన్‌గా అనిపించింది. నా బెస్ట్ అయితే ఇచ్చాననే అనుకుంటున్నాను. ప్రేక్షకులు డిసైడ్ చేయాలి.

● 'మీ అమ్మలానే ఉన్నావు' అని చాలామంది అన్నారు. ఈ సినిమాలో నా పాత్రకు లుక్స్ పరంగా చాలా రిఫరెన్స్‌లు అమ్మ నుంచే తీసుకున్నాను. అమ్మ యంగ్‌గా ఉన్నప్పుడు ఎలాంటి జ్యూయలరీ వేసుకున్నారు అవన్నీ చూశాను. కానీ ఫర్ఫార్మెన్స్‌ని మాత్రం రిఫరెన్స్‌గా తీసుకోలేదు. మనకంటూ ఒరిజినాలిటీ ఉండదని నా ఫీలింగ్. అమ్మానాన్న కూడా అలా చెయ్ ఇలా చెయ్ అని చెప్పలేదు కానీ 'చేసే పాత్రలో పూర్తిగా నిమగ్నం అయి చెయ్యి' అని చెప్పారు.

● 'కల్కి' సినిమాకు నేను, అక్క కో–ప్రొడ్యూసర్స్‌గా చేశాం. ఇద్దరం చాలా కష్టపడ్డాం. నేను 'దొరసాని'కి, 'కల్కి'కి షిఫ్ట్ అవుతూ వర్క్ చేశాను. అక్క ఫోకస్ అంతా ఈ సినిమా మీదే. సెట్లో మేం ఇలా పని చేయడం చూసే 'చిరంజీవి సినిమాలు చరణ్ ఎలా నిర్మిస్తున్నారో, నా సినిమాలు మా అమ్మాయిలు నిర్మిస్తున్నారు' అని 'కల్కి' ఈవెంట్‌లో నాన్నగారు అన్నారు. మా కష్టాన్ని చూసి గర్వంతో అన్న మాటలవి. చిన్నప్పుడు.. నాకు అబ్బాయిలు ఉండుంటే ఇలా ఉండేది అలా ఉండేది అని మమ్మల్ని సరదాగా ఏడిపించేవారు. కానీ ఇప్పుడు ఆయన చాలా గర్వంగా ఉన్నారు.

● ఇంట్లో డాడీ స్క్రిప్ట్స్ అన్నీ చదివి, నరేట్ చేస్తుండే దాన్ని. అలా స్క్రిప్ట్స్ చదవడం అలవాటయింది. ఇప్పుడు మేం సినిమాలు చేస్తున్నాం అని డాడీ సినిమాలు తగ్గించనవసరం లేదు. ఆయన సినిమాలు చేస్తూనే ఉండాలి. ఎందుకంటే ఆయనకు నేను పెద్ద ఫ్యాన్‌ని. మమ్మీ సినిమా చూశారు. తనకు చాలా నచ్చింది. డాడీ మాత్రం ట్రైలర్, టీజర్స్ చూశారు. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

● ఆఫర్స్ ఉన్నాయి కానీ నెక్ట్స్ సినిమా ఏంటో ఇంకా నిర్ణయించుకోలేదు. నా వయసుకి తగ్గ పాత్రలు, నాకు సూట్ అయ్యేవి చేయాలనుకుంటున్నాను.

## ఫేవరెట్స్ లేరు

'మాకు మీ ఇద్దరూ ఇష్టమే. ఇద్దరిలో ఫేవరెట్స్ ఎవరూ లేరు' అని చెబుతారు మమ్మీడాడీ. అది నిజమే అనుకుంటున్నాను (నవ్వుతూ). మేం నలుగురం ఫ్రెండ్స్‌లా ఉంటాం. మా ఫ్రెండ్స్ కూడా మమ్మీడాడీకి క్లోజ్. మా ఫ్రెండ్స్ కూడా ఏదైనా మాట్లాడాలంటే మా కంటే వాళ్లతోనే ఎక్కువ డిస్కస్ చేస్తారు.

## డాడీకి సీక్రెట్స్ దాచడం రాదు!

డాడీకి సీక్రెట్స్ మెయింటెయిన్ చేయడమే రాదు. బాగా వీక్. మేం అక్కకి బర్త్‌డే సర్‌ప్రైజ్ ప్లాన్ చేస్తుంటే ఆయన వెళ్లి అక్కకే 'నీ బర్త్‌డే సర్‌ప్రైజ్ ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పేస్తారు. అలాగే మా ఫ్యామిలీ మెంబర్స్ అందరూ కూడా కలసి నటించాలనే ఆలోచన ఉంది. అది ఇంకా ఐడియా స్టేజ్‌లోనే ఉంది. అప్పుడే బయటకు చెప్పేశారు (నవ్వుతూ).

**పదేళ్ల వయసు నుంచే అక్కా, నేను ఎలాంటి సినిమాలు చేయాలో అని మాట్లాడుకునే వాళ్లం. ఏదైనా సినిమా చూస్తే నీకు అలాంటి పాత్రలు సూట్ అవుతాయి అని నాకు చెబుతుంది. నేను తనకు ఏదైనా చెబుతాను. నాదీ, అక్కదీ ఒకటే కల. హీరోయిన్ అవాలని.**

# రెండో కర్తవ్యంలో సమంత

'యు టర్న్, సూపర్ డీలక్స్, మజిలీ' తాజాగా 'ఓ బేబీ'... ఇలా సమంత సక్సెస్ మంచి పీక్స్‌లో ఉంది. సినిమా ఎంపిక, కథలోని పాత్రల్లో ఆమె ఒదిగిపోయే తీరు ప్రేక్షకులకు భలేగా నచ్చుతున్నాయి. ఇప్పటికే మహానటి, రంగస్థలం, యు టర్న్ చిత్రాల్లోని నటనకు బోలెడన్ని ప్రశంసలు దక్కించుకున్న సమంత 'ఓ బేబీ'లో విజృంభించారు. ఇక లేడీ ఓరియంటెడ్ మూవీస్‌కి సమంత లేటెస్ట్ చాయిస్ అని పలువురు దర్శక–నిర్మాతలు అంటున్నారు. ఈ క్రమంలో సమంతతో 'ఆరమ్' (తెలుగులో 'కర్తవ్యం') దర్శకుడు గోపీ నాయర్ ఓ ఫీమేల్ ఓరియంటెడ్ మూవీ చేయడానికి ట్రై చేస్తున్నారట. అయితే... సమంతతో గోపీ తెరకెక్కించబోయే సినిమా కొత్త కథనా? లేక 'ఆరమ్' సీక్వెల్‌నా? అనే విషయం తెలియాల్సి ఉంది.


● సమంత

# ఇద్దరు స్నేహితుల కథ...


● వెంకట్ రామిరెడ్డి

'కె.ఎస్ 100' సినిమా ఈనెల 12న విడుదల కానుంది. చంద్రశేఖరా మూవీస్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రానికి షేర్ దర్శకుడు. కె.వెంకట్ రామిరెడ్డి నిర్మాత. శనివారం విలేఖరుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ–'మాది ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ బిజినెస్. 1995 నుండి సినిమా ఇండస్ట్రీలో ఉన్నాను. ఇంగ్లిష్ సినిమాలను తెలుగులోకి డబ్బింగ్ చేసేవాడిని. ఇప్పటివరకు దాదాపు 25 సినిమాలు చేశాను. 'టైమ్‌పాస్' 'మోడ్రన్ గర్ల్' చిత్రాల ద్వారా నిర్మాతగా మారాను. 'కె.ఎస్ 100' నిర్మాతగా నా మూడవ చిత్రం. ఈ చిత్రంలోని కె అంటే కుమార్, ఎస్ అంటే స్వామి. ఈ ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్. కొన్ని సంఘటనల వల్ల వారు శత్రువులుగా మారుతారు. ఆ స్నేహితులు మళ్లీ కలిశారా? లేదా? అనేది కథ. షేర్ అద్భుతంగా తెరకెక్కించారు. ట్రైలర్స్ బాగుండడంతో తమిళ డబ్బింగ్ రైట్స్ మంచి రేటుకు అమ్ముడయ్యాయి. ఈ సినిమా బిజినెస్ పరంగా సేఫ్‌లో ఉన్నాను' అన్నారు.

# లండన్ ప్రయాణం


● ధనుష్

దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్– ధనుష్ ఎప్పటి నుంచో ఓ సినిమా చేయాలనుకుంటున్నారు. అనివార్య కారణాల వల్ల ఈ సినిమా వాయిదా పడుతూ వస్తుంది. ఇదే సినిమాని పట్టాలెక్కించడానికి రెండుసార్లు ప్రయత్నించి, విఫలమయ్యారు. ఈ ప్రాజెక్ట్‌ను మళ్లీ స్టార్ట్ చేస్తున్నారని సమాచారం. వై నాట్ స్టూడియోస్ నిర్మించనున్న ఈ సినిమా ఎక్కువ శాతం షూటింగ్ లండన్‌లో జరగనుందట. రెండు నెలలు పాటు లండన్‌లో ఏకధాటిగా షూటింగ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో ఓ హాలీవుడ్ నటుడు కీలక పాత్ర చేయనున్నారని తెలిసింది. ప్రస్తుతం ధనుష్ రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇవి పూర్తయ్యాక కార్తీక్ సుబ్బరాజ్‌తో చేయబోయే సినిమా కోసం లండన్ ప్రయాణం కానున్నారు.

# సినిమాలు తీస్తా


● సిద్ధార్థ్ మల్హోత్రా

బాలీవుడ్ బెస్ట్ యంగ్ హీరోస్‌లో సిద్ధార్థ్ మల్హోత్రా ఒకరు. హీరో కాకముందు షారుక్ ఖాన్ నటించిన 'మై నేమ్ ఈజ్ ఖాన్' (2010) సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు సిద్ధార్థ్. ప్రస్తుతం హీరోగా ఫుల్‌ఫామ్‌లో ఉన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు కదా. హీరోగా రాణిస్తున్న మీరు భవిష్యత్‌లో డైరెక్షన్ చేస్తారా? అనే ప్రశ్న ఈ కుర్ర హీరో ముందు ఉంచితే.... ''షారుక్‌గారి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. కానీ ప్రస్తుతం హీరోగా రాణిస్తున్నందుకు సంతోషంగా ఉంది. మొదట్నుంచి నాకు ఫిల్మ్ మేకింగ్‌పై స్పెషల్ ఫోకస్ ఉంది. భవిష్యత్‌లో ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేయాలనే ఆలోచనలో ఉన్నాను. డైరెక్షన్ గురించి మాత్రం ఇప్పుడేం చెప్పలేను'' అన్నారు. 'మర్జావాన్' మూవీ సిద్ధార్థ్ నెక్ట్స్ రిలీజ్. ప్రస్తుతం 'షేర్షా' అనే సినిమాతో బిజీగా ఉన్నారు.










# కన్నడ సంక్షోభం


రాజీనామా చేశాక బెంగళూరులో గవర్నర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

**13 మంది ఎమ్మెల్యేల రాజీనామా**
- రాజీనామాలపై మంగళవారం స్పీకర్ నిర్ణయం
- ముంబై రిసార్టుకు తరలిన 10 మంది ఎమ్మెల్యేలు
- ప్రభుత్వానికి ఢోకాలేదు: కాంగ్రెస్

**బెంగళూరు/న్యూఢిల్లీ:** కర్ణాటకలోని జేడీఎస్–కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. శనివారం 13 మంది ఎమ్మెల్యేలు రాజీనామాలు సమర్పించడంతో రాజకీయం కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర అసెంబ్లీలోని 224 మంది సభ్యులకుగాను మెజారిటీకి అవసరమైన 118 మంది సభ్యుల బలం సంకీర్ణానికి ఉంది. తాజా రాజీనామాలను స్పీకర్ అంగీకరిస్తే మాత్రం ప్రభుత్వం కూలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

### స్పీకర్ ఆఫీస్‌లో రాజీనామా లేఖలు

కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలు శనివారం స్పీకర్ కార్యాలయంలో రాజీనామా పత్రాలు సమర్పించారు. అనంతరం వారు రాజ్‌భవన్‌లో గవర్నర్ వాజూభాయ్ వాలాను కలిశారు. 'ఇటీవలి రాజీనామా సమర్పించిన ఆనంద్ సింగ్‌తోపాటు కాంగ్రెస్, జేడీఎస్‌లకు చెందిన 14 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పీకర్ కార్యాలయంలో రాజీనామా లేఖలు అందజేశారు' అని జేడీఎస్ ఎమ్మెల్యే ఏహెచ్ విశ్వనాథ్ గవర్నర్‌తోను కలిశాక మీడియాకు చెప్పారు. 'ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం పనిచేయడం లేదు' అని విశ్వనాథ్ అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ఎమ్మెల్యేలను బీజేపీ మచ్చిక చేసుకుంటోందన్న ఆరోపణలపై ఆయన మాట్లాడుతూ.. 'ఆపరేషన్ కమలం వంటివన్నీ ఊహాగానాలు. బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నాం' అని అన్నారు. అయితే, ఆనంద్ సింగ్ సహా 13 మంది ఎమ్మెల్యేలే రాజీనామా లేఖలను అందజేసినట్లు అసెంబ్లీ సెక్రటేరియట్ వర్గాలు చెప్పాయి. ఈ పరిణామంపై స్పీకర్ రమేశ్ కుమార్ స్పందిస్తూ.. 'ఎమ్మెల్యేలు వచ్చిన సమయంలో కార్యాలయంలో లేను. మొత్తం 11 మంది శాసనసభ్యులు రాజీనామా లేఖలు ఆఫీస్‌లో ఇచ్చారు. ప్రభుత్వం కొనసాగేదీ లేనిదీ అసెంబ్లీలోనే తేలుతుంది. మంగళవారం ఆఫీసుకు వెళ్లి రాజీనామా లేఖలను పరిశీలించి, చర్య తీసుకుంటా' అని తెలిపారు. ఈ పరిణామంతో కాంగ్రెస్‌లో 'ట్రబుల్ షూటర్'గా పేరున్న డీకే శివకుమార్ రంగంలోకి దిగారు. అసంతృప్త ఎమ్మెల్యేల్లో ముఖ్యులైన రామలింగారెడ్డి తదితరులను బుజ్జగించే పనిలో పడ్డారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ బెంగళూరుకు చేరుకోనున్నారు.

### ముంబై రిసార్టుకు 10 మంది ఎమ్మెల్యేలు

రాజీనామాలు సమర్పించిన కర్ణాటక కాంగ్రెస్, జేడీఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు చార్టెర్డ్ విమానంలో శనివారం సాయంత్రం ముంబైకి బయలుదేరారు. వీరంతా హోటల్‌లో బస చేసే అవకాశముందని సమాచారం.

'ప్రత్యర్థి పార్టీల్లో జరుగుతున్న పరిణామాలతో నాకు గానీ, మా పార్టీకి గాని ఎటువంటి సంబంధం లేదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప స్పష్టం చేశారు.

### అంతర్గత కుమ్ములాటలే కారణం: బీజేపీ

కర్ణాటకలో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న కాంగ్రెస్ ఆరోపణలపై కమలదళం స్పందించింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ సంక్షోభానికి కాంగ్రెస్, జేడీఎస్ అంతర్గత కుమ్ములాటలే కారణమని బీజేపీ మీడియా చీఫ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ బలూనీ ఆరోపించారు. ఎమ్మెల్యేల రాజీనామాలతో తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

### మా ప్రభుత్వానికి ఢోకాలేదు: కాంగ్రెస్ ధీమా

ఎమ్మెల్యేల రాజీనామా వార్తలపై సంకీర్ణ ప్రభుత్వ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిద్దరామయ్య స్పందించారు. 'మా ప్రభుత్వానికి ఢోకా లేదు. తిరుగుబాటు ఎమ్మెల్యేలతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 'బంతి స్పీకర్ కోర్టులో ఉంది. ఏం జరుగుతుందో చూద్దాం' అని జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ అన్నారు.


రాజీనామా చేసిన ఎమ్మెల్యేలతో మాట్లాడేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నేత డీకే శివకుమార్

### అసెంబ్లీలో బలాబలాలు

| | |
|---|---|
| బీజేపీ | 105 |
| కాంగ్రెస్ | 78 |
| జేడీఎస్ | 37 |
| స్వతంత్రులు | 1 |
| బీఎస్పీ | 1 |
| నామినేటెడ్ | 1 |
| కేపీజేపీ | 1 |
| స్పీకర్ | 1 |

కాంగ్రెస్, జేడీఎస్‌లకు కలిపి 115 మంది సభ్యుల బలం ఉంది. ఇది మెజారిటీకి సరిపోతుంది. ఒక బీఎస్పీ, స్వతంత్రుడు, నామినేటెడ్ సభ్యుల మద్దతుతో అధికార పక్షం బలం 118గా ఉంది. కాంగ్రెస్‌కు చెందిన 8 మంది, జేడీఎస్‌కు చెందిన ముగ్గురు సభ్యులు కలిపి మొత్తం 11 మంది ఎమ్మెల్యేల రాజీనామాను స్పీకర్ ఆమోదిస్తే..అసెంబ్లీలో బలపరీక్షలో కుమారస్వామి ప్రభుత్వం నెగ్గడం కష్టం. తాజా రాజీనామాలతో కర్ణాటక అసెంబ్లీలో బలం 214కు తగ్గుతుంది. స్పీకర్‌ను మినహాయిస్తే ఆ బలం 213కు తగ్గుతుంది. ప్రభుత్వ ఏర్పాటుకు మేజిక్ ఫిగర్ 107 అవుతుంది. దీంతో ఒకే ఒక ఎమ్మెల్యే సాయంతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయగలదు. సంకీర్ణం నుంచి మరో ఇద్దరు రాజీనామా చేసే అవకాశాలుండటంతో స్పీకర్‌ను మినహాయిస్తే సభ్యుల బలం 211కు తగ్గుతుంది. అలాంటప్పుడు ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన బలం 106. అది బీజేపీకి ఇప్పటికే ఉంది.

## దినదిన గండం



గత ఏడాది రాష్ట్రఅసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 104, కాంగ్రెస్‌కు 80, జేడీఎస్ 37 సీట్లు వచ్చాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 113 సీట్లు ఎవరికీ రాలేదు. దాంతో కాంగ్రెస్, జేడీఎస్‌లు పొత్తు కట్టాయి. తమకు సభ్యులు ఎక్కువ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పదవిని జేడీఎస్‌కు ఇవ్వడానికి కాంగ్రెస్ సమ్మతించింది. బీజేపీకి అవకాశం దక్కనివ్వకూడదన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ఇలా రాజీ పడటం పార్టీ ఎమ్మెల్యేల్లో అసంతృప్తికి దారి తీసింది.

### తెల్లవారు జామున సుప్రీం విచారణ

కాంగ్రెస్–జేడీఎస్ కూటమికి ఎక్కువ బలం ఉన్నా గవర్నర్ బీజేపీనే ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించారు. మే 17న యడ్యూరప్ప సీఎంగా ప్రమాణం చేయాలని కోరారు. దీనిపై కాంగ్రెస్ కూటమి సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఎప్పుడూ లేని విధంగా సుప్రీం కోర్టు ఈ కేసును మే 17వ తేదీ తెల్లవారు జామున 2 గంటలకు విచారించింది. మూడు గంటల పాటు విచారణ జరిపాకా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారంపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. దాంతో 17వ తేదీ ఉదయం యడ్యూరప్ప నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయింది. మే 19న సభలో బలనిరూపణ చేసుకోవాలని సుప్రీం కోర్టు యడ్యూరప్పకు సూచించింది. తీరా బల పరీక్ష సమయం వచ్చే సరికి యడ్యూరప్ప తోకముడిచారు. సభలో తమకు బలం లేదని చెప్పి రాజీనామా చేశారు. బీజేపీ తనకొచ్చిన అవకాశం పోగొట్టుకోవడంతో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ముఖ్యమంత్రి కుమార స్వామికి సంకీర్ణం తలనొప్పులు మొదలయ్యాయి.

### లోక్‌సభ ఎన్నికల దెబ్బ

కాంగ్రెస్–జేడీఎస్ సభ్యుల మధ్య సయోధ్యకు ఇరు పక్షాల పెద్దలు చేసిన ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ పరిస్థితుల్లో గత మార్చిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఘోరంగా ఓడిపోయింది. 28 సీట్లకుగాను 26 సీట్లు బీజేపీ గెలుచుకుంది. అధికార కూటమి కేవలం రెండు సీట్లతో సరిపెట్టుకోవలసి వచ్చింది. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానమైన మాండ్యను పొత్తులో భాగంగా జేడీఎస్ తీసుకోవడం కాంగ్రెస్‌కు ఆగ్రహకారణమైంది. అక్కడ స్వతంత్ర అభ్యర్థి సుమలత గెలవడంతో కూటమి విభేదాలు రచ్చకెక్కాయి. లోక్‌సభ ఫలితాలతో సంకీర్ణ ప్రభుత్వంలో లుకలుకలు తీవ్రం కాగా, బీజేపీలో ఆశలు మళ్లీ చిగురించాయి. రాష్ట్రంలో ఆపరేషన్ కమల్‌ను చేపట్టింది.తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని జేడీఎస్ అధినేత దేవెగౌడ ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొందని, మధ్యంతర ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.

# మండిన పెట్రో ధరలు



- పెట్రోల్ లీటర్‌పై రూ.2.45, డీజిల్ రూ.2.36 మేర పెంపు
- కేంద్ర బడ్జెట్ ప్రభావం

**న్యూఢిల్లీ:** ఆర్థిక మంత్రి సీతారామన్ శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధుల కోసం ఇంధనంపై పన్ను పెంచడంతో ఆ ప్రభావం రవాణారంగం, వాహనదారులపై పడింది. శనివారం పెట్రోల్ ధర లీటరుపై కనిష్టంగా రూ.2.40, డీజిల్ ధర రూ.2.36 మేర పెరిగింది. ఢిల్లీలో పెట్రోల్‌పై రూ.2.45 పెరిగి లీటరు ధర రూ.72.96కు చేరుకుంది. ఇదే ముంబైలో రూ.2.42 పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.78.57కు, కోల్‌కతాలో రూ.2.49 పెరిగి రూ.75.15కు, చెన్నైలో రూ.2.57 పెరిగి లీటర్ పెట్రోల్ ధర రూ.75.76కు చేరిందని ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) తెలిపింది. కాగా, ఢిల్లీలో డీజిల్ రూ.2.36 పెరిగి లీటరు రూ.66.69కు, ముంబైలో రూ.2.50 పెరిగి లీటర్ ధర రూ.69.90 కు చేరుకుందని పేర్కొంది. రాష్ట్రాల్లో స్థానిక పన్నులు, వ్యాట్ ఆధారంగా ఈ ధరలు వేర్వేరుగా ఉండే అవకాశముందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలు, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో నడిచే ఇంధన సంస్థల్లో కూడా పెట్రోల్, డీజిల్ ధరల్లో కొద్ది వ్యత్యాసం ఉంటుందని తెలిపింది. ఆర్థిక మంత్రి సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో పెట్రోల్, డీజిల్‌లపై రోడ్లు, మౌలికరంగాల సెస్, పన్నులు కలిపి లీటరుకు రూ.2 మేర విధించడం ద్వారా ఏడాదికి రూ.24 వేల నుంచి రూ.28 వేల కోట్ల మేర సమీకరించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు లీటర్ పెట్రోల్‌పై మొత్తం పన్ను భారం రూ.17.98 ఉండగా, కేంద్ర బడ్జెట్ ప్రకటన అనంతరం ఇది లీటర్‌పై రూ.19.98కు పెరిగింది. డీజిల్ లీటర్‌పై ఉన్న మొత్తం పన్ను భారం కూడా రూ. 13.83 నుంచి రూ.15.83కు పెరిగింది. వ్యాట్ కూడా రాష్ట్రాలను బట్టి మారుతోంది. ఢిల్లీలో లీటర్ పెట్రోల్‌పై వ్యాట్ 27 శాతం, డీజిల్‌పై 16.75 శాతం ఉంది. ముంబైలో వ్యాట్ పెట్రోల్‌పై 26 శాతానికి తోడు అదనపు ట్యాక్స్ రూ.7.12 వసూలు చేస్తున్నారు. డీజిల్‌పై ఇక్కడ 24 శాతం సేల్స్ ట్యాక్స్ పడుతోంది.

## వ్యతిరేకించినందుకే వేటాడుతోంది

**పరువునష్టం కేసులో బెయిలు సందర్భంగా మోదీ సర్కార్‌పై రాహుల్ ధ్వజం**



**పట్నా:** తమ విధానాలను వ్యతిరేకించే వారిని మోదీ ప్రభుత్వం వేటాడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రభుత్వ విధానాలు, బీజేపీ–ఆరెస్సెస్ వైఖరికి వ్యతిరేకంగా గొంతు విప్పినందుకే తనపై కక్ష కట్టి కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తన పోరాటాన్ని కొనసాగిస్తానని శనివారం నాడిక్కడ విలేకరులకు స్పష్టం చేశారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ ఇక్కడి మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు.కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది. బెయిలు పొందాకా బయటకు వచ్చిన రాహుల్ కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. 'దేశంలో పేదలు, రైతులు, కార్మికుల తరపున పోరాడాలని నిర్ణయించుకున్నా. వారికి సంఘీభావం తెలియజేయడం కోసమే ఇక్కడికి వచ్చాను. మోదీ ప్రభుత్వం,బీజేపీ,ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా గొంతెత్తే వారందరినీ కోర్టు కేసులతో ఇబ్బందులు పెడుతోంది. ఎన్ని ఇబ్బందులొచ్చినా నా పోరాటం కొనసాగుతుంది' అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తనను వేధించడానికి, భయపెట్టడానికే బీజేపీ, ఆరెస్సెస్‌ల్లో ఉన్న తన రాజకీయ ప్రత్యర్థులు ఈ పరువు నష్టం కేసులు పెట్టారని ఆయన వ్యాఖ్యానించారు. గత లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ 'దొంగలందరి ఇంటి పేరూ మోదీ అనే ఎందుకుంటుందో'అని వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యకు నిరసిస్తూ సుశీల్‌కుమార్ ఆయనపై పరువునష్టం దావా వేశారు. రాహుల్ తన నేరాన్ని ఒప్పుకోకపోవడంతో జడ్జి కేసు విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేశారు.

### మద్యం సీసాలపై గాంధీ చిత్రం



**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ చిత్రాన్ని మద్యం సీసాలపై చిత్రించిన ఘటనలో ఇజ్రాయెల్ కంపెనీ క్షమాపణలు కోరిందని, ఆ చిత్రంతో మద్యం ఉత్పత్తిని నిలిపివేసిందని, సరఫరా చేసిన సీసాలను వెనక్కి తీసుకుందని విదేశాంగమంత్రి జయశంకర్ తెలిపారు. మంగళవారం జీరో అవర్ సందర్భంగా రాజ్యసభలో ఈ అంశాన్ని ఆప్ నాయకుడు సంజయ్ సింగ్ లేవనెత్తారు. దీనిపై జైశంకర్ 'ఆ సంస్థ ప్రజలకు, భారత ప్రభుత్వానికి హృదయపూర్వక క్షమాపణలు తెలిపిందని, జరిగిన దానిపై విచారం వ్యక్తం చేసింది' అని తెలిపారు.

### ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు నక్సల్స్ హతం

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ జిల్లాలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు హతమయ్యారు. జిల్లాలోని ఖల్లారి–మెచ్కా గ్రామాల్లోని అడవుల్లో జరిగిన ఈ కాల్పుల్లో మృతి చెందిన వారిలో ముగ్గురు మహిళా మావోయిస్టులున్నారు. యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా శనివారం ఉదయం స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) గాలింపు చర్యలు చేపట్టిందని రాష్ట్ర డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్ రాజ్ తెలిపారు.

### అపార్ట్‌మెంట్ కూలి ముగ్గురి మృతి

**మధురై:** నిర్మాణం జరుగుతున్న ఓ భవనం కూలి ముగ్గురు కూలీలు మృతిచెందిన ఘటన శుక్రవారం మధురై జిల్లాలోని చెక్కనూరని ప్రాంతంలో జరిగింది. మూడో అంతస్తు నిర్మిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఒకరి మృతదేహాన్ని వెలికితీయగా శనివారం ఉదయం మరో ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. నలుగురు కార్మికులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భవన నిర్మాణ కంపెనీ ఓనర్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### కాషాయం దేశం గర్వించదగ్గ రంగు

**చెన్నై:** కాషాయ వర్ణం దేశం గర్వించదగ్గ రంగు అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వ్యాఖ్యానించారు. శనివారం చెన్నైలో ఓ సదస్సులో థరూర్ ప్రసంగించారు. ఇటీవల క్రికెట్‌వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్, భారత్ జట్ల జెర్సీ(దుస్తులు) ఒకే రంగులో ఉండటంతో భారతజట్టు కాషాయరంగు జెర్సీ ధరించింది. దీంతో బీజేపీ దేశాన్నంతా కాషాయీకరణ చేయాలని చూస్తోందంటూ కాంగ్రెస్, ఎస్పీ ఆరోపించాయి. 'కాషాయం జాతీయజెండాలోని రంగుల్లో ఒకటి. అలాంటి రంగును ఒక్క పార్టీ(బీజేపీ)కే ఎందుకు పరిమితం చేస్తారు? కాషాయం దేశం గర్వించదగ్గ రంగు. నేనిప్పుడు కాషాయరంగు డ్రెస్సే ధరించాను. ఈ రంగు డ్రెస్ ధరించడం నాకెంతో ఇష్టం' అని థరూర్ అన్నారు.

### బాలికపై సామూహిక అత్యాచారం

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** పదో తరగతి చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసి, ఆపై తొమ్మిది మంది సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తమిళనాడులో జరిగింది. కోయంబత్తూరు జిల్లా ఊత్తాంగరైకి చెందిన కూలీ కుమార్తె (16) టెన్త్ చదువుతోంది. ఈనెల 4న ఆ బాలిక రోడ్డుపై నడిచి వెళుతుండగా కారులో వచ్చిన ఒక యువకుడు ఆమెను బలవంతంగా ఎక్కించుకుని వెళ్లాడు. పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా, ఆ బాలిక, యువకుడు కారులో దొరికారు. ఆ యువకుడితో పాటు 8 మంది అతని స్నేహితులు బాలికను గ్యాంగ్‌రేప్ చేసినట్లు పోలీసువిచారణలో తేలింది. మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

### సవరణ

శనివారం నాటి 'సాక్షి'ప్రధాన సంచిక రెండో పేజీలో 'మేకిన్ ఇండియా దిశగా మోదీ 2.0 బడ్జెట్' శీర్షికతో వచ్చిన వార్తలో.. వచ్చే ఐదేళ్లలో మౌలిక సదుపాయాలపై రూ.100 కోట్లు వెచ్చించనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినట్టుగా పొరపాటున ప్రచురితమైంది. దానిని రూ.100 లక్షల కోట్లుగా గమనించగలరు.

## '5 లక్షల కోట్ల' లక్ష్యం సాధిస్తాం

- తాజా బడ్జెట్ అందుకు రోడ్ మ్యాప్: ప్రధాని మోదీ
- వారణాసిలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



వారణాసిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ

**వారణాసి:** దేశ ఆర్థిక వ్యవస్థను వచ్చే ఐదేళ్లలో రూ.340 లక్షల కోట్ల (5 లక్షల కోట్ల డాలర్ల) స్థాయికి తీసుకెళ్లాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని తప్పు పట్టేవారంతా నిపుణులైన నిరాశావాదులని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. వచ్చే ఐదేళ్లలో అనుకున్న లక్ష్యాన్ని సాధించి, నవభారత్ ముందుకు దూసుకెళుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ సిద్ధాంతకర్త శ్యామా ప్రసాద్ ముఖర్జీ 118వ జయంతిని పురస్కరించుకుని వారణాసిలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన..'5 లక్షల కోట్ల డాలర్ల లక్ష్యం అవసరం ఏమిటంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. లక్ష్య సాధనకు మార్గాలు చూపడం బదులు విమర్శించడమే పనిగా పెట్టుకున్న ఇటువంటి వారిని నేను నిపుణులైన నిరాశావాదులంటాను. సాధారణ ప్రజానీకం గురించి వారికి పట్టింపు ఉండదు. వారిని మీరు ఏదైనా సలహా అడిగితే, మిమ్మల్ని సమస్యల పాలుచేస్తారు' అంటూ ఎద్దేవా చేశారు. 'లక్ష్య సాధనలో చర్చలు, విమర్శలు కూడా అవసరమే. కానీ, లక్ష్యాన్ని తప్పు పట్టడం మాత్రం సరికాదు. అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలి' అని హెచ్చరించారు. తలసరి ఆదాయం, వినియోగం, ఉత్పాదకత పెంపు ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను రెట్టింపు చేసేందుకు 2019–20 బడ్జెట్ రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని, నవభారత్ సాధన దిశగా దేశాన్ని ముందుకు దూసుకుపోయేలా చేస్తుందని ప్రధాని అన్నారు. 'కేక్ ఎంత పెద్దదన్నదే అసలు విషయం. పెద్ద కేక్ అయితే, ఎక్కువ మందికి వస్తుంది. అదే విధంగా, దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాం' అన్నారు. వచ్చే ఐదేళ్లలో రోడ్లు, నౌకాశ్రయాలు వంటి మౌలిక రంగాల అభివృద్ధికి, అందరికీ గృహకల్పన, దేశీయ ఉత్పత్తిరంగం అభివృద్ధి వంటి వాటికి రూ.100 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

### ప్రజలతో మమేకం కావాలి

పార్టీ సభ్యత్వంపై ప్రధాని మాట్లాడుతూ..'అన్ని వర్గాల ప్రజలను పార్టీతో మమేకం చేయాలి. పార్టీతో కలిసి దేశానికి రాయబారులు మాదిరిగా పనిచేయడానికి సభ్యత్వ నమోదు ఉపయోగపడాలి' అన్నారు. ఒక రోజు పర్యటనలో భాగంగా ఆయన వారణాసి విమానాశ్రయం వద్ద మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రధాని నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం 'ఆనంద్ కానన్'ను ప్రారంభించారు. జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ 118వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు ఘన నివాళులర్పించారు. 'జాతి సమగ్రతకు ఆయన అందించిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయి. ఆయన గొప్ప విద్యావేత్త, జాతీయవాది' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## పీఎన్‌బీకి 7,200 కోట్లు చెల్లించండి

**నీరవ్ మోదీకి రుణ రికవరీ ట్రిబ్యునల్ ఆదేశం**



**పుణే:** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కు రూ. 7,200 కోట్లు వడ్డీతో కలిపి చెల్లించాలని పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని రుణ రికవరీ ట్రిబ్యునల్ శనివారం ఆదేశించింది. పీఎన్‌బీని మోసం చేసిన కేసులో నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైల్లో ఉన్నాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు అనుకూలంగా రుణ రికవరీ ట్రిబ్యునల్ ప్రిసైడింగ్ ఆఫీసర్ దీపక్ కుమార్ రెండు ఉత్తర్వులు జారీ చేశారు. 'జూన్ 30, 2018 నుండి సంవత్సరానికి 14.30 శాతం వడ్డీతో రూ. 7,200 కోట్ల మొత్తాన్ని ఏకమొత్తంగా లేదా విడతలవారీగా దరఖాస్తుదారునికి (పీఎన్‌బీ) చెల్లించాలని ప్రతివాదిని, అతని భాగస్వాములను ఆదేశిస్తున్నట్టు డీఆర్‌టీ ఉత్తర్వులో పేర్కొంది. మరో ఉత్తర్వును వెలువరిస్తూ, జూలై 27, 2018 నుండి 16.20 శాతం వడ్డీతో రూ. 232 కోట్లు చెల్లించాలని న్యాయమూర్తి నీరవ్‌ని ఆదేశించారు. లేనిపక్షంలో అధికారులు తదుపరి చర్యలను ప్రారంభిస్తారని ట్రిబ్యునల్ అధికారి స్పష్టం చేశారు.

## కాలిఫోర్నియాలో మళ్లీ భూకంపం

**లాస్‌ఏంజెల్స్:** అమెరికాలోని దక్షిణ కాలిఫోర్నియాలో శుక్రవారం మరో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.1గా నమోదైంది. లాస్ ఏంజెల్స్‌లో భూకంపం కారణంగా భవనాలు కంపించాయని, విద్యుత్ సరఫరాకు అంతరాయాలు వాటిల్లాయని అధికారులు తెలిపారు. మౌలిక సదుపాయాల సంబంధమైన నష్టం అంతగా సంభవించలేదని లాస్ ఏంజెల్స్ కౌంటీ ఫైర్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. దక్షిణ కాలిఫోర్నియాలో గత రెండు దశాబ్దాల్లో ఇదే అతి పెద్ద భూకంపమని లాస్ ఏంజెల్స్ టైమ్స్ తెలిపింది. జనం ఇళ్లను వదిలిపెట్టారని, ఇళ్ల పునాదులు పగుళ్లిచ్చాయని, అడ్డగోడలు కుంగిపోయాయని శాన్ బెర్నార్డినో ఫైర్ డిపార్ట్‌మెంట్ ట్వీట్ చేసింది. లాస్ ఏంజెల్స్‌కు 240 కిలోమీటర్ల దూరంలోని రిడ్జ్‌క్రెస్ట్ అనే చిన్న నగరం ఈ భూకంపం కారణంగా భయంతో వణికిపోయింది. అసలు తాము బతుకుతామనుకోలేదని, భవనం కప్పు కూలి తనపై అక్కడున్న అతిథులపై పడిందని ఆ నగరంలో సూపర్ 8 అనే హోటల్ నడుపుతున్న భారత సంతతికి చెందిన పింకీ పాంచల్ సీఎన్ఎన్‌కి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని భూకంపాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.


భూకంపంతో దెబ్బతిన్న ఇంట్లోంచి వస్తున్న మంటల్ని ఆర్పుతున్న సిబ్బంది

# జైపూర్‌కు 'వారసత్వ' గుర్తింపు

**ప్రకటించిన యునెస్కో సమావేశం**

**న్యూఢిల్లీ:** పింక్ సిటీగా పేరు పొందిన రాజస్తాన్ రాజధాని జైపూర్‌కు ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్ర, సాంస్కృతిక మండలి (యునెస్కో) ప్రపంచ వారసత్వ నగరం గుర్తింపు లభించింది. మధ్యయుగపు రాజరిక సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన జైపూర్ ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా ప్రపంచ గుర్తింపు పొందింది. జైపూర్‌ను ప్రపంచ వారసత్వ నగరాల్లో చేరుస్తున్నట్లు యునెస్కో శనివారం ట్వీట్టర్‌లో ప్రకటించింది. అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరుగుతున్న యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 43వ వార్షిక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. యునెస్కో ఇప్పటి వరకు 167 దేశాలకు చెందిన 1,092 ప్రాంతాలను వారసత్వ స్థలాలుగా గుర్తించింది. యునెస్కో వారసత్వ ప్రాంతాలు, కట్టడాలు, సహజ నిర్మాణాల్లో అత్యధికంగా ఇటలీలో 54, చైనాలో 53, భారత్‌లో 37 ఉన్నాయి.

### నిర్మాత రెండో జయసింగ్

యునెస్కో జైపూర్‌ను వారసత్వ నగరంగా గుర్తించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. క్రీస్తు శకం 1727లో అంబర్ మహారాజు రెండో జయ సింగ్ ఈ నగరాన్ని నిర్మించాడు. తన రాజధానిని అంబర్ నుంచి జైపూర్‌కు మార్చాడు. 16వ శతాబ్దం నాటి అంబర్ కోట, గులాబీ రంగు ఇసుక రాతి కట్టడమైన హవామహల్, ఖగోళ విజ్ఞాన కేంద్రం జంతర్‌మంతర్ వంటివి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తన రాజధాని ఆతిథ్యానికి చిహ్నంగా నిలవాలన్న తలంపుతో జైపూర్ మహారాజు రాంసింగ్ నగరంలోని కట్టడాలన్నింటికీ గులాబీ రంగు వేయించాడని చెబుతారు. అందుకే దీనిని గులాబీ (పింక్)నగరంగా పిలుస్తారు.



### గుర్తిస్తే ఏమవుతుంది?

ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్‌కు చెందిన 21 దేశాల అధికారుల బృందం 2018లో జైపూర్‌ను పరిశీలించింది. ఆ బృందం వారసత్వ స్థలాల జాబితాలో చేర్చవచ్చని సూచించింది. బాకులో జరుగుతున్న సమావేశం ఆ ప్రతిపాదనను పరిశీలించి, జైపూర్‌కు వారసత్వ హోదా ఇవ్వాలని నిర్ణయించింది. దీనిద్వారా మానవ సంస్కృతీ వికాసానికి నిదర్శనంగా నిలిచిన ఈ ప్రాంతం పరిరక్షణ బాధ్యతలను యునెస్కో చేపడుతుంది. మనుషులు, జంతువులు ఈ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించకుండా, స్థానిక పరిపాలనా యంత్రాంగం నిర్లక్ష్యానికి గురి కాకుండా కాపాడుతుంది. ఇందుకు అవసరమైన నిధులను ప్రపంచ వారసత్వ నిధి సమకూరుస్తుంది.

## చిన్నారిని బలికి టీచర్ యత్నం

**ఉడాల్‌గురి(అస్సాం):** ఒక ఉపాధ్యాయుడు, ఆయన కుటుంబం కలిసి తమ మూడేళ్ల చిన్నారిని బలి ఇచ్చేందుకు చేసిన యత్నాన్ని గ్రామస్తులు, పోలీసులు కలిసి అడ్డుకున్నారు. ఈ ఘటన అస్సాంలోని ఉడాల్‌గురి జిల్లా గనక్‌పారలో జరిగింది. గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయుడి ఇంట్లోంచి శనివారం ఉదయం దట్టమైన పొగ రావడం గ్రామస్తులు గమనించి, అప్రమత్తమయ్యారు. వారు వెళ్లి లోనికి చూడగా మహిళలు సహా ఇంట్లోని వారంతా నగ్నంగా కూర్చుని పెద్దగా మంత్రాలు చదువుతున్నారు. మధ్యలో మూడేళ్ల చిన్నారిని కూర్చోబెట్టారు. ఆమె మెడ నరికేందుకు ఓ మంత్రగాడు పెద్దకత్తిని పట్టుకుని ఉన్నాడు. విషయం తెల్సి పోలీసులురాగానే రాళ్లు, ఇతర వస్తువులను ఇంట్లోనివాళ్లు విసిరారు. పోలీసులు గాలిలోకి ఐదు రౌండ్ల కాల్పులు జరిపి, అందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ కాల్పుల్లో టీచర్‌తోపాటు అతని కొడుకు గాయపడ్డారు. బలి ఇవ్వడానికి సిద్ధం చేసిన బాలిక సదరు ఉపాధ్యాయుడి మరదలి కూతురనీ, ఆమె తల్లీ ఆ పూజల్లో పాల్గొందని సమాచారం.

1498 మే 20న వాస్కోడిగామ కాలికట్ (ప్రస్తుతం కోజికోడ్)లో అడుగుపెట్టి, సముద్ర మార్గం ద్వారా భారత్‌కు వచ్చిన తొలి యురోపియన్‌గా చరిత్రకెక్కాడు.







గూగుల్.. మీకు తెలుసా.. ఓ ఎందుకు తెలియదు.. సెర్చ్ ఇంజన్ కదా.. ముద్దుగా గూగుల్ తల్లి అని కూడా పిలుచుకుంటామని ఠక్కున చెప్పేయకండి. ఎందుకంటే ఈ గూగుల్ మీరనుకునే గూగుల్ కాదు. ఈ గూగుల్ ఓ బుజ్జి అబ్బాయి. వయసు 8 నెలలు. ఉండేది ఇండొనేసియాలో. 31 ఏళ్ల ఆండీ సాపుత్ర తన బిడ్డకు మంచి పేరు పెట్టాలని చాలా నెలలు ఆలోచించాడు. ఎక్కడా కనీవినీ ఎరుగని పేరు పెట్టాలని తెగ ఆలోచించాడు ఆండీ. అందుకోసం విండోస్, ఐఫోన్, మైక్రోసాఫ్ట్, ఐవోఎస్ ఇలా చాలానే ట్రై చేశాడు. చివరికి గూగుల్ అని పేరు పెట్టాడు. ఇక్కడో మరో విశేషం ఏంటంటే ఆ అబ్బాయికి ఇంటిపేరు, చివరిపేరు ఇలా ఏమీ లేదు.. కేవలం గూగుల్..! అందుకే ఈ అబ్బాయి పేరును.. 'ప్రపంచంలోనే వింత పేరు' అనే అవార్డు వరించింది. కనీసం ఇంటిపేరు కూడా పెట్టకుండా ఒకే పేరు పెట్టడంపై అందరూ ప్రశ్నించగా.. అంత మంచి... వెరైటీ పేరును ఎందుకు పాడు చేయాలనే ఉద్దేశంతో ఏ తోకా తగిలించలేదని చెప్పుకొచ్చాడు.

మనిషి ఎలా ఉంటాడు.. ఈ ప్రశ్నకు ఎవరైనా సమాధానం చెబుతారు. అయితే మన కన్నా ముందు తరాల వారు ఎలా ఉంటారంటే.. వారి ఫొటోలు చూసో.. లేదంటే మన పెద్ద వారు చెబితేనో తెలుసుకుంటాం. కానీ వేల, లక్షల సంవత్సరాల కింద మానవుడు ఎలా ఉంటాడంటే చెబుతారా..? లేదు కదా.. 40 వేల సంవత్సరాల నుంచి ఏకంగా 16 లక్షల సంవత్సరాల కింద మానవుడిని అచ్చు గుద్దినట్లు మనకు చూపించేందుకు జర్మనీలోని మెట్‌మన్‌లో మ్యూజియం ఏర్పాటు చేశారు. అక్కడికెళితే ఆ కాలం నాటి మానవులు మన కళ్ల ముందు తిరుగుతున్న అనుభూతి కలుగుతుంది.





## నేడు, రేపు తేలికపాటి వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు చాలాచోట్ల కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ బెంగాల్, దానిని ఆనుకుని ఉన్న జార్ఖండ్ ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. ఇదిలా ఉండగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

**వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు**

కుమురం భీం జిల్లాలోని వాంకిడిలో 4 సెం.మీ., బెజ్జూరు 4 సెం.మీ., సిర్పూరు 3 సెం.మీ., ఆసిఫాబాద్ 2 సెం.మీ., భూపాలపల్లి జిల్లా 4 సెం.మీ., వెంకటాపురం 4 సెం.మీ., మొగుళ్లపల్లి 3 సెం.మీ., సుల్తానాబాద్ (పెద్దపల్లి) 3 సెం.మీ., దోమ (వికారాబాద్) 3 సెం.మీ., కొందుర్గ్‌లో (రంగారెడ్డి) 3 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

## మిషన్ భగీరథనే స్టార్ పెర్ఫార్మర్

### భగీరథపై ఉన్నతాధికారులతో స్మితా సబర్వాల్ సమీక్ష



**సాక్షి, హైదరాబాద్:** దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా 55 లక్షలకు పైగా ఇళ్లకు శుద్ధి చేసిన నీటిని నల్లాలతో సరఫరా చేయడం లేదని సీఎంఓ, మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మిషన్ భగీరథనే స్టార్ పెర్ఫార్మర్ అని ప్రశంసించారు. శనివారం మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామానికి నీళ్ల సరఫరా అవుతున్నా కూడా ఇంకా కొన్ని ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు (ఓహెచ్ఎస్ఆర్)లు నిర్మించాల్సి ఉందని, చివరి ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం కూడా అయితేనే మిషన్ భగీరథ ప్రాజెక్ట్ పూర్తయినట్టని భావించాలన్నారు. జూలై చివరి నాటికి మిగతా ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఆశించినంత వర్షపాతం నమోదు కానందున తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని సూచించారు. గురుకులాలు, సాంఘిక సంక్షేమ స్కూళ్లు, డబుల్ బెడ్‌రూం కాలనీలతోపాటు ప్రభుత్వ సంస్థలకు కూడా భగీరథ నీటినే సరఫరా చేయడంపై ప్రతిపాదనలు పంపాలన్నారు. సురక్షిత తాగునీటి వినియోగం, నీటి పొదుపుతోపాటు భగీరథ విశిష్టతపై ఆగస్టులో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 4 రాష్ట్రాల హజ్ యాత్రికులకు ఉచిత వసతి

### రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసీవుల్లా



**సాక్షి, హైదరాబాద్:** ఈ ఏడాది తెలంగాణ, ఏపీ జిల్లాలతోపాటు కర్ణాటకలో 4, మహారాష్ట్రలో 2 జిల్లాల హజ్ యాత్రికులు హైదరాబాద్ నుంచే యాత్రకు వెళ్లనున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీవుల్లా ఖాన్ వెల్లడించారు. వీరికి రాష్ట్ర హజ్ కమిటీ తరపున హజ్‌హౌస్‌లోనే ఉచితంగా వసతులు, భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. శనివారం నాంపల్లి హజ్‌హౌస్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హజ్ క్యాంప్ 2019 ఏర్పాట్లకు సంబంధించి వివిధ రకాల పనులను టెండర్ల ద్వారా కేటాయించినట్టు తెలిపారు. ఈ నెల మూడో వారంలో హజ్ క్యాంప్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల యాత్రికుల నుంచి భోజన, వసతులకు డబ్బులు తీసుకునే వారని, ఈ ఏడాది ఎలాంటి డబ్బులు తీసుకోకుండానే ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. సీఎం కేసీఆర్ హజ్ యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర హజ్ కమిటీకి ఈ ఏడాది రూ.3 కోట్లు కేటాయించారన్నారు.

## బీసీ కమిషన్ వద్దకు నేతన్నల కుటుంబాలు

**సాక్షి, హైదరాబాద్:** ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలు తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 8న జాతీయ బీసీ కమిషన్‌ను కలుస్తాయని నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ దాసు సురేష్ తెలిపారు. చనిపోయిన నేతన్నల కుటుంబాలకు తక్షణ సాయంతోపాటు వారికి స్థిర నివాస ఏర్పాటు, పిల్లలకు ఉచిత విద్య తదితర విషయాలను ఇప్పటికే కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని దాసు సురేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## 8 నుంచి బీఎస్ఎన్ఎల్ మెగామేళా

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఈ నెల 8 నుంచి 13 వరకు మెగామేళా నిర్వహిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. సంస్థ కస్టమర్ కేర్ సెంటర్లతోపాటు అవుట్‌లెట్లు, రోడ్‌సైడ్స్‌లో నిర్వహిస్తున్న ఈ మేళాలో ఆఫర్ కింద ఉచిత 3జీ స్మార్ట్‌సిమ్‌లు అందజేయనున్నారు. వినియోగదారులు ల్యాండ్‌లైన్ సహా బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఆఫర్‌తో పొందవచ్చు. మరిన్ని వివరాల కోసం 1503, 18001801503 నంబర్లను సంప్రదించాలని సంస్థ సూచించింది.

# వైద్య ప్రవేశాలకు నేటి నుంచి వెబ్ కౌన్సెలింగ్

- ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో కన్వీనర్ కోటా సీట్లకు..
- నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ వర్సిటీ
- నేటి నుంచి ఈ నెల 10 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసింది. కన్వీనర్ కోటా సీట్లకు ఇప్పటికే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి అయింది. తుది మెరిట్ జాబితా, వెబ్ ఆప్షన్ల వివరాలను సైతం విడుదల చేసింది. ఆదివారం ఉదయం 8 నుంచి 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని వర్సిటీ వర్గాలు తెలిపాయి. తుది మెరిట్ జాబితాలోని అభ్యర్థులందరూ తమ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. తమకు నచ్చిన ప్రాధాన్య క్రమంలో అభ్యర్థులు ఎన్ని వెబ్ ఆప్షన్లు అయినా పెట్టుకోవచ్చు. స్పెషల్ కేటగిరీ రిజర్వేషన్ కింద దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ అభ్యర్థులు కూడా తొలి విడత కౌన్సెలింగ్‌లోనే ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. అర్హులైన దివ్యాంగుల మెరిట్ లిస్టును యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ప్రత్యేక కేటగిరీ క్యాప్, ఎన్‌సీసీ, ఈడబ్ల్యూఎస్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి వెబ్ ఆప్షన్లకు యూనివర్సిటీ మరో నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. మరింత సమాచారాన్ని యూనివర్సిటీ వెబ్‌సైట్లు www.knruhs.in, www.knruhs.telangana.gov.in లో పొందవచ్చు.

**విద్యార్థులకు సూచనలు..**

https://medadm.apsche.ac.in వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ఇందుకు ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ వెర్షన్ 11ను వినియోగించుకోవాలి. మొబైల్‌లోగానీ, ట్యాబ్‌లలోగానీ వెబ్ ఆప్షన్లు నమోదు చేయకూడదు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కే వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన సందేశాలు వస్తాయి. సీట్ల కేటాయింపు వివరాలను రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు మెసేజ్ రూపంలో పంపుతారు. అభ్యర్థులు అలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకొని నిర్దేశించిన తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేటాయించిన కళాశాలలో ప్రభుత్వం పేర్కొన్న ట్యూషన్ ఫీజు చెల్లించి అడ్మిట్ కావాలి. నిర్దేశించిన గడువులోగా చేరని అభ్యర్థుల అడ్మిషన్ రద్దు చేస్తారు.

## తహసీల్దార్లను బదిలీ చేయండి

### ప్రభుత్వాన్ని కోరిన ట్రెసా

**సాక్షి, హైదరాబాద్:** ఎన్నికల సమయంలో బదిలీ చేసిన తహసీల్దార్లను తక్షణమే పూర్వపు జిల్లాలకు పంపాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) కోరింది. గత 9 నెలలుగా కుటుంబాలకు దూరంగా సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆ సంఘం అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈసీ నిబంధనలకు అనుగుణంగా స్థానచలనం కలిగిన తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని రెవెన్యూ కార్యదర్శికి వినతి పత్రాలు అందజేశామన్నారు. ఎన్నికల అనంతరం బదిలీలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఉత్తర్వులు వెలువడకపోవడం దురదృష్టకరమన్నారు. పొరుగు రాష్ట్రంలో తహసీల్దార్లను పూర్వపు జిల్లాల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో బదిలీలపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఈ నెల 8న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే రెండు మూడ్రోజుల్లో అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కార్యదర్శి ఎం.నారాయణరెడ్డి, నేతలు శ్రీకాంత్ రెడ్డి, రవీందర్, ఎస్.ఎల్లారెడ్డి, మనోహర్ చక్రవర్తి, రమణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభతో ఉన్నతి

### ఈయూ ఫెలోషిప్‌కు నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థిని

**నూజివీడు:** నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థిని నజ్మాసుల్తానా చదువులో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన యూరోపియన్ యూనియన్ ఫెలోషిప్‌కు ఎంపికైంది. ఈ ఫెలోషిప్ కింద ఎంఎస్ చేయడానికి నజ్మాకు ఏడాదికి రూ.20 లక్షల చొప్పున రెండేళ్లపాటు ప్రోత్సాహకం అందిస్తారు. దేశవ్యాప్తంగా ఫెలోషిప్‌కు ఇద్దరే ఎంపిక కాగా.. అందులో నజ్మా సుల్తానా ఒకరు. గుంటూరు నల్లపాడుకు చెందిన నజ్మా చదువులో చిన్ననాటి నుంచి ప్రతిభ కనబరిచేది. తండ్రి అమీర్‌బాషా మిలటరీలో కెప్టెన్‌గా పనిచేయగా, తల్లి ముజాహిదా సుల్తానా గృహిణి. నజ్మాసుల్తానా 2013లో ట్రిపుల్ ఐటీలో పీయూసీలో చేరి, తర్వాత ఇంజనీరింగ్ పూర్తి చేసింది.

# వ్యవసాయ, ఉద్యాన కోర్సుల్లో ప్రవేశాలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన జయశంకర్ వర్సిటీ
- ఈ నెల 27 వరకు దరఖాస్తులకు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియెట్‌లో బైపీసీ చదివి తెలంగాణ ఎంసెట్–2019 ఉత్తీర్ణులైన విద్యార్థులకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఫిషరీస్ సైన్స్‌లో డిగ్రీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు వ్యవసాయ కళాశాలల్లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్‌లో 432 సాధారణ సీట్లు, 75 పేమెంట్ సీట్లు, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు కళాశాలల్లో బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్‌లో 130 సాధారణ సీట్లు, 20 పేమెం ట్ సీట్లు, అలాగే పీవీ నరసింహారావు పశువైద్య విద్యాలయం పరిధిలోని 3 కళాశాలల్లో బీవీఎస్సీ అండ్ యానిమల్ హజ్బెండరీలో 158 సీట్లు, అలాగే వనపర్తి జిల్లా పెబ్బేరు, ఏపీలోని నెల్లూరు జిల్లా ముత్తుకూర్లలోని ఫిషరీస్ సైన్స్ కళాశాలల్లోని బీఎఫ్ఎస్సీలో 36 సీట్లలో ప్రవేశానికి ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ఎంసెట్–2019 ర్యాంక్ ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందన్నారు.

**పారదర్శకంగా ప్రవేశాలు..**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్‌లో 25 సీట్లు, ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్ కోటా కింద భర్తీ చేయనున్నామని.. వాటికి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సుధీర్ కుమార్ తెలిపారు. ఇంటర్ బైపీసీ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ఈ ఎన్ఆర్ఐ కోటా సీట్లకు అర్హులని, ఎంసెట్ ర్యాంక్ అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ అన్ని కోర్సులకు జయశంకర్ వర్సిటీనే కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని తెలిపారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు. ప్రవేశాలు పారదర్శకంగా ప్రతిభ ఆధారంగానే జరుగుతాయని, దళారులను, మాయమాటలను నమ్మవద్దని ఆయన కోరారు. ఇదిలావుండగా ఎన్ఆర్ఐ కోటా సీటుకు ఫీజు రూ. 34 లక్షలు, పేమెంట్ సీట్లకు రూ.14 లక్షల చొప్పున వసూలు చేయాలని యూనివర్సిటీ తన ప్రాస్పెక్టస్‌లో పేర్కొంది.

## గిరిజన రైతులకు ఆర్థికసాయం

**సాక్షి, హైదరాబాద్:** గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని గిరిజన సంక్షేమశాఖ ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ గిడ్డంగులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తుంది. శనివారం సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా అధ్యక్షతన రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 15 గిరిజన రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతిపాదనలను ఆమోదించింది. ఈ సందర్భంగా ఎక్కా మాట్లాడుతూ.. పథకం ద్వారా ఎంపికైన సంఘాలు 60 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం, 10శాతం ధన రూపంలో వాటా సమకూర్చుకోవాలన్నారు. ఈసమావేశంలో సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, అడిషన్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, ట్రైకార్ డీజీఎం శంకర్‌రావు, జీసీసీ డీజీఎం విజయ్‌కుమార్, సబ్‌కిసాన్ వెంకటకృష్ణ, నాబార్డు జీఎం షరీఫ్, ఎస్‌బీఐ ఏజీఎం భరణికుమార్, వ్యవసాయశాఖ జేడీ విజయగిరి, గిరిజనశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- ప్రథమ స్థానంలో జగిత్యాల, చివరి స్థానంలో హైదరాబాద్
- గత సంవత్సరం కంటే 7.8 శాతం పెరిగిన ఉత్తీర్ణత

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మొత్తం 50,192 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 26,898 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 50.92 శాతం మంది, బాలికలు 57.9 శాతం మంది పాసయ్యారు. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా 96.5 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, హైదరాబాద్ జిల్లాలో అతితక్కువగా 34.08 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 7 నుంచి 15 వరకు సబ్జెక్టుకు రూ. 500 చొప్పున ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా చెల్లించాలని పాఠశాల విద్య డైరెక్టర్ బి.సుధాకర్ తెలి పారు. సూచించారు. రీవెరిఫికేషన్ కోసం పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను సంబంధిత ప్రధానోపాధ్యాయుడి ద్వారా ధ్రువీకరణ సంతకం చేయించి హాల్‌టికెట్ నకలు, కంప్యూటర్ మెమో కాపీ జత చేసి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో 7 నుంచి 15లోగా సమర్పించాలన్నా రు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయానికి పోస్ట్, కొరియర్ ద్వారా పంపించే దరఖాస్తు ఫారాలను ఎట్టిపరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. దరఖాస్తు ఫారం నమూనాను www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని లేదా సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పొందొచ్చని తెలిపారు. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

## మలేరియాకు సరికొత్త విరుగుడు!

వినూత్నమైన మందు కనుగొన్న హెచ్‌సీయూ పరిశోధన బృందం

**హైదరాబాద్:** మలేరియా ఒకప్పుడు ప్రాణాంతక వ్యాధి.. అయితే ఇప్పుడు అన్ని రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఆ మందులు ఎక్కువగా వాడితే మలేరియా పరాన్నజీవులు నిరోధకతను పెంచుకుంటాయి. అందుకోసమే ఈ నిరోధకతను కూడా అడ్డుకునేందుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధకులు ప్రయోగాలు చేసి వినూత్నమైన మందును కనుగొన్నారు. మలేరియా వ్యాధికి కారణమైన ప్లాస్మోడియం వైవాక్స్ వంటి పరాన్నజీవుల్లోని డీఎన్‌ఏలో మెలికలు తిరిగి ఉన్న పోగులు (డీఎన్‌ఏ డబుల్ స్ట్రాండ్) విడిపోవడం వల్ల సాధారణంగా అవి మరణిస్తాయి. అయితే ఆ పోగులు విడిపోకుండా ఉండేందుకు ప్రాథమికంగా హోమోలాగస్ రీకాంబినేషన్ అనే ప్రక్రియ ద్వారా ఆ పోగుల మరమ్మతు చేసుకుంటాయి. ఇక్కడ పీఎఫ్‌రాడ్ 51 అనే రీకాంబినేజ్ అనే ఎంజైమ్‌ను ఆ పరాన్నజీవి వాడుకుంటుంది. ఈ మరమ్మతు ప్రక్రియను అడ్డుకుంటే పరాన్నజీవుల జీవిత కాలం తగ్గుతుందని, మలేరియా కోసం వాడే మందుల నిరోధకత తగ్గుతుందని భావించారు. ఇందుకు బీవో2 అనే మందు కనిపెట్టారు. ఇది పీఎఫ్‌రాడ్ 51 ఎంజైమ్ పనిని సమర్థంగా అడ్డుకోగలిగిందని హెచ్‌సీయూ ప్రొఫెసర్ మృణాల్‌కంటి భట్టాచార్య వివరించారు. పరిశోధన వివరాలు 'జర్నల్ ఆఫ్ బయోలాజికల్ కెమిస్ట్రీ'లో ప్రచురితమయ్యాయి. అయితే ఈ మందును తొలుత జంతువులపై ప్రయోగించి, వచ్చిన ఫలితాల ఆధారంగా మానవులపై ప్రయోగించనున్నారు. పరిశోధన బృందంలో ప్రతాప్ వైద్యమ్, దిబ్యేందు దత్తా, నిరంజన్ సంత్రమ్, ప్రొఫెసర్ సునందభట్టాచార్యలు కీలక పాత్ర పోషించారు.

# ఉత్తుత్తి ఫోన్‌కాల్‌తో ఉరుకులు, పరుగులు

- విమానాల్లో బాంబులున్నాయని బెదిరింపు
- మద్యంమత్తులో విఫలప్రేమికుడి నిర్వాకం
- తనిఖీలు చేపట్టిన సీఐఎస్ఎఫ్, ఆర్‌జీఐఏ పోలీసులు
- పోలీసుల అదుపులో నిందితుడు

**శంషాబాద్:** ఓ భగ్నప్రేమికుడి నిర్వాకానికి విమానాశ్రయ భద్రతాసిబ్బంది, పోలీసులు హైరానా పడ్డారు. విమానంలో బాంబులున్నాయంటూ ఫోన్ చేయడంతో హడలెత్తిపోయారు. పోలీసులు, భద్రతాసిబ్బంది ఉరుకులు, పరుగుల మీద విమానాల్లో తనిఖీలు చేపట్టారు. చివరికి అది ఉత్తుతిదేనని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన రోజే బెదిరింపు కాల్ రావడంతో పోలీసులు టెన్షన్ పడ్డారు. వివరాలు... శంషాబాద్ విమానాశ్రయానికి శనివారం ఉదయం 7 గంటలకు ఓ యువకుడు ఫోన్ చేసి ఇండిగో 6ఈ–188 విమానంతోపాటు ట్రూజెట్ 2 టీ 201 చెన్నై విమానంలో బాంబులున్నాయని చెప్పాడు. దీంతో సీఐఎస్ఎఫ్, ఆర్‌జీఐఏ పోలీసులు వెంటనే అప్రమత్తమై రెండు విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అణువణువూ గాలించారు. విమానాల్లో బాంబులేమీ లేవని నిర్ధారించారు. అనంతరం విమానాలు ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకున్నాయి. శంషాబాద్ డీసీపీ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నకిలీ ఫోన్ కాల్ చేసిన వ్యక్తి కె.విశ్వనాథన్(24)గా గుర్తించారు. తమిళనాడులోని చెన్నై తెయ్‌నంపేట్‌కు చెందిన విశ్వనాథన్ సికింద్రాబాద్‌లోని గ్లోబ్‌లింక్ డబ్ల్యూడబ్ల్యూ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ట్రూజెట్ 2టీ201 విమానంలో చెన్నై బయలుదేరడానికిగాను ఉదయం ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రేమ విఫలం కావడంతో తాను మానసికంగా ఇబ్బందిలో ఉన్నానని విశ్వనాథన్ పోలీసుల విచారణలో వెల్లడించాడు. భద్రతకు భగ్నం కలిగించినందుకుగాను అతడిపై పౌర విమానయాన చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు.

**కేంద్ర హోంమంత్రి వచ్చే సమయంలోనే...**

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన ఉన్న సమయంలో బాంబు బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో పోలీసులు టెన్షన్ పడ్డారు. తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఫోన్‌కాల్ వచ్చిన కొద్ది గంటల్లోనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అది కేవలం బెదిరింపు కాల్ అని తేలడంతో పోలీసులు, భద్రతాసిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.









# వైద్యులు సంఘటితం కావాలి

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్

**హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వైద్యులంతా సంఘటితం కావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ–డీహెచ్) అధ్యక్షుడు డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ సూచించారు. వైద్యుల సమస్యల్ని పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా లాలూప్రసాద్‌కు నిలోఫర్ ఆస్పత్రిలో ఆత్మీయ అభినందన సభను శనివారం ఏర్పాటు చేశారు. పలువురు వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో కలసి లాలూ ప్రసాద్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం వైద్యులు శాలువాతో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లాలూప్రసాద్ రాథోడ్ మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతులు, డాక్టర్లపై దాడులు వంటివి కొన్నేళ్లుగా అపరిష్కృతంగానే ఉన్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, వైద్యులు రవికుమార్, నరహరి, షబ్బీర్, వెంకటరమణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



రాథోడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నిలోఫర్ వైద్యులు







Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792